
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 12-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 102
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50


రంజాన్ ప్రార్థనల్లో..



గెలుపు బాధ్యత వారిదే...

సీఎం స్కెచ్...మంత్రుల మంత్రాంగం

- కమలం, కారుకు చుక్కలే..!
- ప్రచార రంగంలోకి కాంగ్రెస్ ఇన్‌చార్జీలు
- ఇప్పటికే సభలు, సమావేశాలకు ప్లాన్
- త్వరలోనే అమల్లోకి...


షబ్బీర్అలీ నివాసంలో సీఎం రంజాన్ వేడుకలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


లోక్‌సభ ఎన్నికల రణరంగానికి కాంగ్రెస్ సిద్ధమవుతున్నది. కమలం, కారును ఏకకాలంలో ఢీ కొట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ రెండు పార్టీలకు ఎన్నికల్లో చుక్కలు చూపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి భారీ స్కెచ్‌నే వేశారు. బీఆర్ఎస్, బీజేపీల్లోని బలహీనతలను ఆసరా చేసుకుని కాంగ్రెస్ విజయానికి బాటలు వేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే అధికార పార్టీ చేరికలకు గేట్లెత్తేసింది. దీంతో బీఆర్ఎస్, బీజేపీల నుంచి చాలా మంది నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనే సంకల్పంతో ముందుకు పోవాలంటూ సీఎం దిశానిర్దేశం చేస్తున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని ఆయన వదులుకోవడం లేదు. రాష్ట్రంలో 14 లేదా 15 సీట్ల గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నారు. అందుకనుగుణంగా కాంగ్రెస్ సీఎం నేతృత్వంలో...బీజేపీ, బీఆర్ఎస్ ఎత్తులకు ...13లో

అందని వైద్య బీమా

లక్ష్యానికి దూరంగా పీఎంజేఏవై

- ఔట్ పేషెంట్లకు వర్తించని పథకం
- ఫలితంగా పేదల జేబులకు చిల్లులు
- కేంద్రం ఇస్తున్నది తక్కువే
- రాష్ట్రాలపైనే అధిక భారం





దేశంలో వైద్య సేవల ఖర్చు భరించలేనంతగా పెరిగిపోతోంది. పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఏదైనా ప్రాణాంతక వ్యాధి వచ్చిందంటే ఇక అంతే సంగతులు. వైద్య బీమా ఉంటే సరేసరి. లేకుంటే...ఆ ఖర్చు తడిసిమోపెడవుతుంది. జేబులు ఖాళీ అవుతాయి. ఆస్పత్రి బిల్లులు కట్టేసరికి తల ప్రాణం తోకకు వస్తుంది. అప్పులు కూడా చేయాల్సి వస్తుంది. చివరికి కుటుంబాలు రోడ్డు మీద నిలబడాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

న్యూఢిల్లీ: 2018 నాటికి పట్టణాలలో 19.1శాతం, గ్రామాలలో 14.1శాతం మందికి మాత్రమే వైద్య బీమా ఉంది. అంటే 80శాతానికి పైగా ప్రజలు ఆస్పత్రి బిల్లులు చెల్లించాల్సిందే. దీనిని దృష్టిలో ఉంచుకొని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2018లో ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకాన్ని ప్రారంభించింది. దేశంలోని 15.5 కోట్ల పేద కుటుంబాలకు ఆస్పత్రి సేవలను అందించే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఆదాయం, ఆస్తుల దృష్ట్యా దేశ జనాభాలో చివరి స్థానంలో ఉన్న 60 కోట్ల మంది లబ్దిదారులకు దీని ద్వారా ప్రయోజనం చేకూర్చడం లక్ష్యం. ఈ పథకం కింద సంవత్సరానికి ఒక్కో కుటుంబానికి ఐదు లక్షల రూపాయల వరకూ వైద్య బీమా కవరేజీ లభిస్తుంది. ప్రపంచంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఆరోగ్య బీమా పథకాలలో ఇదే అతి పెద్దది. ఆశయం మంచిదే అయినా ఆచరణలో మాత్రం ఈ పథకం ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతోంది.

40 కోట్ల మందికి బీమా లేదు

పథకంలో అనేక లోపాలు కన్పిస్తున్నాయి. దేశంలో ఔట్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్న 40 నుండి 80 శాతం మందికి ఈ పథకం వర్తించడం లేదు. ఈ పథకం కింద చాలా రాష్ట్రాలలో వైద్యానికి అయ్యే ఖర్చులో 60 శాతం వరకూ కేంద్రమే భరించాల్సి ...13లో

కాగ్ అక్షింతలు

పథకం అమలులో అవకతవకలను, లోపాలను గత సంవత్సరం ఆగస్టులో కాగ్ ఎత్తిచూపింది. ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, పరికరాలు, వైద్యుల సంఖ్య తక్కువగా ఉంది. కొన్ని చోట్ల వైద్య పరికరాలు పనిచేయడం లేదు. అనేక ఆస్పత్రులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను, ప్రమాణాలను పాటించడం లేదు. ఆస్పత్రులు కూడా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. అనేక చోట్ల ఫిర్యాదులను పరిష్కరించే నాథుడే లేడు. వ్యాధులకు ప్రత్యేక చికిత్స అందజేస్తున్న దాఖలాలు లేవు. ఒకే ఫోన్ నెంబరు లేదా పనిచేయని నెంబరుతో అనేకమంది లబ్దిదారుల పేర్లను రిజిస్టర్ చేశారు. ఎంపికకు ముందు ఆస్పత్రులను తనిఖీ చేసి మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది లభ్యతపై సంతృప్తి చెందాల్సి ఉంటుంది. అయితే మూడు రాష్ట్రాలలో ఈ నిబంధనను పాటించలేదు. ఇక వైద్య సేవలకు అయ్యే ఖర్చుకు, బీమా కవరేజీకి మధ్య చాలా వ్యత్యాసం ఉంటోంది. ఈ తేడా 73 శాతం వరకూ ఉంటోందని అంచనా. దీంతో లబ్దిదారుల జేబులకు చిల్లులు పడుతు న్నాయి. దేశ జనాభాలో 30శాతం మందికి (40 కోట్లు) ఈ పథకం అందు బాటులో లేదని సాక్షాత్తూ నిటి అయోగ్ సంస్థే చెప్పింది.

ఓటరులో చైతన్యం 3లో..

- నిరుద్యోగం..ధరల పెరుగుదల..అభివృద్ధి పైనే దృష్టి
- వీటినే ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటున్న పౌరుడు

మోడీ పదేండ్ల పాలనపై తీవ్ర అసంతృప్తి



బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

బడ్జెట్లో రూ.20 వేల కోట్లు కేటాయించాలి



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో ఘనంగా ఫూలే 197వ జయంతి వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ బీసీలకు అనేక హామీలిచ్చి ఓట్లు దండుకుందని విమర్శించారు. ఫూలే పేరుతో రూ. 20 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని హామీ ఇచ్చినా వోట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లో ఒక్క రూపాయి కేటాయించలేదని తెలిపారు. రానున్న బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని బీసీలకు కేటాయించాలని కోరారు. ఎంబీసీలకు ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని హామీని నిలబెట్టుకోవాలని ...13లో

కేంద్రంలో అధికారంలోకి రాగానే కులగణన

ఫూలే ఆదర్శాలను ముందుకు తీసుకెళ్తాం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ - బంజారా హిల్స్

దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో కులగణన సర్వే చేపడతామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో పూలే జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి నిర్వహణ కమిటీ చైర్మెన్ చిన్న శ్రీశైలం యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి మంత్రి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. నేటి నాయకులకు ఆదర్శప్రాయుడు అని తెలిపారు. సతీ సహగమనం వంటి ...13లో

స్కాన్ చేయండి.. స్కామ్ చూడండి

బీజేపీకి వ్యతిరేకంగా తమిళనాడులో పోస్టర్లు



- ఎన్నికలకు కొన్ని రోజుల ముందే కాషాయపార్టీకి ఊహించని పరిణామం

చెన్నై : తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు జరగటానికి కొన్ని రోజుల సమయమే ఉన్నది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 19న అక్కడ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో ఈ ఎన్నికలను ...13లో

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

మార్కెట్ కమిటీలకు సీఎం హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతుల కష్టాన్ని ఎవరైనా మార్కెట్ కమిటీ అధికారులు, వ్యాపారులతో కుమ్మక్కై, తక్కువ చేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని సీఎం హెచ్చరించారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ఘటనపై సకాలంలో స్పందించి, రైతులను మోసం చేయడానికి ప్రయత్నించిన నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ...13లో

పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం

వేలాదిగా బౌన్స్ అవుతున్న ఆస్తిపన్ను చెక్కులు

- క్రిమినల్ కేసులకు జీహెచ్ఎంసీ కసరత్తు
- టార్గెట్ల కోసం సిబ్బందే చెక్కులు అడిగి తీసుకున్నారా..?
- లేక యజమానులే ఇచ్చారా?
- తప్పు ఎవరు చేసినా చర్యలు తప్పవిక
- చెక్ బౌన్సలపై జీహెచ్ఎంసీ అధికారులు ఆరా 3లో..

ఎన్నికల వ్యయం పెరుగుతోంది...!

సగానికి పైగా వాటా బీజేపీదే

- పరిమితి లేకపోవడమే ప్రధాన కారణం 3లో..
- బాండ్ల ద్వారా చేరిన సొమ్ముతో భారీగా ఖర్చు

కవితను అరెస్టు చేసిన సీబీఐ

నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న దర్యాప్తు సంస్థ



- ఇప్పటికే మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు
- అసలు ఏం జరుగుతుందో తెలియడం లేదు: కవిత లాయర్ మోహిత్ రావు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో తీహార్ జైల్లో ...3లో



పదేండ్లు మా సీఎం రేవంతే

కుల, మతాల మధ్య ఘర్షణ పెట్టి లబ్దిపొందాలని బీజేపీ ప్రయత్నం

- హరీశ్‌రావు, మహేశ్వర్ రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రఘువీర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు

నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

కుల, మతాల మధ్య ఘర్షణ పెట్టి లబ్దిపొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, ఇప్పుడు జరగబోయేవి ఆషామాషీ ఎన్నికలు కావని, దేశ ఐక్యత కోసం జరిగే ఎన్నికలని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ...5లో

గీత వృత్తిపై రియల్టర్ల పగ



వందల ఈత, తాటిచెట్లు కూల్చి, కాల్చివేత

- పట్టాభూమి పేరిట వృత్తిదారులకు అన్యాయం
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు
- కంపెనీలు, రియల్ బూమ్‌తో దెబ్బతింటున్న గీత వృత్తి
- చెట్లు కూల్చిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టాలి : కల్లుగీత కార్మిక సంఘం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతిని

కల్లుగీత వృత్తిపై రియల్టర్లు కక్షకట్టారు. గీత కార్మికుల జీవనాధారమైన ఈత, తాటి చెట్లను నరికేస్తూ వృత్తిని దెబ్బతీస్తున్నారు. విస్తరిస్తున్న కంపెనీలు, పెరుగుతున్న రియల్ ఎస్టేట్‌తో వెంచర్లను విస్తరిస్తూ తాటి, ఈత చెట్లను తొలగిస్తుండటంతో వృత్తిదారులకు వనాల్లేకుండా పోతున్నాయి. పట్టా భూముల పేరిట చెట్లను నరికేస్తూ పోవడంతో సంగారెడ్డి జిల్లాల్లో కల్లుగీత వృత్తి ఉనికే ప్రమాదంలోకి నెట్టబడుతోంది. టీఎఫ్‌టీలు, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న వేలాది మంది గీత కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. ఇది ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉంది. రియల్ వెంచర్లు వేయడం కోసం అందులో ఉన్న ఈత, తాటి చెట్లను నరికేస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో తాటి, ఈత వనాలు ఏటేటా తగ్గుతూ వస్తున్నాయి. సంగారెడ్డి పారిశ్రామీకరణ, రియల్ ఎస్టేట్ విస్తరణ వల్ల ఈ వనాల్ని నరికేస్తున్నారు. జిల్లాలో 125 కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాలు, వెయ్యి టీఎఫ్‌టీలున్నాయి. రాష్ట్రంలో 4366 సొసైటీలు, 3709 టీఎఫ్‌టీలున్నాయి. వీటిల్లో 2,18,107 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. కల్లుగీత వృత్తి ఆధారంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ...6లో

కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శిపై వేటు

విజిలెన్స్ డైరెక్టరేట్ ఉత్తర్వులు



- ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తోన్న బీజేపీ : ఆప్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి వైభవ్ కుమార్‌ను విజిలెన్స్ డైరెక్టరేట్ విధుల నుంచి తొలగించింది. తాత్కాలిక నియామకాలకు సంబంధించి కేంద్ర సివిల్ సర్వీస్ నిబంధనల ను ఉల్లంఘించి వైభవ్ కుమార్‌ను నియమించారని విజిలెన్స్ డైరెక్టరేట్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేశాడని ...13లో

ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణలో పోలీస్ పీపీగా సాంబశివరావు నియామకం

- పారదర్శకంగా కేసు దర్యాప్తు : నగర కమిషనర్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో పోలీసుల తరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రముఖ సీనియర్ న్యాయవాది సాంబశివరావును ప్రభుత్వం నియమించింది. ఈ సమాచారాన్ని సంబంధిత నాంపల్లి కోర్టుకు పంజాగుట్ట స్పెషల్ టీం అధికారులు అందజేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. పోలీసుల తరఫు వాదనలను మరింత పకడ్బందీగా కోర్టులో వినిపించటానికి గానూ సీనియర్ న్యాయవాది సాంబశివరావును ఎన్నుకున్నట్టు తెలిసింది. ఇదిలా ఉంటే ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తులో ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని గురువారం నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసు నమోదైన నాటి నుంచి ఇప్పటి వరకు దర్యాప్తును పూర్తి ఆధారాల సహాయంతో ముందుకు సాగిస్తున్నామనీ, వాటి ఆధారంగానే నిందితుల అరెస్టులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కేసులో సంబంధమున్న రాజకీయ నాయకులకు విచారణ కోసం నోటీసులిచ్చే విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకొని వెల్లడిస్తామని ఆయన స్పష్టం చేశారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ - మీర్ పేట్

నిషేధిత నల్లమందు(డ్రగ్స్) విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన అగ్రివత్ సంతోష్ దాస్(38), బుద్ధ రామ్ అలియాస్ శివాజీ ఇద్దరు స్నేహితులు.. కార్పెంటర్‌లుగా పనిచేస్తూ మీర్‌పేట్‌లోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో అక్రమ మార్గంలో రాజస్థాన్‌లో తక్కువ ధరకు నల్లమందును కొనుగోలు చేసి తీసుకొచ్చి నగరంలో పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న మీర్‌పేట్ పోలీసులు.. పక్కా సమాచారంతో ఎస్వోటీ బృందాలతో బుధవారం రాత్రి ప్రశాంత్ నగర్ వద్ద సంతోష్ దాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసులు విచారించి అతని వద్ద ఉన్న కిలోన్నర డ్రగ్స్(నల్లమందు)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంతోష్ దాస్‌ను రిమాండ్‌కు తరలించగా మరో వ్యక్తి బుద్ధ రామ్ అలియాస్ శివాజీ పరారీలో ఉన్నట్టు మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపారు.

గడ్డు కాలం ముగిసింది.. గాడిన పడుతున్నాము

- విస్తారా సిఇఒ వెల్లడి



న్యూఢిల్లీ : ఇటీవల పైలట్ల నుంచి తీవ్ర ఆందోళనను ఎదుర్కొన్న విస్తారా ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు తిరిగి పుంజు కుంటున్నట్లు ప్రకటించింది. గత వారం చోటు చేసుకున్న సర్వీసుల రద్దు, ఆలస్యంపై విస్తారా ఎయిర్‌లైన్స్ సిఇఒ వినోద్ కన్నన్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గడ్డు పరిస్థితులు తొలగి పోయాయని సిబ్బందితో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో పేర్కొన్నారు. కార్యకలాపాలు కూడా గాడిన పడ్డాయని తెలిపారు. ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త కాంట్రాక్టుతో వేతనాలు తగ్గుతాయని విస్తారా పైలట్లు అసంతృప్తితో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ నిర్ణయాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అనారోగ్యం సాకుతో వారంతా మూకుమ్మడిగా సెలవులు పెట్టారు. దీంతో మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 మధ్య సగానికి పైగా సర్వీసులు రద్దయ్యాయి. అర్థంతరంగా విమానాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీనిపై విస్తారా యాజమాన్యాన్ని రెగ్యులేటర్ డిజిసిఎ తీవ్రంగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలోనే ఆ సంస్థ పైలట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాజీకి వచ్చిందని సమాచారం. వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వటంతో వివాదం సద్దుమణిగినట్లు ఆ వర్గాలు తెలిపాయి. తాము ప్రణాళికలను మరింత పటిష్ఠంగా రూపొందించి ఉండాల్సిందని కన్నన్ పేర్కొన్నారు. ఈ అనుభవం తమకు ఒక గొప్ప గుణపాఠమని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ఆరంభం చాలా సవాళ్లతో ప్రారంభమైందని పేర్కొన్నారు. తమ ప్రయాణికుల ఇబ్బందుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించ గలిగామన్నారు. విమానాల రద్దు, ఆలస్యం వల్ల ప్రభావితమైన ప్యాసింజర్లకు తగిన పరిహారం చెల్లించామన్నారు.

జెఎల్ఆర్ ఇండియా అమ్మకాల్లో 81 శాతం వృద్ధి




న్యూఢిల్లీ : భారత్‌లో లగ్జరీ కార్ల అమ్మకాలకు డిమాండ్ పెరిగింది. టాటా గ్రూపునకు చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జెఎల్ఆర్) అమ్మకాలు రికార్డ్ స్థాయిలో పెరగడమే ఇందుకు నిదర్శనం. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో జెఎల్ఆర్ 81 శాతం వృద్ధితో 4,436 యూనిట్లను విక్రయించింది. 2009లో భారత మార్కెట్‌లో ప్రవేశించినప్పటి నుంచి ఇదే అత్యంత మెరుగైన అమ్మకాలని పేర్కొంది. అన్నింటికి మించి గత ఐదేళ్లలో ఈ ఏడాది నమోదు చేసిన వృద్ధే అత్యధికమని ఆ కంపెనీ పేర్కొంది. గడిచిన ఏడాదిలో మొత్తం రిటైల్ అమ్మకాల్లో రేంజ్ రోవర్ 160 శాతం, డిఫెండర్ 120 శాతం పెరిగాయని జెఎల్ఆర్ తెలిపింది. ఇక ఈ మధ్యే ప్రారంభమైన 2024 మోడల్ డిస్కవరీ స్పోర్ట్, రేంజ్ రోవర్ ఎవోక్ ఈ ఏడాదికి 50 శాతం, 55 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. 2024 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో మొత్తం రిటైల్ అమ్మకాలు 43 శాతం వృద్ధితో 854 యూనిట్లుగా నమోదయ్యాయి. "గతేడాదిలో జెఎల్ఆర్ ఇండియా రిటైల్ అమ్మకాల్లో రికార్డులను సృష్టించింది. రాబోయే రోజుల్లో మా వ్యూహాలను పెంచుకుని వృద్ధిపై మరింత దృష్టి సారిస్తాం. మా ఉత్పత్తి విభాగాల్లో, ముఖ్యంగా రేంజ్ రోవర్, డిఫెండర్ బ్రాండ్‌లలో గత ఏడాది మేము సాధించిన సానుకూల లాభాలు భారతదేశంలో అధిక నాణ్యత గల ప్రీమియం లగ్జరీ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తున్నాయి." అని జెఎల్ఆర్ ఇండియా ఎండి రాజన్ అంబ తెలిపారు.

మెకిన్సీలో 360 మంది ఉద్యోగుల కోత

న్యూయార్క్ : పొదుపు చర్యల్లో భాగంగా టెక్ దిగ్గజాలు వరుసగా వేటు వేస్తున్నాయి. మరోవైపు ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలకు దిగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ దిగ్గజం మెకిన్సీ 360 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనుందని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. సంస్థలో పనిచేస్తున్న వారిలో 3శాతం మందిని తొలగించే యోచనలోనూ ఉందని పేర్కొంది. డిజైన్, డేటా ఇంజినీరింగ్, క్లౌడ్, సాఫ్ట్‌వేర్ సహా పలు విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 12,000 మంది సిబ్బందిపై ఈ లేఆఫ్స్ ప్రభావం ఉండనున్నట్లు పేర్కొంది. తొలగింపులతో పాటు పలువురు ఉద్యోగుల పనితీరుపై కూడా హెచ్చరించినట్లు తెలిపింది. సుమారు 3వేల మంది ఉద్యోగులను పనితీరులో మెరుగుదల అవసరం గురించి హెచ్చరించినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.

లక్షద్వీప్‌లో

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తొలి శాఖ ఏర్పాటు



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తన సేవలను లక్షద్వీప్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. లక్షద్వీప్ రాజధాని కవరాట్టిలో తన శాఖను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అక్కడ ఏర్పాటు చేసిన తొలి ప్రయివేటు బ్యాంకింగ్ శాఖ ఇదే కావడం విశేషం. ఇటీవల పర్యాటకంలో లక్షద్వీప్‌కు విశేష ప్రచారం లభించడంతో భవిష్యత్తు పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని అక్కడ కొత్త శాఖను ఏర్పాటు చేసింది

నేడు హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ బోర్డు భేటీ

హైదరాబాద్ : ఇంజనీరింగ్, ప్రోక్యూర్‌మెంట్, నిర్మాణ రంగంలోని హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ బోర్డు ఏప్రిల్ 12న భేటీ కానుందని ఆ సంస్థ తెలిపింది. ఇందులో సర్వీసెస్, తదుపరి ప్రతిపాదనలను పరిశీలించనుందని సమాచారం. అదే విధంగా ఈక్విటీ షేర్లు, వారెంట్ల జారీ ద్వారా కంపెనీ పెరుగుతున్న వ్యాపార అవసరాల కోసం నిధుల సమీకరణ ఇతర సెక్యూరిటీలు, ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా కన్వర్టిబుల్ సాధనాలు, ప్రయివేటు ప్లేస్‌మెంట్ తదితర పద్ధతుల్లో నిధుల సమీకరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి.

లోహంతో తయారయ్యే నాణేలు చరిత్రను బహిర్గతం చేస్తాయి

- అంబేద్కర్ వర్సిటీ వీసీ సీతారామారావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ చరిత్ర లోహంతో ముడిపడి ఉందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) వీసీ కె సీతారామారావు అన్నారు. లోహంతో తయారయ్యే నాణేలు మాత్రమే ఆయా ప్రాంత, దేశ చరిత్రను బహిర్గతపరుస్తాయని చెప్పారు. 'న్యూమిస్మాటిక్స్-దక్షిణ భారత దేశ చరిత్ర పునర్నిర్మాణం'అనే అంశంపై హైదరాబాద్‌లోని అంబేద్కర్ వర్సిటీలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ పరిశోధకులు ఈ అంశాలపై దృష్టి పెడితే చరిత్రకు సంబంధించిన మరిన్ని చారిత్రక అంశాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఏఎస్ఐ డైరెక్టర్ సత్య మూర్తి ఈ ముగింపు సదస్సులో కీలకోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ పురాతన నాణేలు ప్రపంచ చరిత్రను వెలికి తీసేలా చేశాయని అన్నారు. చరిత్రకారులు పురాతన నాణేలను మరింత అధ్యయనం చేయాలనీ, తవ్వకాల్లో బయటపడే నాణేలను సేకరించి మరింత లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఈ సుధా రాణి మాట్లాడుతూ ఈ సదస్సులో అనేక చారిత్రక ఆనవాళ్లు, విభిన్నమైన నాణేలు, వాటిపై పరిశోధనలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించామని వివరించారు. సౌత్ ఇండియన్ న్యూమిస్మాటిక్స్ సొసైటీ అధ్యక్షులు రాజా రెడ్డి మాట్లాడుతూ సొసైటీని మరింత పటిష్ఠ పర్చాలనీ, దేశ చరిత్రను అధ్యయనం చేయడానికి ఈ సదస్సు దోహద పడుతుందని చెప్పారు. ఇంటాక్ (న్యూ ఢిల్లీ) గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వేద కుమార్ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగిన అత్యంత పురాతన నాణేలు సేకరించడంలో హైదరాబాద్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్ పి అనురాధ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ చారిత్రక ఆనవాళ్లు నాణేలలో నిక్షిప్తమై ఉందనీ, యువ పరిశోధకులు చారిత్రక నాణేలను సేకరించి అధ్యయనంపై దృష్టిసారించాలని సూచించారు. ఈ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాలతో కూడిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ పి చెన్నా రెడ్డి రచించిన న్యూమిస్మాటికా ఇండికా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి జి దయాకర్, డీన్ వడ్డాణం శ్రీనివాస్ సదస్సులో కార్యక్రమ వివరాలతో కూడిన నివేదికను సమర్పించారు. అన్ని విభాగాల డీన్లు, డైరెక్టర్లు, బ్రాంచ్‌ల అధిపతులు, ఇతర విశ్వవిద్యాలయాల చరిత్రకారులు, వివిధ శాఖల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో ఘనంగా పూలే జయంతి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) ప్రాంగణంలో జోతిబాపూలే 198వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి అంబేద్కర్ వర్సిటీ వీసీ కె సీతారామారావు, రిజిస్ట్రార్ ఏవిఎన్ రెడ్డి, జీఆర్సీఆర్డీ డైరెక్టర్ ఈ సుధారాణి ఈఎంఆర్సీ డైరెక్టర్ వడ్డాణం శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి పి వెంకటరమణ తదితరులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఘనంగా నివాళి అర్పించారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే పూలేకు నివాళి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ,
- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ - ముషీరాబాద్

రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే మహాత్మా జ్యోతిరావు పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్‌లో గురువారం పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంవీ రమణ మాట్లాడుతూ.. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు, వివక్షతకు గురైన బడుగు, బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయులు పూలే అని కొనియాడారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పూలే చిన్నప్పుడు ఓ సారి తన బ్రాహ్మణ మిత్రుడి పెండ్లి ఊరేగింపులో పాల్గొన్నప్పుడు వాళ్ళ కుటుంబ సభ్యులు చేసిన అవమానంతో తన జీవితం మలుపు తిరిగిందన్నారు. శూద్రులు, అతి శూద్రులు కలిసి కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పూలే కోరారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. థామస్ పెయిన్ 1791లో రాసిన రైట్స్ ఆఫ్ మెన్ అనే గ్రంథం చదవడం ద్వారా పూలే మానవ హక్కుల గురించి తెలుసుకున్నారని తెలిపారు. సావిత్రిబాయి పూలే దంపతులు నుంచి ఈ తరం చాలా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి ఎస్ సోమయ్య, కేవీపీఎస్, టీపీఎస్‌కే రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలతో స్ఫూర్తి పొందాలి

మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి స్ఫూర్తి పొందాలని మాజీ ఐ.ఓ.ఎఫ్.ఎస్, రాష్ట్ర అడిషనల్ కమిషనర్ (కమర్షియల్ టాక్సెస్) వై సత్యనారాయణ పిలుపునిచ్చారు. ముషీరాబాద్‌లోని ఎస్.ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో అకాడమీ ప్రిన్సిపల్ కే.సురేందర్ రెడ్డితో కలిసి వై. సత్యనారాయణ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ వంటి నేతలెందరో సమాజంలో అనేక వడిదుడుకులను ఎదుర్కొని దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడటంలో కృషిచేశారని కొనియాడారు.

ఈరోజు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రను అధ్యయనం చేసి దాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా సమాజాన్ని సమానంగా ఐక్యంగా నడపగలిగినటువంటి ఉత్తమ పౌరులుగా, ఆఫీసర్లుగా అవుతారని తెలిపారు. కార్యక్రమంలో పూలే స్మృతి సమితి అధ్యక్షులు ముదిగొండ సతీష్, ఉపాధ్యక్షులు సర్వయ్య, అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే సతీష్ కుమార్, కోర్సు కో ఆర్డినేటర్ జనార్దన్, దండు ఫ్యాకల్టీ ఎస్ రాజ రమేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతమైన ఆలోచనల ద్వారానే గొప్ప జీవితం

- మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలు ఆచరణీయం : బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు చైతన్యమయినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర విద్యా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో పూలే 198వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని బడుగు బలహీన వర్గాల వారికి విద్య కల్పించడానికి అహర్నిశలు పాటుపడిన త్యాగధనుడు పూలే అని కొనియాడారు. సమస్యలు ప్రతిచోటా ఉంటాయనీ, త్యాగధనులు మాత్రమే వాటిని గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. అలాంటి వారే చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే ఆలోచనలకు అనుగుణంగా నేటి యువత అడుగులు వేయాలని సూచించారు. బీసీలంతా సంఘటితంగా ఆయన ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. మహిళలు మహిళా సాధికారత ఉద్యమానికి ఆద్యుడు జ్యోతిబా పూలే అని ఎంజేపీ సొసైటీ కార్యదర్శి సైదులు చెప్పారు. సమాజాభివృద్ధికి విద్య సోపానమని ఎన్నో ఏండ్ల క్రితమే గ్రహించి సామాన్య ప్రజలను చైతన్యపరిచేలా 'గులాం గిరి' లాంటి పుస్తకాలను జ్యోతిబా పూలే రచించారని ఆయన గుర్తుచేశారు. గురుకుల విద్యాసంస్థల్లో చదువుకుని బీసీ సంక్షేమ శాఖకు ప్రిన్సిపల్ సెక్రటరిగా ఒకరు, అదే సంస్థకు కార్యదర్శిగా మరొకరు రావడం బీసీ విద్యార్థులు చేసుకున్న అదృష్టమని, వారిద్దరి నేతృత్వంలో విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదుగుతారని ఎంజేపీ జేఎస్ తిరుపతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూలే జీవిత చరిత్ర చెప్పే నృత్య ప్రదర్శన, ప్రిన్సిపల్ సెక్రెటరీ రచించిన 'అమ్మ గీసిన బొమ్మ పాట' నృత్య ప్రదర్శన, బంజారా నాట్య ప్రదర్శన, విద్యార్థులు గీసిన బొమ్మలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నాయి. బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు అలోక్ కుమార్, చంద్రశేఖర్, ఉదయ్, శ్రీనివాస్ రెడ్డి, ఎంజేపీ ఉన్నతా ధికారులు మద్దిలేటి, మంజుల, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల ఫొటోగ్రఫీకి పెరుగుతున్న ఆదరణ

- ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వన్య ప్రాణుల ఫొటోగ్రఫీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మెన్ టి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీతా కంభంపాటి, శ్రీనివాసరావు సోమంచ రాసిన "కాల్ ఆఫ్ దీ వైల్డ్ "పుస్తకాన్ని గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ 184 సంవత్సరాల ఫొటోగ్రఫీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జనం వైల్డ్ ఫొటోగ్రఫీని ఆదరిస్తున్నారని చెప్పారు. దక్షిణాదిలో టాప్‌గా ఉన్న బెంగుళూరును దాటేసి తెలుగు ఫొటో గ్రాఫర్లు ప్రపంచాన్ని చుట్టి వస్తూ విభిన్నమైన ఛాయా చిత్రాలను అందిస్తున్నారని తెలిపారు. అయితే చాలా మంది వాటిని పుస్తక రూపంలో ప్రచురించక పోవడంతో వాటికి అంతగా ప్రచారం రావడం లేదన్నారు. ఉత్తర ఆఫ్రికాలోని కెన్యా, టాంజానియా సరిహద్దుల్లోని మసాయ్ మారా ప్రాంతం ప్రపంచంలోనే అతిపెద్ద జంతువుల వలసల కేంద్రంగా పేరొందిందని తెలిపారు. ఈ అరుదైన జంతువుల వలస, వాటి మధ్య జరిగే వేటను ఇతి వృత్తంగా తీసుకుని అద్భుతమైన ఫోటోలు, కామెంట్లతో కాల్ ఆఫ్ దీ వైల్డ్ పుస్తకాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఒక ఫోటో లక్షల భావాలను ప్రతిబింబిస్తుందనీ, అదే తరహాలో సీతా, శ్రీనివాసరావులు తమ పుస్తకంలో జంతువుల వలసను కళ్లకు కట్టినట్టు చూపించారని తెలిపారు. అంతరించి పోతున్న జంతు జాలం విశేషాలను రాబోయే తరాలకు అందించేందుకు ఈ పుస్తకం ఎంతగానో తోడ్పతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మసాయ్ మారా జంతువుల వలస ప్రపంచలోనే అతి పెద్ద వలసగా చరిత్రకెక్కిందని తెలిపారు. ఇక్కడ ప్రతి ఏటా 10 లక్షలకు పైగా జంతువులు ఆహారం కోసం కెన్యా నుంచి టాంజానియాకు వలస పోయే అయ్యే క్రమంలో ఒకదానిన్నోకటి వేటాడుతుంటాయని అన్నారు. ఈ క్రమంలో జరిగే సన్నివేశాలను ప్రకృతి పిలుస్తోంది పేరుతో పుస్తక రూపంలో తీసుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీక్షణం ఎడిటర్ కె.వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ వనజ, తదితరులు పాల్గొన్నారు.

భారత వృద్ధి 7 శాతంగా ఉండొచ్చు : ఎడీబీ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 7 శాతంగా ఉండొచ్చని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) అంచనా వేసింది. ఇంతక్రితం 6.7 శాతం అంచనాతో పోల్చితే ఎక్కువ.

ప్రభుత్వ, ప్రయివేటు రంగ పెట్టుబడులు పెరగడంతో పాటుగా వినియోగ దారుల విశ్వాసంలోనూ మెరుగుదల వృద్ధికి మద్దతు చేయనుందని పేర్కొంది. వచ్చే 2025-26 జిడిపి 7.2 శాతం పెరగొచ్చని తెలిపింది. 2024-25లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.6 శాతంగా, 2025- 26లో 4.5 శాతంగా ఉండొచ్చని తెలిపింది.

ఈ ఏడాది ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 5.7 శాతానికి తగ్గొచ్చని ఎడిబి పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది. మార్చి గణంకాలు వెలుపడాల్సి ఉంది.

ఇజ్రాయిల్‌కు ఆరు వేల మంది కార్మికులు!

- ఉద్రిక్త పరిస్థితులున్నా... ఉపాధి కోసం వెళ్తున్న యువత

జెరూసలెం : గాజాపై ఇజ్రాయిల్ దారుణంగా దాడులకు పాల్పడుతున్న వేళ భారత్ నుంచి ఆ దేశానికి ఆరు వేల మందికిపైగా కార్మికులు వెళ్లనున్నారు. తక్కువ వ్యవధిలో ఇజ్రాయిల్ నిర్మాణ రంగానికి వస్తున్న విదేశీ కార్మికుల సంఖ్యలో ఇదే అత్యధికం. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్-మే నెలల్లో ఈ కార్మికులంతా ఇజ్రాయిల్ చేరుకుంటారని, దేశ నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న కార్మికుల కొరతను తీర్చడానికి సహాయపడతారని తెలిపింది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, నిర్మాణం-గృహ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్ణయం తీసుకున్న 'ఎయిర్ షెటిల్' ద్వారా ఈ కార్మికులను దేశానికి తీసుకొస్తామని వెల్లడించింది. పాలస్తీనాకు చెందిన సుమారు 80 వేల మంది కార్మికులను ఇజ్రాయిల్ ప్రభుత్వం తొలగించడంతో ఇజ్రాయిల్ నిర్మాణ రంగం తీవ్రంగా కార్మికుల కొరతను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో అత్యధికంగా ఆరు వేల మందికిపైగా విదేశీ కార్మికులు రానుండటం ఇదే మొదటిసారని ఇజ్రాయిల్ ప్రభుత్వం తన ప్రకటనలో తెలిపింది.

ఓటరులో చైతన్యం



- నిరుద్యోగం..ధరల పెరుగుదల..అభివృద్ధి పైనే దృష్టి
- వీటినే ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటున్న పౌరుడు
- మోడీ పదేండ్ల పాలనపై తీవ్ర అసంతృప్తి
- రామమందిరం వంటి భావోద్వేగ అంశాలపై అనాసక్తి
- తాజా అధ్యయనంలో వెల్లడి
- సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తప్పదు
- రాజకీయ విశ్లేషకులు,

సామాజిక కార్యకర్తలు, మేధావుల అంచనాలు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ పదేండ్ల పాలనలో దేశంలో అనేక సమస్యలు నెలకొన్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మైనారిటీలు, దళితులు, రైతులు, మహిళలు, యువత, కార్మికులు.. ఇలా ప్రతి ఒక్క వర్గమూ మోడీ కఠిన పాలనకు బాధింపబడిందని సామాజికవేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే పాలనలో దేశం ఇప్పటికే తిరోగమనంలోకి వెళ్లిందని అంటున్నారు. మతం, ద్వేషం, తిండి, వేషం, కరుడుగట్టిన జాతీయవాదం, పొరుగుదేశాలపై విషం చిమ్మటం వంటి అంశాలే కేంద్రంగా బీజేపీ పాలన సాగిందని వారు గుర్తు చేస్తున్నారు.అయితే, దేశంలోని అసలు సమస్యలకు కారణమైన నిరుద్యోగం, ధరల పెరుగుదల, అభివృద్ధిపై చర్చ జరగకుండా మోడీ



సర్కారు ఈ పదేండ్లలో విజయం సాధించిందని సామాజికవేత్తలు, మేధావులు చెప్తున్నారు. అయితే, ఎన్డీయే ప్రభుత్వంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్రమైందనీ, అభివృద్ధి ఆశించినంతగా జరగలేదన్న విషయాన్ని దేశవ్యాప్తంగా ప్రజలు గుర్తించారని వారు చెప్తున్నారు. దేశవ్యాప్తంగా ఓటర్లలో కదలిక వచ్చిందనీ, అది రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటమవుతుందని వారు జోస్యం చెప్తున్నారు. ఇది అధికార బీజేపీకి మింగుడుపడని విషయమని అంటున్నారు. ఈ మూడు అంశాలు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో చాలా కీలకంగా మారనున్నాయనీ, పార్టీలు, వాటి అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించేవి ఇవేనని వారు చెప్తున్నారు.

ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్(ఐఎల్‌ఓ) భారతదేశ ఉపాధి నివేదిక, 2024 ప్రకారం.. భారతదేశ నిరుద్యోగ శ్రామికశక్తిలో 83 శాతం మంది 30 ఏండ్లలోపు వారే కావటం గమనార్హం. యువకుల విషయంలో నిరుద్యోగ అంశం కీలకంగా మారిందనీ, రాబోయే ఎన్నికల్లో యువత నిరుద్యోగం అంశం ఆధారంగానే ఓటు వేయనున్నారని తెలుస్తున్నది. సంపన్నులు నిరుద్యోగం, ధరల పెరుగుదలను లేవనెత్తే అవకాశం తక్కువేననీ, అయితే, గ్రామీణ ఓటర్లు నిరుద్యోగం, ధరల పెరుగుదల గురించి, ఆందోళన చెందుతున్న ఇతర సమస్యలపై స్పందించే అవకాశం ఉన్నదని నిపుణులు, మేధావులు అంటున్నారు.

సాధారణ, మధ్య తరగతి ప్రజలు ధరల పెరుగుదలతో, విద్యావంతులు, యువ ఓటర్లు నిరుద్యోగంతో ఎక్కువ ఆందోళన చెందుతున్నారని తాజా అధ్యయనం ఒకటి తేల్చి చెప్పింది.రామమందిరం అంశాన్ని చాలా మంది తమకు ముఖ్యమైన అంశమని పేర్కొనకపోవటం గమనార్హం. కేవలం 8 శాతం మంది ఈ విషయంలో ఆలోచిస్తున్నారు. రామ మందిర నిర్మాణం అంశంతో భారీగా ఓట్లు రాలే అవకాశమున్నదని బీజేపీ ఇప్పటికీ భావిస్తూ వచ్చిందనీ, అయితే, ప్రజల్లో వచ్చిన ఈ మార్పు మాత్రం కాషాయపార్టీకి మింగుడుపడదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఎన్నికల వ్యయం పెరుగుతోంది...!

- సగానికి పైగా వాటా బీజేపీదే
- పరిమితి లేకపోవడమే ప్రధాన కారణం
- బాండ్ల ద్వారా చేరిన సొమ్ముతో భారీగా ఖర్చు

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల్లో పోటీ చేయడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. కోట్ల రూపాయల్లో అయ్యే ఖర్చును భరించడం సామాన్యులకు సాధ్యం కాదు. ప్రతి సంవత్సరం ఎన్నికల వ్యయం పెరుగుతోందే తప్ప తగ్గుతున్న దాఖలాలు లేవు. ఎన్నికల కమిషన్ అందజేసిన సమాచారం ప్రకారం 2013-14, 2022-23 మధ్యకాలంలో దేశం లోని రాజకీయ పార్టీలన్నీ కలిపి రూ.15,647 కోట్లు ఖర్చు చేశాయి. అయితే ఇది ఈసీకి వివిధ పార్టీలు సమర్పించిన లెక్కల్లో చూపిన వ్యయం మాత్రమే. వాస్తవానికి దీనికి అనేక రెట్లు అధికంగా ఖర్చయింది. పోనీ అధికారిక లెక్కలనే తీసుకున్నా రాజకీయ పార్టీలన్నీ కలిసి పెట్టిన ఖర్చులో ఒక్క బీజేపీ వాటాయే 55 శాతంగా ఉంది. కాంగ్రెస్ 30 శాతం, సీపీఐ(ఎం) 6 శాతం ఖర్చుతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

జాతీయ పార్టీల ఎన్నికల ఖర్చు ప్రతి సందర్భంలోనూ పెరుగుతూనే ఉంది. లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు ఈ వ్యయం మరింత అధికంగా ఉంటోంది.

2013-14లో...అంటే అధికారంలోకి రాకముందు అన్ని పార్టీల ఎన్నికల వ్యయంలో బీజేపీ వాటా 29 శాతంగా ఉంది. 2014-15 నాటికి ఇది 48 శాతం, 2019-20లో 53 శాతం, 2022-23లో 66 శాతానికి చేరుకుంది. ఎన్నికల వ్యయంలో కాంగ్రెస్ వాటా 2013-14లోనే అత్యధికంగా 58 శాతంగా ఉంది. కానీ ఆ తర్వాత అది తగ్గుతూ వచ్చింది. 2014-15లో 40 శాతం, 2019-20లో 32 శాతం, 2022-23లో 22 శాతానికి పడిపోయింది.



బీజేపీ వ్యయం అలా...

2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల వ్యయం భారీగా జరిగింది. ఎన్నికల బాండ్ల ద్వారా వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు వచ్చి పడడమే దీనికి కారణం. పైగా ఎన్నికల బాండ్ల కొనుగోలుపై పరిమితులు అంటూ ఏవీ లేవు. ఫలితంగా కార్పొరేట్ సంస్థలు పెద్ద మొత్తంలో రాజకీయ పార్టీలకు విరాళాలు అందజేశాయి. బీజేపీ 2014 ఎన్నికల్లో మీడియా ప్రకటనల కోసం రూ.342.5 కోట్లు ఖర్చు చేస్తే 2019 నాటికి ఆ ఖర్చు రూ.460.8 కోట్లకు పెరిగింది. పర్యటనల వ్యయం రూ.160.2 కోట్ల నుండి రూ.248 కోట్లకు, ఇతర ఖర్చులు రూ.6.7 కోట్ల నుండి రూ.201.5 కోట్లకు పెరిగాయి. ప్రచార వ్యయం రూ.32 కోట్ల నుండి రూ.83 కోట్లకు, ఇతర పార్టీలకు ఇచ్చిన డబ్బు రూ.0.2 కోట్ల నుండి రూ.73.7 కోట్లకు పెరిగింది. ర్యాలీల ఖర్చు మాత్రం రూ.89.5 కోట్ల నుండి రూ.47.7 కోట్లకు తగ్గింది. పార్టీ అభ్యర్థుల ఖర్చు రూ.83.1 కోట్ల నుండి రూ.149.1 కోట్లకు పెరిగింది. బీజేపీ ఎన్నికల వ్యయం 2014లో రూ.714 కోట్లు ఉండగా 2019లో అది రూ.1,264 కోట్లకు పెరిగింది.

పార్టీల వ్యయంపై పరిమితి లేదు

గత పది సంవత్సరాల కాలంలో అత్యధికంగా 2019-20లోనే రాజకీయ పార్టీలు రూ.3,073 కోట్లు ఖర్చు చేశాయి. ఆ సంవత్సరం లోక్‌సభ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేశాయి. మన దేశంలో రాజకీయ పార్టీల ఎన్నికల వ్యయంపై పరిమితి అంటూ ఏదీ లేదు. అభ్యర్థుల ఖర్చుపైనే పరిమితి విధించారు. చట్టంలోని ఈ లొసుగునే పార్టీలు అవకాశంగా తీసుకున్నాయి. ఎన్నికల ప్రచారం కోసం విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాయి.
మొత్తం వ్యయంలో ఈ ప్రచార ఖర్చే అధికంగా ఉంటుంది.

కాంగ్రెస్ వ్యయం ఇలా...

అదే సమయంలో కాంగ్రెస్ వ్యయం రూ.516 కోట్ల నుండి రూ.820 కోట్లకు పెరిగింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ మీడియా ప్రకటనలు, రవాణా పైనే ఎక్కువగా ఖర్చు చేశాయి. అభ్యర్థుల ఖర్చు కూడా బాగానే పెరిగింది. కాంగ్రెస్ విషయానికి వస్తే మీడియా ప్రకటనలపై ఖర్చు రూ.289.1 కోట్ల నుండి రూ.411.9 కోట్లకు, పర్యటనల వ్యయం రూ.121.1 కోట్ల నుండి రూ.127.8 కోట్లకు, ఇతర ఖర్చులు రూ.19 కోట్ల నుండి రూ.22.2 కోట్లకు పెరిగాయి. ప్రచార వ్యయం రూ.24.2 కోట్ల నుండి రూ.58.6 కోట్లకు పెరగ్గా ర్యాలీల ఖర్చు మాత్రం రూ.33.07 కోట్ల నుండి రూ.6.2 కోట్లకు తగ్గింది. పార్టీ అభ్యర్థుల ఖర్చు రూ.29.6 కోట్ల నుండి రూ.194 కోట్లకు పెరిగింది.రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు ప్రచారం కోసం పెట్టే వ్యయంలో 10.2 శాతం పెరగుదల ఉండవచ్చునని మీడియా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ గ్రూప్ ఎం అంచనా వేసింది.

ఎన్నికలు 'ప్రియం'

- ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో పెరుగుతున్న వ్యయం
- మొదటి జనరల్ ఎలక్షన్‌లో రూ.10 కోట్లకు పైగా ఖర్చు
- 2014 నాటికి రూ.3800 కోట్లకు పైనే
- ప్రస్తుత ఎన్నికల వ్యయం రూ. 4500 కోట్లపైనే
- వెల్లడిస్తున్న గణాంకాలు



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతోన్నది. దేశవ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు ఎన్నికల రణక్షేత్రంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. తమ అభ్యర్థుల గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తున్నాయి. బహిరంగ సభలు, ఇంటింటి ప్రచారాలు, పత్రికా ప్రకటనలు, టీవీ అడ్వర్టయిజ్‌మెంట్లు.. ఇలా పలు మార్గాల్లో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎన్నికల ఖర్చుపై పరిమితి ఉన్నప్పటికీ.. ఇందుకోసం కొన్ని పార్టీలు, వారి అభ్యర్థులు మాత్రం ఎంత ఖర్చుకైనా వెనుకాడటం లేదు.

ఈ లెక్క రూ. వందల కోట్లలో ఉంటుందనేది ఒక అంచనా. అయితే, ఈ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం అధికారికంగా చేసే ఖర్చు కూడా అదే స్థాయిలో ఉంటున్నది. ఏటికేడు ఈ వ్యయం పెరుగుతున్నది.

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1951-52లో తొలిసారిగా దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అయితే, ఆ సమయంలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం దాదాపూ రూ.10.45 కోట్లు ఖర్చు చేసింది. అంటే, ప్రభుత్వం ఆ సమయంలో ఒక్కో ఓటరుపై రూ.0.60 ఖర్చు చేసింది. ఈ ఖర్చు ప్రతి సార్వత్రిక ఎన్నికలకూ పెరిగిపోతున్నది. 2014లో 16వ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.3800 కోట్లకు పైగా ఖర్చు చేసింది. అంటే ప్రతి ఓటరుపై రూ.46 ఖర్చు అయిందన్నమాట.

మొదటి ఆరు సార్వత్రిక ఎన్నికలకు ఒక్కో ఓటరుపై చేసిన ఖర్చు రూ.1 కంటే తక్కువగా ఉన్నది. అయితే, ఇది ఏడు నుంచి 10వ ఎన్నికలకు ఒక్కో ఓటరుపై రూ.10 కంటే తక్కువగా ఉన్నది. 11 నుంచి 15వ సాధారణ ఎన్నికలకు ఒక ఎలక్టోర్‌పై రూ.10 నుంచి రూ.15.54 మధ్య అప్పటి ప్రభుత్వాలు ఖర్చు చేశాయి. అది 2014 సాధారణ ఎన్నికలలో ఒక్కో ఎలక్టర్‌కు రూ.46.40 వరకు పెరగటం గమనార్హం. కాగా, 2019 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన డేటా మాత్రం అందుబాటులో లేదు.

2015లో పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్‌పై పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన అధ్యయనాన్ని ఉటంకిస్తూ.. ఏకకాల ఎన్నికల నిర్వహణకయ్యే భారీ వ్యయం తగ్గుతుందని భారత్‌లో ఏకకాల ఎన్నికలపై ఉన్నత స్థాయి కమిటీ నివేదిక-2024 వివరించింది. "ప్రస్తుతం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు(యూటీ) లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికల నిర్వహణ వ్యయం రూ.4500 కోట్లుగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ద్వారా నిర్ణయించబడింది" అని 2015 నివేదిక పేర్కొన్నది.

2019లో రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో అప్పటి న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వివరిస్తూ.. లోక్‌సభకు అసలు ఎన్నికల నిర్వహణకయ్యే ఖర్చు మొత్తం భారత ప్రభుత్వమే భరిస్తుందనీ, రాష్ట్ర శాసనసభలకు స్వతంత్రంగా ఎన్నికలు జరిగినప్పుడు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చును భరిస్తాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ఏకకాలంలో జరిగితే, ఖర్చును సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం 50:50 ప్రాతిపదికన భరిస్తాయని వివరించారు.

శాంతి భద్రతల నిర్వహణకయ్యే ఖర్చును సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అయ్యే ఖర్చుల వివరాలను తెలియజేస్తూ.. గరిష్ఠంగా రవాణా (21 శాతం), సిబ్బందికి (15 శాతం), ఎన్నికల సామగ్రికి (11 శాతం) భత్యాలు ఖర్చు చేసినట్టు నివేదిక పేర్కొన్నది.



'ఇండియా' కూటమికి

ఓటు వేయండి

- 'కాషాయ' ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించండి

బీజేపీ సర్కారు వద్దు : ప్రజలను కోరిన త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్

అగర్తల : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని సర్కారును కూకటివేళ్లతో పెకిలించి, ప్రతిపక్ష 'ఇండియా' బ్లాక్‌కు ఓటు వేసి ప్రజాస్వామ్య, లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రజలను కోరారు. అగర్తలలో కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గానికి 'ఇండియా' కూటమి తరఫు అభ్యర్థి ఆశిష్ కుమార్ సాహా, అసెంబ్లీ ఉప ఎన్నికల అభ్యర్థి రతన్ దాస్‌లకు అనుకూలంగా జరిగిన ప్రచార ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మాణిక్ సర్కార్ తన ప్రసంగంలో అధికార బీజేపీపై విమర్శల వేడిని పెంచారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, పేలవమైన వేతనాలు, విద్య, ఆరోగ్యం ప్రయివేటీకరణ వంటివి దేశంలో ప్రబలంగా ఉన్నాయనీ, అందుకే ప్రస్తుత ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపాల్సినవసరం ఉన్నదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలకు మద్దతుగా ముందుకు రావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "ప్రజలు ఉద్యోగాలు కోల్పోతున్నారు. కంపెనీలు మూతపడుతున్నాయి. శ్రామిక వర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు లోక్‌సభ ఎన్నికల పోరు, మరోవైపు ఉనికి కోసం పోరాటం. సమావేశాలకు హాజరవటం, రాజకీయ ప్రసంగాలు వినటమే కాకుండా కుటుంబ సభ్యులను సంఘటితం చేయాలి" అని మాణిక్ సర్కార్ ప్రజలను కోరారు. "2023 (అసెంబ్లీ ఎన్నికలు)లో ఏమి జరిగిందో మీరు చూశారా? మీకు పునరావృతం (హింస) కావాలా? మీరు దీన్ని కచ్చితంగా కోరుకోరు. బయటకు వచ్చి మీ ఓటు వేయాలి. మేము మీతో ఉన్నాము. అడ్డుకుంటే రోడ్డుపై కూర్చొని నిరసన తెలపండి. మీరు మీ ఓటు వేయగలిగితే తప్ప, ఇతరులను ఓటు వేయడానికి అనుమతించవద్దు"అని ఆయన అన్నారు.

దక్షిణ జిల్లాలోని బైఖోరాలో జరిగిన ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో సీపీఐ(ఎం) త్రిపుర కార్యదర్శి జితేంద్ర చౌదరి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటమే కాకుండా దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడమేనని అన్నారు. బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పాలనలో 140 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రమాదంలో ఉన్నారనీ, అందుకే ఆ పార్టీని అధికారం నుంచి తరిమికొట్టటానికి 27 రాజకీయ పార్టీలు తమ సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి 'ఇండియా' బ్లాక్‌ను ఏర్పాటు చేశాయని ఆయన అన్నారు.త్రిపురలోని రెండు పార్లమెంట్ స్థానాలైన పశ్చిమ త్రిపుర, తూర్పు త్రిపురలలో రెండు దశల్లో పోలింగ్ జరగనున్నది. ఈనెల 19న మొదటి దశలో, 26న రెండో దశలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- త్యాగాల కోట భువనగిరిలో ఎర్ర జెండా ఎగిరేయాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- ఉద్యమ కేంద్రాల్లో ఓట్ల శాతాన్ని పెంచాలి :సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్
- మంచాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-మంచాల

దేశంలో మతోన్మాద బీజేపీని, అవకాశవాద శక్తుల్ని ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. త్యాగాల కోట భువనగిరిలో ఎర్రజెండా ఎగురవేయాలని తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలకేంద్రంలో దండేటి కార్ సత్యం గార్డెన్‌లో పార్టీ మండల కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర కమిటీ సభ్యులు సీతారాములు, పార్టీ భువనగిరి అభ్యర్థి ఎండీ జహంగీర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ చేయాలని చూసిందని, దీనికి వ్యతిరేకంగా రైతులు ఏడాది పాటు పోరాడటంతో చట్టాలను వెనక్కి తీసుకుందని తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసింద న్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. అవకాశవాద పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ఓడించాలన్నారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. పార్టీ నాయకులు మొక్కవోని దీక్షతో పని చేయాలని కోరారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టులు అనేక పోరాటాలు చేసి విజయం సాధించారన్నారు. ఈ ప్రాంతంలో పార్టీ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని మరింత పెంచాలన్నారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలపై పోరాడుతానని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. బూర్జువా పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు.

సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, శ్రీరామ్‌నాయక్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, మండల కార్యదర్శి నాగిల్ల శ్యామ్‌సుందర్, జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాస్‌రెడ్డి, జీ.నర్సింహ, డి.జగదీష్, ఈ.నర్సింహ, ఏ.నర్సింహ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.రాజు, ఆర్.స్వామి, డబ్బికార్ మమత అజయ్ బాస్, తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇన్నాళ్లో లెక్క.. ఇప్పుడో లెక్క.. ఆస్తి పన్ను చెల్లించేందుకు జీహెచ్ఎంసీకి ఇచ్చిన చెక్‌లు బౌన్స్ అయితే ఇబ్బందులు తప్పవు.. చెక్‌బౌన్స్ అయితే ఇన్నాళ్లు జీహెచ్ఎంసీ అధికారులు పెద్దగా చర్యలు తీసుకునేవారు కాదు.. మహాయితే నోటీసులివ్వడం, జరిమానాలతో సరిపెట్టేవారు. ఇప్పుడా పప్పులుడకవ్.. ఆస్తి పన్ను కోసం ఇచ్చిన చెక్‌లు బౌన్స్ అయితే క్రిమినల్ కేసులు పెట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.

గతంలో ఇచ్చిన చెక్‌లన్నింటినీ అధికారులు పోస్టు చేసేవారు. అయితే అందులో కొన్ని చెక్‌లు బౌన్స్ అయితే వాటిని గుర్తించేందుకు సదరు అధికారులు తల పట్టుకోవాల్సి వచ్చేది. వేలల్లో వచ్చిన చెక్కుల్లో ఏ చెక్ బౌన్స్ అయిందో తెలుసుకునేందుకే నెలలు పట్టేది. ఆ తర్వాత సదురు వ్యక్తిపై చర్యలు తీసుకోవడానికి మరికొంత సమయం పట్టేది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సారి పక్కాగా చర్యలు తీసుకునేందుకు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే బిల్‌కలెక్టర్లకు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా మీవైపు ఎలాంటి తప్పిదం లేకుండా ఉండాలని హెచ్చరించినట్టు తెలుస్తోంది.

బలవంతంగా చెక్‌లు తీసుకున్నారా..

జీహెచ్ఎంసీకీ మేజర్ ఆదాయ వనరు ఆస్తి పన్ను వసూళ్లే. రెసిడెంట్స్, నాన్ రెసిడెంట్‌పై వేర్వేరు ట్యాక్స్ రేట్లు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేస్తేనే పన్నులు వసూళ్లు అవుతాయి. ఈ క్రమంలో ఈ సారి ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ 2023-24 సంవత్సరానికి రికార్డ్ స్థాయిలో అద్భుతమైన వసూళ్లను సాధించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా కొందరు పన్నుచెల్లింపులో భాగంగా చెక్కులు ఇచ్చారు. అందులో ఈ సారి దాదాపు రూ.10కోట్ల విలువగల చెక్కులు బౌన్స్ అయినట్టు సమాచారం. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్‌లు రీచ్ కావడం కోసం జీహెచ్ఎంసీ సిబ్బందే యజమానుల నుంచి బలవంతంగా చెక్‌లు తీసుకున్నారా లేక యజమానులు ఇచ్చారా అనే కోణంలో ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఒక వేళ సిబ్బందే చెక్ అడిగి తీసుకుంటే మాత్రం వారిపై వేటు తప్పదు. అలా కాకుండా అప్పటికప్పుడు సిబ్బందిని పంపించేందుకు చెక్కులు ఇచ్చి, అవి బౌన్స్ చేస్తే సదురు యజమానిపై క్రిమినల్ కేసులు వేయాలని ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.

రికార్డు స్థాయిలో వసూళ్లు..

ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సుస్థిర అభివృద్ధి జరగాలంటే పన్నుల వసూలు సవ్యంగా జరగాలి. ఈ సారి ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ 2023-24 సంవత్సరానికి రికార్డ్ స్థాయిలో అద్భుతమైన వసూళ్లను సాధించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అమలుతో మంచి ఫలితాలు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది రూ. 261 కోట్లకు పైగా ఆస్తిపన్ను అదనంగా వసూలైంది. గతేడాది 2022-23లో ఆస్తి పన్ను సేకరణ రూ.1660.38 కోట్లు కాగా, 2023-24లో రూ. 1921.58 కోట్ల పన్ను వసూలైంది. చివరి రోజు మార్చి, 31న రూ.129.35 కోట్లు వసూళ్లయింది. ఎర్లీ బర్డ్ అమలుతో ఈ సంవత్సరం దాదాపు రూ. 800 కోట్ల ఆదాయం వచ్చింది. రూ.1000కోట్ల ఆదాయం పెంచుకునేందుకు ఉన్నతాధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఇదిలావుండగా ఇప్పటికే ఇచ్చిన చెక్కుల్లో కొన్ని వేల చెక్కులు బౌన్స్ కావడంతో సదరు వ్యక్తులపై చర్యలు తీసుకునేందుకు న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిసింది.

కవితను అరెస్టు చేసిన సీబీఐ

(మొదటి పేజీ తరువాయి)

జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను గురువారం సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(సీబీఐ) అరెస్ట్ చేసింది. కేసు దర్యాప్తులో సహకరించడం లేనందున ఆమెను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు కవిత భర్త అనిల్‌కు సమాచారం ఇచ్చింది. ఐపీసీ 477, 120(బీ), పీసీ చట్టం 7 సెక్షన్ల ప్రకారం ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కవితను జైలు నుంచి నేరుగా ట్రయల్ కోర్టులో హాజరుపరుచనున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా కవితను తమ కస్టడీకి ఇవ్వాలని కోరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు తీహార్ జైల్లో కస్టడీలో ఉన్న కవితను లిక్కర్ స్కాంపై విచారించేందుకు ఇప్పటికే సీబీఐ ట్రయల్ కోర్టు అనుమతి తీసుకుంది. ఇందులో భాగంగా ఈనెల 6న దాదాపు మూడు గంటల పాటు విచారించింది. అయితే కవిత విచారణకు సహకరించకపోవడంతో ఆమెను అరెస్ట్ చేసేందుకు అనుమతివ్వాలని బుధవారమే మరోసారి ట్రయల్ కోర్టులో అప్లికేషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. సీబీఐ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న కోర్టు... అందుకు అనుమతించడంతో గురువారం ఉదయం కవితను అదుపులోకి తీసుకున్నారు.

ట్రయల్ కోర్టుకు కవిత... నేడు విచారణ

సీబీఐ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ కవిత ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె తరపు న్యాయవాది మోహిత్ రావు గురువారం రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే రంజాన్ సెలవు దినం కావడంతో ఈ పిటిషన్‌ను అత్యవసర ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరపు న్యాయవాది నితేష్ రాణా వర్చువల్‌లో, మోహిత్ రావు నేరుగా వాదనలు వినిపించారు. సాధారణ న్యాయానికి వ్యతిరేకంగా సీబీఐ వ్యవహరిస్తోందని అన్నారు. ఆమె అరెస్ట్‌కు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోరారు. అయితే ఈ వాదనలపై ఎలాంటి రిలీఫ్ ఇవ్వలేమని స్పెషల్ జడ్జ్ మనోజ్ కుమార్ స్పష్టం చేశారు. సెలవు రోజు కావడంతో కేవలం అత్యవసర కేసులను మాత్రమే తాము విచారించగలమన్నారు. అయితే... తమ అప్లికేషన్‌ను పరిగణలోకి తీసుకోవాలని మోహిత్‌రావు కోరడంతో... కవిత పిటిషన్ పరిగణలోకి తీసుకున్నట్టు తెలిపారు. నేడు (శుక్రవారం) ఉదయం 10 గంటలకు ఈ పిటిషన్ పై విచారణ చేపట్టాలని రెగ్యూలర్ బెంచ్ స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా ధర్మాసనానికి సూచించారు.

ఈసీకి ఇచ్చిన సమాచారం...మీకివ్వలేం

- సాల్వే ఫీజు వివరాలు చెప్పం : రిటైర్డ్ నౌకాదళ ఉద్యోగి లోకేష్ బత్రాకు ఎస్‌బీఐ సమాధానం

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లకు సంబంధించి గత నెల 21వ తేదీన ఈసీకి అందజేసిన సమాచారాన్ని ఇవ్వడం కుదరదని రిటైర్డ్ నౌకాదళ ఉద్యోగి లోకేష్ బత్రాకు ఎస్‌బీఐ తేల్చి చెప్పింది. సమాచార చట్టంలోని కొన్ని మినహాయింపులను ఇందుకు కారణంగా చూపింది. మార్చి 11న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా బ్యాంక్ తరఫున వాదనలు విన్పించిన న్యాయవాది హరీష్ సాల్వేకు ఎంత మొత్తం ఇచ్చిందీ తెలిపేందుకు కూడా ఎస్‌బీఐ నిరాకరించింది. ఎన్నికల బాండ్లపై సమాచారాన్ని అందజేసేందుకు తనకు మరో మూడు నెలల సమయం కావాలంటూ ఎస్‌బీఐ సమర్పించిన దరఖాస్తును సుప్రీంకోర్టు ఆ రోజు తోసిపుచ్చిన విషయం తెలిసిందే. 2019 ఏప్రిల్, ఈ సంవత్సరం ఫిబ్రవరి మధ్య జారీ చేసిన ఎన్నికల బాండ్ల వివరాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత నెల 21న కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఎస్‌బీఐ అందజేసింది. అదే రోజు ఆ సమాచారాన్ని ఈసీ తన వెబ్‌సైటులో ఉంచింది. ఈసీకి ఇచ్చిన సమాచారాన్ని తనకు అందించాలంటూ బత్రా ఎస్‌బీఐని కోరారు. అయితే ఆ సమాచారం ఆర్‌టీఐ చట్టంలోని మినహాయింపుల కిందికి వస్తుందని బుధవారం బత్రాకు రాసిన లేఖలో ఎస్‌బీఐ తెలియజేసింది.

'మీరు కోరిన సమాచారం కొనుగోళ్లు, రాజకీయ పార్టీలకు సంబంధించిన వివరాలతో కూడినది. అయితే అది విశ్వసనీయమైనది. ఆర్‌టీఐ చట్టంలోని సెక్షన్ 8 (1) (ఈ), (జే) ప్రకారం దానిని బహిర్గతం చేయకూడదు' అని ఎస్‌బీఐ ఆ లేఖలో వివరించింది. దీనిపై బత్రా వ్యాఖ్యానిస్తూ సమాచారాన్ని నిరాకరించడం విచిత్రంగా ఉన్నదని చెప్పారు.


యుద్ధోన్ముఖంగా మరోసారి జపాన్!

సంపాదకీయం

రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన జపాన్ మిత్రదేశాల కూటమి నిర్దేశించిన మేరకు మిలిటరీ బదులు ఆత్మరక్షణ దళాలను ఏర్పాటుచేస్తూ రాజ్యాంగాన్ని ఆమోదించుకుంది. ఇటీవలి కాలంలో అక్కడి పాలకవర్గం తిరిగి మిలిటరీని ఏర్పాటు చేయాలని, రణతత్పర దేశంగా మారాలని, ప్రపంచ రాజకీయాల్లో తనవంతు పెత్తనం చెలాయించాలని చూస్తున్నది. బుధవారం నాడు వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్-జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా బలమైన రక్షణ సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలన్న ప్రతిజ్ఞ ఆ దిశలో వేసిన ముందుడుగు, ప్రపంచానికి ప్రమాద ఘంటిక మోగించినట్లుగా భావించాలి. చైనాను అడ్డుకోవటం ఈ దేశాల దీర్ఘకాలిక వ్యూహమే అయినప్పటికీ దాన్ని ఎన్నికల ప్రయోజనాలకు ఉపయోగించుకొనేందుకు కూడా చూస్తున్నారు. జపాన్ ప్రధాని కిషిడా మీద జనంలో తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు ఇటీవలి సర్వేలు వెల్లడించాయి. నవంబరులో జరిగే ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ రూపంలో జో బైడెన్ తీవ్ర సవాలును ఎదుర్కొంటున్నాడు. ఈ పూర్వరంగంలో జనం దృష్టిని మళ్లించేందుకు చైనా బూచిని చూపారని కూడా భావిస్తున్నారు.

> జపాన్ మీద అమెరికా రుద్దిన రక్షణ ఒప్పందం పేరుతో అమెరికా మిలిటరీ అక్కడ తిష్టవేసింది. చతుష్టయ భద్రతా సంప్రదింపులు(క్వాడ్) పేరుతో అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా ఒక కూటమిగా ఉండగా, ఆస్ట్రేలియా,బ్రిటన్,అమెరికా(అకుస్) మరో కూటమిగా ఏర్పడ్డాయి.దీనిలో జపాన్‌ను చేర్చేందుకు అడ్డదారి వెతుకుతున్నారు. ఈ పరిణామాలన్నీ ఆసియాలో ప్రత్యేకించి తూర్పు ఆసియాలో ఆందోళన కలిగిస్తున్నాయి.


ఆసియా-పసిఫిక్ ప్రాంతం లేదా మరెక్కడైనా యధాతథ స్థితిని మార్చేందుకు బలప్రయోగం లేదా ఒత్తిడి ద్వారా ఎవరైనా ప్రయత్నిస్తే దృఢంగా ఎదుర్కొంటామని ఇరువురు నేతలు అన్నారు.చైనాతో సవాళ్లను ఎదుర్కొనేందుకు చేస్తున్న కృషిని కొనసాగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఉక్రెయిన్ ఈ రోజు రష్యా దురాక్రమణకు గురైంది రేపు తూర్పు ఆసియా కావచ్చుని జపాన్ ప్రధాని ఆరోపించాడు. త్వరలో అమెరికా, జపాన్, బ్రిటన్ మిలిటరీ విన్యాసాలు జరపనున్నాయని, అవి ఏ ఒక్కదేశానికీ



వ్యతిరేకం కాదని జో బైడెన్ అన్నాడు. ఒంటరిగా లేదా మరోదేశంతో కలసి ఎవరు సైనిక విన్యాసాలు జరిపినా, వాటిలో భాగంగా ఆయుధ ప్రయోగాలు, ప్రదర్శనలు చేసినా అది బల ప్రదర్శన, కొన్ని దేశాలను భయపెట్టేందుకు తప్ప మరొకటి కాదు. బుధవారం నాడు రెండుదేశాల అధినేతలు చేసిన ప్రకటనలు ఏదో ఆకస్మికంగా చేసినవి కాదు. మరింత దూకుడుగా మిలిటరీ కూటమిని మార్చేందుకు ఏడాది క్రితమే అమెరికా-జపాన్ చేసిన ప్రకటనను జపాన్ కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకించింది. అమెరికా మిలిటరీ కమాండ్ ఆధీనంలో జపాన్ స్వయం రక్షక దళాలను ప్రతిదాడులు చేసేవిగా, ఇతర సామర్ధ్యాలను పెంచేందుకు చూస్తున్నారని, అవసరమైనపుడు శత్రుదేశాలను దెబ్బతీస్తామని బహిరంగంగా చెప్పటమేనని కూడా పేర్కొన్నది. ఇప్పటివరకు ఉన్న ఇరుదేశాల ఒప్పందానికి ఇది పూర్తి వ్యతిరేకమని కమ్యూనిస్టు పార్టీ చెప్పింది.రెండవ ప్రపంచ యుద్ధం తరువాత తీసుకున్న విధానాన్ని కేవలం ఒక మంత్రివర్గ తీర్మానంతో మార్చి వేస్తున్నారని, పార్లమెంటును, దేశ ప్రజలను సంప్రదించలేదని విమర్శించింది. హీరోషిమా, నాగసాకీ ఉదంతాలను చూసిన తరువాత మరోసారి తమ దేశం మిలిటరీ శక్తిగా మారకూడదని, శాంతికి ముప్పుతేకూడదని జపనీయులు భావిస్తున్నారు.

తమను చక్రదిగ్బంధనం చేసేందుకే ఇదంతా అని చైనా భావిస్తున్నది.దానికి అనుగుణంగా తన మిలిటరీ శక్తిని అది మెరుగు పరుచుకుంటున్నది. తైవాన్ దీవి చైనాలో అంతర్భాగమే అయినప్పటికీ దాన్ని బలవంతంగా విలీనం చేసుకొనేందుకు అంగీకరించేది లేదని అమెరికా, దాన్ని సమర్ధించే దేశాలు ఒకవైపు పదేపదే చైనాను రెచ్చగొడుతున్నాయి. మరోవైపు దక్షిణ చైనా సముద్రంలోని దీవులను ఆక్రమించుకొనేందుకు చైనా పూనుకున్నదని, నౌకా రవాణా స్వేచ్ఛగా జరిగేందుకు అవరోధాలు సృష్టిస్తున్నదనే ఆరోపణలతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను సృష్టిస్తున్నాయి. చైనా ఆధీనం లోని కొన్ని దీవులు తమవంటూ ఫిలిప్పైన్స్ ఇటీవల వాటిలో ప్రవేశించేందుకు చూడటం దానిలో భాగమే.ప్రబల అర్థిక శక్తిగా ఎదుగుతున్న చైనాను దెబ్బతీసేందుకు అమెరికా దీర్ఘకాలంగా పన్నుతున్న వ్యూహాలలో జపాన్ కీలకమైనది. వర్తమాన రాజ్యాంగం ఉనికిలో ఉన్నంత వరకు జపాన్ ఏ మిలిటరీ కూటమిలోనూ చేరేందుకు అవకాశం లేదు. అందుకే పక్కదారులు వెతుకుతున్నారు. జపాన్ మీద అమెరికా రుద్దిన రక్షణ ఒప్పందం పేరుతో అమెరికా మిలిటరీ అక్కడ తిష్టవేసింది. చతుష్టయ భద్రతా సంప్రదిం పులు(క్వాడ్) పేరుతో అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా ఒక కూటమిగా ఉండగా, ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికా(అకుస్) మరో కూటమిగా ఏర్పడ్డాయి. దీనిలో జపాన్‌ను చేర్చేందుకు అడ్డదారి వెతుకుతున్నారు. ఈ పరిణామాలన్నీ ఆసియాలో ప్రత్యేకించి తూర్పు ఆసియాలో ఆందోళన కలిగిస్తున్నాయి.

'చందా'మామగా మారిన మోడీ!



డాక్టర్ దేవరాజు మహారాజు

"నరేంద్రమోడీకి దమ్ముంటే మణిపూర్ వెళ్లి అక్కడి ప్రజలకు ప్రాణప్రతిష్ట చేయాలి. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్టకు హాజరు కాని శంకరాచార్యులపై ఈడితో రైడ్‌లు చేయించాలి. అసలు నరేంద్ర మోడీ ఈ దేశ ప్రధాన మంత్రా లేక దేశంలోని దేవాలయాలన్నింటికీ ఆయనే ప్రధాన అర్చకుడా? పదేళ్ళలో ఒక్కటంటే ఒక్క ప్రెస్‌మీట్ పెట్టని ఆయన, ప్రాంప్టర్స్ లేకుండా మట్లాడలేని ఆయన, తనకు యాభై ఆరు అంగుళాల ఛాతి ఉందని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి కదా? ఈ దేశంలో దైవ విశ్వాసకులంతా గాంధీ నమ్మిన రాముణ్ణి నమ్ముతున్నారు. మోడీ, షా, యోగి, బీజేపీ, ఆరెస్సెస్‌లు మాత్రం నాథూరామ్‌ను నమ్ముతున్నారు"- అని పార్లమెంట్‌లో ప్రకటించాడు-జాన్ బ్రిటస్ కేరళ రాజ్యసభ యంపి! అంతే కాదు. ఈ దేశద్రోహుల్ని నమ్మగూడదని ఆయన ఈ దేశ ప్రజలకు ఒక హెచ్చరిక కూడా చేశాడు. ఎలక్టోరల్ బాండ్స్ విషయంలో ఏం తేలిందీ? "చందా ఇవ్వు-దందా చేస్కో" అని మోడీ ప్రభుత్వం లెక్కలేని అవినీతికి పాల్పడిందని వెల్లడయ్యింది కదా?

స్వతంత్ర భారతావనిలో ఎన్నడూ ఎరగని విధంగా ఎన్నికల కమిషన్ అధికారులని కొనేసి చండీఘర్ మేయర్ పదవికి రేటు కడదామనుకున్న దుష్ట ప్రణాళిక ఎవరిదీ? మోడీ అండ్ పార్టీదే కదా? పైగా కనీవినీ ఎరగని రామభక్తి పారవశ్యంలో కండ్లు

> నేలను దున్ని ఈ దేశానికి అన్నం పెడుతున్న రైతులు ప్రధాని మోడీ ఇంటికీ, ఆఫీసుకీ కూత వేటు దూరంలో ఢిల్లీ సరిహద్దుల్లో ధర్నా చేస్తుంటే పోయి మాట్లాడి సమస్య పరిష్కరించడానికి తీరికలేదు- చిత్తశుద్ది లేదు. వారి మీద డ్రోన్‌లు ఉపయోగించి, బాష్పవాయువు ప్రయోగించ మంటాడు. వారిపై బుల్లెట్ల వర్షం కురిపించమంటాడు. రోడ్డు మీద మేకులు కొట్టిస్తాడు. అవన్నీ దాటుకుని వస్తారేమోనన్న భయంతో రోడ్లు కోయించి, గోతులు తవ్విస్తాడు. ఇన్ని చేసినవాడు పారిపోయి సముద్రంలో దాక్కుంటాడు. అదేమంటే ద్వారక భూమికి పూజ చేస్తున్నానని ఫొటో షూట్ చేయించుకుంటాడు. అసలు ఫొటోషూట్ ఎప్పుడు చేయించుకోలేదూ? ఎక్కడ చేయించుకోలేదూ? బతుకే విచిత్ర వేషధారణ అయినట్లు ఫొటో షూట్ చేయించుకునే వ్యక్తికి ఇక పరిపాలనకు తీరిక ఎక్కడా?

మూసుకుపోయినట్టు నటించాడు కదా? ఏం నటన అదీ? ఆస్కార్ కూడా తల దించుకునేంత అసహ్యకరమైన కుటిలనటన! మెజార్టీ ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కార్పోరేటర్లను కొని, ఎన్నికల అధి కారులను కొని, బీజేపీకి వ్యతిరేకంగా పడిన బేలట్ పేపర్లపై గీతలు గీయించి, చెల్లనివిగా చేయించి, ఎలాగైనా మేయర్ పదవి దక్కించుకోవాలని ప్రయత్నించి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు అడ్డంగా దొరికిపోయిన మోడీ సత్యనిష్టాగరిష్టుడా? ఇలాంటివాడు గనకనే పీఠాధిపతులంతా అయోధ్య రాముడికి ఈయన ప్రాణప్రతిష్ట చెయ్యొద్దని గగ్గోలు పెట్టారు. ఈ రోజు ఏమైందీ? రామభక్తులంతా తల దించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామ భక్తులు, మోడీ భక్తులు నిజాలు గ్రహించాల్సిన అవసరం వచ్చింది. మోడీ ఒక దేవుడి అవతారంగా భావించే అంధ విశ్వాసకుల కండ్లు ఇకనైనా తెరుచుకోవాలి. ఎందుకంటే, ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాని మోడీకి ఊపిరి ఆడనివ్వడం లేదు. అందుకే శ్రీ కృష్ణ కుచేలుల కథ ముందుకు తెచ్చి - "అదే ఈ కాలంలోనైతే కుచేలుడు శ్రీకృష్ణుడు ఇద్దరూ అవినీతి పరులయ్యేవారు. అని తన అక్కసు వెళ్ళగక్కుకున్నాడు. నిజానికి తన అవినీతి. తన పార్టీ అవినీతి బయటపడిందని ఆయన తన ఉక్రోషం వెళ్ళగక్కుకున్నాడని - ఈ దేశ ప్రజలకు అర్థమయ్యింది.

నేలను దున్ని ఈ దేశానికి అన్నం పెడుతున్న రైతులు ప్రధాని మోడీ ఇంటికీ, ఆఫీసుకీ కూత వేటు దూరంలో ఢిల్లీ సరిహద్దుల్లో ధర్నా చేస్తుంటే పోయి మాట్లాడి సమస్య పరిష్కరించడానికి తీరికలేదు- చిత్తశుద్ధి లేదు. వారి మీద డ్రోన్‌లు ఉపయోగించి, బాష్పవాయువు ప్రయోగించమంటాడు. వారిపై బుల్లెట్ల వర్షం కురిపించమంటాడు. రోడ్డు మీద మేకులు కొట్టిస్తాడు. అవన్నీ దాటుకుని వస్తారేమోనన్న భయంతో రోడ్లు కోయించి, గోతులు తవ్విస్తాడు. ఇన్ని చేసిన వాడు పారిపోయి సముద్రంలో దాక్కుంటాడు. అదేమంటే ద్వారక భూమికి పూజ చేస్తున్నానని ఫొటో షూట్ చేయించుకుంటాడు. అసలు ఫొటోషూట్ ఎప్పుడు చేయించుకోలేదూ? ఎక్కడ చేయించుకోలేదూ? బతుకే విచిత్ర వేషధారణ అయినట్లు ఫొటో షూట్ చేయించు కునే వ్యక్తికి ఇక పరిపాలనకు తీరిక ఎక్కడా? తన తల్లి దగ్గరికి వెళ్ళినా యాభై మంది కెమెరా మెన్‌లతో వెళ్ళిన గొప్ప పుత్ర రత్నం. ప్రపంచ మంతా వెతికినా మరొకరు దొరకరు కదా? ఇప్పటికైనా ఈ దేశ ప్రజలు నిజాలు గ్రహించి ఈ అబద్ధపు రాజును ఓ మూల కూర్చోబెడితే గాని ఈ దేశం బాగుపడదు. సముద్రంలో రెడ్ కార్పెట్ మీద కూర్చుని పోజులిచ్చాడంటే-ఈ దేశ ప్రజలు ఏమని ఆలోచించాలి' అతణ్ణి శాశ్వతంగా అందులోనే కలిపేయాలని నిర్ణయించుకోవాలి కదా? అతడి ఉత్తుత్తి యాక్షన్లను జనం నిజం చేసి చూపించాలని కదా? కన్నతల్లిని, కట్టుకున్న భార్యను దూరం పెట్టి ఈ దేశ ప్రజల సొమ్ముతో విదేశాల్లో బలాదూరు తిరిగే వాడు- ఈ దేశ ప్రజల బతుకులు ఉద్ధరిస్తాడని ఎలా నమ్ముదాం? కట్టుకున్న భార్యకు విడాకులివ్వకుండా వదిలేసిన ఈ అనైతికజీవి-అబద్ధాల బ్రాండ్ ఎంబాసిడర్ "ఈ దేశ ప్రజలే నా కుటుంబం"! అని అంటే ప్రజలు నమ్ముతారా? పదేండ్లుగా చూస్తున్నాం కదా? కోట్ల రూపాయల విలువగల సూట్లు వేసుకుని తిరగడం కోట్లు విలువ చేసే తిండి తినడం కోట్లు ఖర్చు చేసి దేశ దేశాలు తిరిగిరావడం - సరే కాని దేశానికి ఆవగింజంత మేలు జరిగిందా? లేదు కదా? ఎంత ఖరీదైన దుస్తులు వేసుకున్నా, ఎంత మేకప్ చేసుకున్నా - దేశాన్ని మరింత పేదరికంలోకి నెట్టిన ప్రేతకళ ఆయన ముఖంలోనూ ఆయన టీం సభ్యుల ముఖాల్లోనూ తాండవమాడుతునే ఉంది కదా?



"ప్రతి తల్లీ ప్రతి కూతురూ నాకు స్వరూపిణియే. నాకు తల్లులూ చెల్లెళ్ళూ అందరూ శక్తి స్వరూపణులే నేను భారతమాత పూజారిని"- అని గొంతు చించుకుని చెప్పుకున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ - మరి, ఈ కింది సమస్యలు ఎదురైనప్పుడు ఎందుకు నోరు కుట్టేసుకున్నారు? ఏ శక్తి ఆయనని ఆపిందీ?

1. ఢిల్లీలో ఆయన ఇంటి ముందే మహిళా రెజిలెర్స్ (పహిల్వాన్‌లు) లైంగిక దాడులకు గురైనప్పుడు ఏమైంది? వారు శక్తి స్వరూపిణులు కారా - ప్రపంచ మీడియా ఈ దేశ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా కడిగేసింది కదా?

2. కతువా, ఉన్నావ్, హత్రాస్‌లలో శారీరక దోపిడీలకు గురైన మహిళలంతా శక్తి స్వరూపిణులు కారా? వారు తల్లులూ, అక్కా చెల్లెళ్ళూ, కూతుర్లూ కారా?

3. కాన్పూర్‌లో ఇద్దరు మైనర్ బాలికలు ఉరేసుకుంటే- ఈ శక్తి పూజారికి ఈ భరతమాత పూజారికి- ఒక్క చీమైనా కుట్టలేదా? అవసరమైనప్పుడు చెవిటివాడిగా, తప్పని సరైనప్పుడు గుడ్డివాడుగా ఉండడం ఆయన నటనా కౌశల పాండిత్య ప్రదర్శన లో భాగమేనా?

4.మణిపూర్‌లో మహిళలు రేప్ చేయబడి, నగ్నంగా ఊరేగించబడ్డప్పుడు ఆయనలోని పూజారి ఏమయ్యాడు? భరత మాతనే నగ్నంగా ఊరేగించినట్టుగా ఉందని అవమాన భారంతో దేశ ప్రజలు అట్టుడికి పోయారే-అప్పుడు కూడా ప్రపంచ మీడియా కన్నెర్ర చేసిందే? మరి అప్పుడు ఈయన కేమయ్యిందీ? ఈయన పూజారితనానికేమయ్యింది? ఈయన అంటున్న ఆ శక్తిని వెనక ఉండి అంతహీనంగా చేయించింది ఈయనే కదా? కనీసం నోరు విప్పలేదు, క్షమాపణ కోరలేదు. వెళ్లి కనీసం ఈ నాటికీ సానుభూతి చూపలేదు కదా? నోరు ఎవరు కుట్టేశారూ? అనవసరమైన వాటి మీద గొంతు చించుకునే ఈ నాటకాల రాయుడు స్పందించ లేదెందుకూ? ఇలాంటి ఎన్నెన్నో సందర్భాలలో భారత ప్రధాని నోరు ఎందుకు మెదపలేదో, ఎందుకు కాలు కదిపి అక్కడికి వెళ్లలేక పోయాడో- 'నేషన్ వాంట్స్ టు నో' అండీ! తమాషాకన్నా ఊరికే మాటలు చెప్పడం కాదు. "ఆధ్యా త్మికత - అనేది మనిషిని అజ్ఞానిగా ఆలోచనాహీనుడిగా, పరాధీనుడిగా, బానిసగా, ప్రశ్నించలేని వాడిగా నిష్క్రియా శీలుడిగా, తయారు చేసే ఒక ప్రక్రియ" అన్నది ఈ దేశంలోని యువతీ యువకులు గ్రహిస్తున్నారు. ఇప్పుడిక రామాలయాలు, పూజారి వేషాలూ పనిచేయవు రాముణ్ణి నమ్మే జనం ఉన్నా నాథూరామ్‌ను నమ్మే ప్రజలు లేరు. ఆ పని బీజేపీ, ఆరెస్సెస్ చేసుకోవాల్సిందే!

ఒక ఏనుగూ, మురికి గుంటలోంచి లేచి వచ్చిన పందీ-రెండూ ఒక చిన్న వంతెన మీద ఎదురు పడ్డాయి. ఏనుగు పక్కకు తొలగి పందికి దారిచ్చింది. అంతే తనకు ఏనుగు భయపడుతోందని పంది ప్రచారం మొదలు పెట్టింది "అలా ఎందుకు చేశావని" కొన్ని జంతువులు ఏనుగును అడిగాయి. "నిజమే! ఒక్క తొక్కు తొక్కితే పంది చస్తుంది. కాని దాని మీద ఉన్న బురద నా మీద పడుతుంది. ఆ బురద కడుక్కోవడం మళ్లీ నాకొక పెద్ద పని- అందుకని అలా

> ఒక ఏనుగూ, మురికి గుంటలోంచి లేచి వచ్చిన పందీ-రెండూ ఒక చిన్న వంతెన మీద ఎదురు పడ్డాయి. ఏనుగు పక్కకు తొలగి పందికి దారిచ్చింది. అంతే తనకు ఏనుగు భయపడుతోందని పంది ప్రచారం మొదలు పెట్టింది "అలా ఎందుకు చేశావని" కొన్ని జంతువులు ఏనుగును అడిగాయి. "నిజమే! ఒక్క తొక్కు తొక్కితే పంది చస్తుంది. కాని దాని మీద ఉన్న బురద నా మీద పడుతుంది. ఆ బురద కడుక్కోవడం మళ్లీ నాకొక పెద్ద పని- అందుకని అలా చేశానని" చెప్పింది ఏనుగు. తన విలువ తన స్థాయి ఏమిటో తెలుసుకోకుండా దుష్ప్రచారానికి దిగింది వరాహావతారం! సమాజంలో కొందరు మనుషులు, కొన్ని రాజకీయ పార్టీలు కూడా అంతే!

చేశానని" చెప్పింది ఏనుగు. తన విలువ తన స్థాయి ఏమిటో తెలుసుకోకుండా దుష్ప్రచారానికి దిగింది వరాహావతారం! సమాజంలో కొందరు మనుషులు, కొన్ని రాజకీయ పార్టీలు కూడా అంతే! వారి స్థాయి ఏమిటో వారు గ్రహించుకోరు. ఎదుటివారి సామర్థ్యాన్ని కూడా అంచనా వేయలేరు. ఇది ఈ దేశ కాల పరిస్థితులకు కూడా అన్వయించుకోవచ్చు. సహనం, సంయమనం పాటిస్తున్న ఈ దేశ ప్రజలు ఏనుగులాంటి వారే. వారి మంచితనాన్ని ఆసరా చేసుకుని ఎగిరెగిరిపడే వరాహమూర్తులే మన ప్రస్తుత బీజేపీ నాయకులు. ప్రజా ఏనుగు ఇప్పుడు బురద కడుక్కుందామని అనుకుంటోంది. అందుకే తొక్కెయ్యడానికి సిద్ధంగా ఉంది!

ఒక వ్యక్తి ఏదో తప్పు చేశాడన్న అనుమానంతో ఆ దేశపు రాజు అతనికి జైలు శిక్ష విధించాడు. అలా నెలలు, ఏండ్లుగా ఆ వ్యక్తి జైల్లో బందీగా ఉన్నాడు. జైల్లో విసిగిపోయి, ఆహారం అందించే భటుడి సహాయంతో ఎలాగైనా బయటపడాలనుకున్నాడు- జైల్లోని వ్యక్తి! బయట పడే మార్గం ఆలోచించుకునే క్రమంలో తలుపుతోశాడు. అంతే - అది తీసే ఉంది. తెరుచుకుంది. అయితే, బయటంతా చీకటిగా ఉంది. అందులోంచి ధైర్యంగా నడిచి వెళుతూ ఉంటే ఎవరూ అడ్డుపడలేదు. అలా నడిచి, నడిచి వెలుగులోకి వెళ్లాడు. అప్పుడసలు విషయం గ్రహించాడు. అమా యకత్వం, మంచితనం, అపరాధ భావన, వ్యాకులత వంటి వాటి మధ్య తను ఈ పదేండ్లు బందీగా ఉండిపోయానా? అని అనుకున్నాడు. వాటినుంచి ఎప్పుడో బయట పడాల్సింది-అని కూడా అనుకున్నాడు. అసలు విషయం గ్రహిం చాడు ఇప్పుడు ఈ దేశ ప్రజలంతా అలాంటి పరిస్థితుల్లో ఇరుక్కున్న వాళ్లే-సత్వరం మేల్కొని, పునరుద్ధరించుకుని బయట పడాలి! చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దేశ కాల పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చుకోవాలి. అబద్ధాల్ని నిజాలతోను, అనైతికతను నైతికతతోనూ, అజ్ఞానాన్ని జ్ఞానంతోనూ, మోసాల్ని వివేకంతోనూ... ఛేదిస్తూ - 'మానవ్ మానవ్ ఏక్ సమాన్'- నినాదంతో ముందుకు కదలాలి. ఊరికే నిశ్చేష్టులై చూస్తున్నంత కాలం మార్పు రాదు! కదలాలి!! తోటి వారిని కదిలించాలి!! పునర్నిర్మాణ కార్యక్రమం సత్వరం ప్రారంభించాలి. రాముడు ఒక కల్పిత పాత్ర అనీ, నాథూరామ్ ఒక దేశ ద్రోహి అని చెప్పకుండా, అబద్ధాలతో అధికారంలో కొనసాగుదామని అనుకుంటే వారికి బుద్ధి చెప్పాలి. అందుకే ఆస్కార్ వైల్డ్ అన్నాడు- "ప్రతి అబద్ధం విషంలాంటిది. హానిచేయని అబద్ధాలు ఉండవు. కేవలం యదార్థమే సురక్షితం, క్షేమకరం-అది ఏ రకంగానూ పగులగొట్ట లేని ఘృతం లాంటిది!" అని!

- కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్ర వేత్త
(మెల్బోర్న్ నుంచి)

మెయిల్ @ నవతెలంగాణ

పాఠశాలల ప్రక్షాళన అత్యవసరం!

6-14 సంవత్సరాల వయసు గల వారి కోసం, 2009లో ఉచిత నిర్బంధ విద్యాచట్టం చేసింది కేంద్ర సర్కారు. ఆర్టికల్ 21-ఏ ప్రకారం ప్రతి పిల్ల వాడికి ప్రాథమికోన్నత స్థాయి వరకు సంతృప్తికరమైన, సమాన నాణ్యమైన విద్యను పొందడం వారి హక్కు. కానీ ఆ హక్కు రోజురోజుకూ విద్యార్థులకు దూరమవుతోంది. ప్రభుత్వ విద్యారంగం బలహీన పడుతూ ఆ స్థానంలో ప్రయివేటు, కార్పోరేట్ విద్యా వ్యవస్థ విస్తరిస్తోంది. దానికి కారణం ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లడమే. వారికి విశ్వాసం కలిగించే దిశగా పాలకులు చేపట్టే కార్యక్రమాలు నిష్ఫలమవుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 41 వేలా 369 పాఠశాల్లో 10 వేలా 967 ప్రయివేటు పాఠశాలలున్నాయి. మొత్తం విద్యార్థుల్లో 50.23 శాతం ప్రయివేటు విద్యాసంస్థల్లో చదువుతున్నా రంటే, ప్రభుత్వ స్కూళ్లలో ఎన్‌రోల్‌మెంట్ ఎలా పడిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రయివేటుకంటే రెట్టింపు ఉన్నప్పటికీ, చదువులో నాణ్యత, పర్యవేక్షణ, ఎన్‌రోల్‌మెంట్‌లో వెనుకబడినట్టు స్పష్టమవుతోంది. గత ప్రభుత్వం మన ఊరు- మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమాన్ని చేపట్టి వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసినా.. ఫలితాలు పెద్దగా రాలేదు. 2021-22 ఏడాదికి 9,123 పాఠశాలలకు రూ.3, 492.62 కోట్లు కేటాయించింది. ఇందుకు 14 లక్షలా 71 వేలా 684 మంది విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పన కల్పిస్తామని పేర్కొంది. ఆ తరువాత ఎన్నికలు రావడంతో రెండో దశ కేటాయింపులు, మొదటి దశ పనుల పురోగతికి మోక్షం లభించని దుస్థితి ఏర్పడింది. దీని స్థానంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల స్కీమ్‌ను తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలోని ప్రతీ తరగతి నుండి మహిళా సంఘంలోని ముగ్గురు తల్లులను ఎంపికచేసి హెచ్‌ఎం కన్వీనర్‌గా, మహిళా సంఘ అధ్యక్షురాలిని చైర్‌పర్సన్‌గా కలెక్టర్ ఎంపికచేస్తూ మౌలిక సదుపాయాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించేందుకు జీవో జారీ చేసింది. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సిఫారసుచేసి, తద్వారా పనులు చేయిస్తుంది ప్రభుత్వం. ప్రతీ రెండు మాసాలకోసారి సమావేశాలు నిర్వహించి సౌకర్యాల కల్పనపై పర్యవేక్షించేలా ఈ కార్యక్రమ రూపకల్పన చేసింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. విద్యార్థుల రోజు వారి పర్యవేక్షణ, నాణ్యమైన విద్యాబోధనపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.

- చిలగాని జనార్థన్, 8121938106.

మతోన్మాదాన్ని ఓడించడమే మన కర్తవ్యం కావాలి!

'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' ఇది మోడీ 2019 ఎన్నికల నినాదం. 2014 ఎన్నికలలో 'అచ్చేదిన్ ఆనే వాలాహై' అన్నాడు. కానీ పదేండ్ల పాలనను చూసినప్పుడు దేశంలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనకరంగా, అభ్యంతరకరంగా ఉన్నాయి. ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం, పేదరికం పెరిగిపోతోంది. ముఖ్యమంత్రులను సైతం అరెస్టు చేసి జైల్లో బంధించి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కడానికి ఉపా చట్టం వినియోగిస్తున్నారు. మణిపూర్, కాశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులు అణిచివేసి ఆ రాష్ట్రాలని అగ్నిగుండంగా మార్చారు. మహిళలని నడిబజార్లో నగ్నంగా ఊరేగించే స్థితికి దేశం దిగజారి పోయింది. రాష్ట్రాల హక్కులు కాలరాసి ఫెడరల్ వ్యవస్థకి సమాధి కడుతున్న రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛని హరించి వేస్తున్నారు. ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియాను గుప్పెట్లో పెట్టుకొని అక్రమాలకు పాల్పడుతూ వాటన్నింటినీ బయటపడకుండా కప్పిపుచ్చుకుంటున్నారు. సిబిఐ, ఈడి, ఐటి, ఎన్ఐఏ లాంటి విచారణ సంస్థలని దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాలని, అసమ్మతి తెలియజేసే వారిని అణిచివేస్తున్నారు. అవినీతి గురించి నిత్యం ప్రగల్భాలు పలికే మోడీ ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్ల విషయంలో అడ్డంగా దొరికిపోయింది. పీఎం కేర్స్ నిధులు ఏమయ్యాయో ప్రజలకు చెప్పడానికి వణికిపోతున్నారు.

విచ్చుకుంటున్న మతతత్వ ఎజెండా

కార్పొరేట్ దోపిడీ నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి మోడీ పరిపాలన దేశ లౌకిక పునాదుల మీద తీవ్రమైన దాడులు సాగిస్తున్నది. దేశాన్ని మత రాజ్యంగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నది. హిందూమత ఆధిపత్యాన్ని ప్రదర్శించేలా వ్యవహరిస్తున్నది. బాబ్రీ విధ్వంసం తర్వాత కాశీలోని జ్ఞాన్‌వాపి మసీదును, మధురలోని ఈద్గా షాహీని హిందూ గుడులని ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ మతతత్వ సంస్థలు ఉధృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఆరాధనా స్థలాల (ప్రత్యేక రక్షణ) చట్టం 1991ను ఉల్లంఘించి మరీ హిందూత్వ శక్తులు ప్రభుత్వపరమైన మద్దతుతో న్యాయవ్యవస్థను ప్రభావితం చేసి తాము అనుకున్నది సాధించే ప్రయత్నంలో ఉన్నాయి.నేడు మైనార్టీలు అభద్రతాభావంలో ఉన్నారు. బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీలను వేధించడమే లక్ష్యంగా చట్టాలు చేశాయి. గో సంరక్షణ పేరిట ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఒక చట్టం చేశాయి. ఈ చట్టం ముస్లింలను వేధించడానికి ఉద్దేశించి చేసిన చట్టం. పశువుల అమ్మకాల వ్యాపారం, మాంసాహార అమ్మకాల వృత్తిలో ప్రధానంగా ఉన్న ముస్లింల మీద దాడులు చేయడానికి గోసంరక్షణ చట్టాన్ని హిందూత్వ శక్తులు అడ్డం పెట్టుకుంటున్నాయి. మూక హత్యలకు పాల్పడిన నేరస్తులకు మతోన్మాద సంస్థలు ఘనంగా సత్కారం చేస్తున్నాయి. గోరక్ష దళాలకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. ఆ విధంగా మూక హత్యలను ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నది. ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో జరిగిన దాడులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అలానే ఉత్తరప్రదేశ్, గుజరాత్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మతమార్పిడి (నిరోధక) చట్టాలు తీసుకొచ్చాయి. ఈ చట్టం పౌరులకున్న మత స్వేచ్ఛను హరించాయి. దేశంలో ప్రతి పౌరుడికి తనకు ఇష్టమైన మతాన్ని ఆచరించడానికి, ప్రచారం చేసుకోవడానికి రాజ్యాంగం ఇచ్చిన హక్కును ఈ చట్టాలు కాలరాసాయి. హిందూ, ముస్లిం యువతీ యువకులు ప్రేమ వివాహాలు చేసుకోకుండా లవ్- జీహాద్ పేరిట దాడులు చేస్తున్నారు. కేరళ స్టోరీ సినిమా పేరుతో తీవ్రమైన విషం చిమ్మారు. మతాంతర వివాహం చేసుకున్నందుకు కొంతమంది యువకులను అరెస్టు చేయించి జైల్లో పెట్టించింది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని యోగి ప్రభుత్వం. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 'ఉమ్మడి పౌరస్మృతి' బిల్లును తీసుకొచ్చింది. ఇందులో 'ఉమ్మడి' 'పౌర' అన్న భావనలకు పాతర వేశారు. బీజేపీయేతర రాష్ట్రాలలో కూడా ఈ విధమైన మైనారిటీ వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చే విధంగా ఒత్తిడి చేసేందుకు హిందూత్వ శక్తులు ప్రయత్నిస్తున్నాయి.



ఎం.డి. అబ్బాస్
9490098032

రెండవ తరగతి పౌరులుగా మైనారిటీలు

గోసంరక్షణ పేరిట పశువుల, మాంస వ్యాపారాలలో ఉన్న ముస్లింల మీద కక్షపూరితమైన దాడులు పెరిగిపోతున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలలో ఇలాంటి దాడులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. హిందూత్వ మూకలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ప్రయివేటు సైన్యంగా ఏర్పడి మూక హత్యలకు, దాడులకు తెగబడుతున్నా అయా ప్రభుత్వాలు మిన్నకుండిపోయి పరోక్షంగా ఈ రౌడీమూకలకు అండగా నిలబడుతున్నాయి.నేర అభియోగాల సాకుగా చూపి ముస్లింల నివాసాలను, దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేసే అక్రమ చర్యలు ఉత్తర ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో పెరిగిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో మైనారిటీల ఇండ్ల అక్రమ కూల్చివేత ఆపడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ స్వయంగా తీసుకొని వెళ్లి బుల్డోజర్‌లకు అడ్డుగా నిలబడిన విషయం ప్రపంచమంతా చూసింది. మైనార్టీలకు నిలువ నీడలేకుండా చేయడానికి బుల్డోజర్‌లను ఆయుధంగా వాడుకునే బుల్డోజర్ రాజ్ నడుస్తోంది. ఒక్క హర్యానా రాష్ట్రంలోనే 'నూహు'లో ఏకంగా 1208 ఇండ్లను ఇలా కూల్చివేశారు. ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా దిగజార్చడానికి బీజేపీ చేస్తున్న దుర్మార్గాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

హింసాత్మక దాడులు ఆపాలి

గోమాంసం దగ్గర ఉందనే సాకుతో మూకదాడులకు పాల్పడడం పరిపాటిగా మారింది. 2015లో మహ్మద్ అఖ్లాక్‌ను



ఇలానే హత్య చేశారు. పాల డెయిరీ రైతు ఫహ్లుఖాన్‌ను నడీ రోడ్డుపై పోలీసుల సమక్షంలో దాడి చేసి చంపేశారు. దాడులకు పాల్పడినవారి మీద చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో హిందూత్వ మూకలు మరింత పెట్రేగిపోతున్నాయి. ఒక్క 2019 సంవత్సరంలోనే మీడియాలో వచ్చిన వార్తల మేరకే 107 మూకదాడులు జరిగాయి. హిందూ పండుగల సందర్భాలను మతవిద్వేషాలు, మత హింసను రెచ్చగొట్టడానికి వాడుతున్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో 2017 నుండే ఈ విధమైన దాడుల గణాంకాలు సేకరించడం నిలిపివేసింది. భారత శిక్షాస్మృతి సెక్షన్ 153ఎ ప్రకారం మత విద్వేష ప్రసంగాలు శిక్షార్హమైన నేరాలు, నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో గణాంకాలను పరిశీలిస్తే 2021లో ఈ సెక్షన్ క్రింద 993 కేసులు నమోదయ్యాయి, అదే 2022 నాటికి వచ్చేసరికి ఈ కేసుల సంఖ్య 1,444కి పెరిగింది. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాలను, ఊరేగింపులను అడ్డం పెట్టుకుని హిందూత్వ శక్తులు ముస్లింలపై దాడులకు దిగడం ఈ మధ్యకాలంలో పెరిగింది. బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే ఈ దాడులు జరగడం, దాడుల అనంతరం కేవలం ముస్లింలను పోలీసులు అరెస్టు చేయడం చూస్తుంటే ఇదంతా ఒక పథకం ప్రకారం జరుగుతున్న దాడులని ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో 2022-23 సంవత్సరాలలో ఈ రకమైన దాడులు పెచ్చరిల్లాయి. 2023లో 720 ప్రార్థనా స్థలాలు, చర్చిలమీద దాడులు జరిగాయని, 2014లో 147 దాడులు జరగగా 2021లో 505 దాడులు, 2022లో 509 దాడులు జరిగాయని ఈ రకమైన దాడులను అరి కట్టాలని విజ్ఞప్తి చేస్తూ యునైటెడ్ క్రిష్టియన్ ఫోరమ్ రాష్ట్రపతికి ఒక విజ్ఞాపన పత్రం అందజేసింది."మా ప్రభుత్వ హయాంలో మత కలహాలను అరికట్టాం' అని మోడీ చేసిన ప్రకటనలకు, వాస్తవాలకు ఏమాత్రం పొంతనలేని పరిస్థితి ఇది. అంతెందుకు 2022 డిసెంబర్ 7న రాజ్యసభలో హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రామ్ సభ్యుల ప్రశ్నకు సమాధానంగా 2017-2022 మధ్య ఐదేండ్లకాలంలో 2900 మతకలహ సంఘటనలు చోటుచేసుకున్నట్లు ప్రకటించాడు. మోడీ ప్రకటనలో డొల్లతనాన్ని ఈ గణాంకాలు బహిర్గతం చేస్తున్నాయి. 2019- 2020 సంవత్సరాలలో మన దేశంలో సామాజిక తరగతుల సంఘర్షణలు పెచ్చరిల్లి ప్రమాదకర స్థాయికి చేరాయని 'ప్యూ' పరిశోధనా కేంద్రం ప్రకటించింది.

> తెలంగాణ రాష్ట్రంలో పట్టుకోసం మతోన్మాదులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా ఇక్కడి ప్రజలను విభజించి రాజకీయ లబ్ధి పొందాలని రజాకార్ సినిమా పేరుతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. సెప్టెంబర్ 17 అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నోటికేషన్ విడుదల చేసింది. ఇవన్నీ తెలంగాణ ప్రజలపై మతతత్వాన్ని రుద్దడానికి జరుగుతున్న కుట్రలే. మోడీ నాయకత్వంలోని బీజేపీని అధికార పీఠం నుండి తప్పిస్తే తప్ప లౌకిక రాజ్యాన్ని నిలుపుకోలేం. మరోసారి, మోడీ అధికారం చేబడితే మనదేశాన్ని మత రాజ్యంగా మార్చాలన్న ఆర్ఎస్ఎస్ ప్రణాళిక అమలు కావడం ఖాయం.

తెలంగాణలో ముంచుకొస్తున్న ప్రమాదం

తెలంగాణ రాష్ట్రంలో పట్టుకోసం మతోన్మాదులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా ఇక్కడి ప్రజలను విభజించి రాజకీయ లబ్ధి పొందాలని రజాకార్ సినిమా పేరుతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. సెప్టెంబర్ 17 అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నోటికేషన్ విడుదల చేసింది. ఇవన్నీ తెలంగాణ ప్రజలపై మతతత్వాన్ని రుద్దడానికి జరుగుతున్న కుట్రలే. మోడీ నాయకత్వంలోని బీజేపీని అధికార పీఠం నుండి తప్పిస్తే తప్ప లౌకిక రాజ్యాన్ని నిలుపుకోలేం. మరోసారి, మోడీ అధికారం చేబడితే మనదేశాన్ని మత రాజ్యంగా మార్చాలన్న ఆర్ఎస్ఎస్ ప్రణాళిక అమలు కావడం ఖాయం. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అనేవి మోడీ బక్వాస్ తప్ప నిజం కాదు. రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటినీ దుర్వినియోగం చేస్తూ మైనార్టీలు, దళితులు, గిరిజనులు, మహిళల పైన, కార్మికులు, రైతుల పైన నిరుద్యోగులపైన సాధారణ ప్రజల పైన తీవ్రమైన దాడి జరుగుతున్నది. దేశ లౌకిక పునాదులు, ప్రజాస్వామిక విలువలు ధ్వంసం చేయబడుతున్నాయి. వాటిని కాపాడుకోవడం దేశ పౌరుల అందరి బాధ్యత. మనదేశ ప్రజాస్వామిక విలువలను, లౌకిక స్ఫూర్తిని, సమాఖ్య భావనలను నిలుపుకోవాలంటే రానున్న ఎన్నికలలో హిందూత్వ శక్తులను, దానితో అంటకాగే రాజకీయపక్షాలను ఓడించి తీరాల్సిందే. అదే ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యం..



ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ఆవిర్భావ స్ఫూర్తితో కేంద్రం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధమవ్వాలని ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ సహాయ కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని (జవహర్ నగర్) తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద ఏఐకేఎస్ 89వ ఆవిర్భావం సందర్భంగా కిసాన్ సభ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ... 89 ఏండ్ల క్రితం ఏర్పడిన ఏఐకేఎస్ జాతీయోద్యమ కాలంలోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే మరోవైపు జమీందారులకు, జాగిర్దారులకు వ్యతిరేకంగా రైతాంగ సమస్యలపై పోరాడిందని తెలిపారు. పేదలు సాగు చేస్తున్న భూములపై వాళ్లకే హక్కులుండాలనీ, కౌలు రేట్లు తగ్గించాలనీ, రైతాంగానికి కనీస మద్దతు ధరలు అమలు చేయాలనే డిమాండ్లతో ప్రారంభమైన కిసాన్ సభ, అనేక త్యాగాలు చేసిందని తెలిపారు. రాబోయే కాలంలో కనీస మద్దతు ధరల చట్టం సాధన, రైతాంగ రుణ విముక్తి చట్టం, మెరుగైన పంటల బీమా పథకం, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయలన్న డిమాండ్లపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు టి కిషోర్, దుగ్గి బ్రహ్మం, వెంకట్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ డ్యామేజీపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

- పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలి
- గోదావరి నీటిని వృధా కానివ్వొద్దు : జూలకంటి డిమాండ్


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మేడిగడ్డ రిజర్వాయర్ డ్యామేజీపై ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మాజీ శాసన సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాబావ పరిస్థితుల మూలంగా రాష్ట్రంలో నీటి ఎద్దడి ఏర్పడిందనీ, దీనికి తోడు కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినటంతో పంట పొలాలకు నీటి సౌకర్యం కల్పించలేని స్థితి ఏర్పడిందని తెలిపారు. దీంతో పంటలు ఎండుతున్నాయనీ, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. గోదావరి జలాలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టాని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



నవతెలంగాణ-అంబర్‌పేట్


మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబర్‌పేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతారావు, మాజీ మంత్రి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిత్ రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అంటూ పూలే సేవలను గుర్తు చేశారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో మరింతగా ఎదగడమే పూలేకు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గరిగంటి రమేష్, పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, నారాయణస్వామి, పులి జగన్, దిడ్డి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మణ్ యాదవ్, పీసీసీ జనరల్ సెక్రెటరీ లకుపతి యాదగిరి గౌడ్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, మోత రోహిత్, సీనియర్ నాయకులు తోలుపునూరి కృష్ణ గౌడ్, ప్రభాకర్, గడ్డం శ్రీధర్ గౌడ్, రాజేశ్వర్ రావు, హరి తిలక్, రవికుమార్, పోలినేని రామ్మోహన్ రావు, చెంగలి సుధాకర్, రావుల సుధాకర్, కోటం అనిల్ కుమార్, రవి, భగవాన్, రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడటమే పూలేకు ఇచ్చే నివాళి : చాడ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో సామాజిక న్యాయం జరగాలంటూ కలలు కన్నది జోతిబాపూలే అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. పూలే ఆశయాలను నెరవేరుస్తామంటూ చెప్తున్న ప్రధాని మోడీ జనగణన చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జనగణన కోసం కృషి చేయాలని తెలిపారు. పూలే 197వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు.





మోడీ మాటలకు.. అర్థాలే వేరులే..!



- ఈడీ స్వతంత్ర సంస్థ అంటూ ప్రధాని సమర్థింపులు
- పీఎంఎల్‌ఏను తెచ్చింది మేము కాదు కదా అని ఎదురు ప్రశ్నలు
- బీజేపీ పాలనలో పెరిగిన 'రాజకీయ' కేసులు... వేధింపులు
- మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద దాడులు, సోదాలు
- క్రూరమైన చట్టంగా మారిన పీఎంఎల్‌ఏ
- ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా దర్యాప్తు సంస్థల ప్రయోగం

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై ఈడీని ప్రయోగిస్తోందని, మనీ లాండరింగ్ నిరోధక చట్టాన్ని (పీఎంఎల్‌ఏ) దుర్వినియోగం చేస్తోందని ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రధాని వీటిని తోసిపుచ్చారు. ఈడీ స్వతంత్రంగా వ్యవహరిస్తోందని కితాబు ఇస్తున్నారు. 'మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఈడీ వచ్చిందా? లేదు కదా. పీఎంఎల్‌ఏని మేము తీసుకొచ్చామా? లేదు కదా. అయితే ఎందుకీ రగడ? ఈడీ అనేది ఓ స్వతంత్ర సంస్థ. అది స్వతంత్రంగానే పనిచేస్తుంది' అని తంతి టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ చెప్పుకొచ్చారు.

ఈడీ వద్ద ఉన్న ఏడు వేల కేసుల్లో రాజకీయ పరమైనవి మూడు శాతం కంటే తక్కువేనని మోడీ ఆ ఇంటర్వ్యూలో తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పది సంవత్సరాల్లో ఈడీ స్వాధీనం చేసుకున్నది కేవలం రూ.35 లక్షలు మాత్రమేనని, కానీ తమ పాలనలో రూ.2,200 కోట్లు జప్తు చేసిందని వివరించారు. 'వాషింగ్ మిషన్లలో, నీటి పైపుల్లో, పరుపులో డబ్బు దొరికింది. ఓ కాంగ్రెస్ ఎంపీ నుంచి రూ.300 కోట్లను ఈడీ స్వాధీనం చేసుకుంది. బెంగాల్‌లో మంత్రుల నివాసాల్లో భారీగా నగదు పట్టుబడింది. ఇదంతా కనబడుతూనే ఉంది కదా! దీనిని దేశ ప్రజలు సహిస్తారా? నేను అలా అనుకోవడం లేదు' అని అన్నారు. ప్రతిపక్ష నేతలపై ఈడీ చర్యలు తీసుకుంటోందని, అదే పాలకపక్షం వారిని వదిలేస్తోందని వస్తున్న విమర్శలను ప్రస్తావించగా పార్టీ ఏదైనా ఈడీ చేపట్టే ప్రక్రియ ఒకేలా ఉంటుందని చెప్పారు. ఈడీ తనకు తానుగా చర్యలు తీసుకోదని, ఇతర శాఖలు ముందుగా కేసులు నమోదు చేస్తే వాటిపై ఈడీ చర్యలకు ఉపక్రమిస్తుందని, ఈడీ అధికారులు పీఎంఎల్‌ఏ చట్టాన్ని ఎన్నడూ ఉపయోగించలేదని అన్నారు. 'ఈడీ పనిని అడ్డుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేశారు. అందుకోసం కోర్టులను ఆశ్రయించారు. పీఎంఎల్‌ఏ మినహాయింపు కోసం 150 కేసులు దాఖలయ్యాయి. అవినీతిపై మోడీ చేస్తున్న పోరాటం ఆగదని వారికి తెలుసు. అందుకే వారు న్యాయస్థానాల ద్వారా దర్యాప్తు సంస్థ పనికి ఆటంకం కలిగించాలని ప్రయత్నిస్తున్నారు' అని మోడీ ఆరోపించారు.

ప్రతిపక్షాలే లక్ష్యంగా...

మొత్తం కేసుల్లో కేవలం 3 శాతం కేసుల్లో మాత్రమే మాజీ ప్రజాప్రతినిధులను న్యాయస్థానాలు నిందితులుగా నిర్ధారించాయని ఈడీ చెబుతోంది. తాను చేపట్టిన 5,906 కేసుల్లో కేవలం 176 కేసుల్లో మాత్రమే ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రమేయం ఉన్నదని దాని అర్థం. 2022 సెప్టెంబరులో 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఓ పరిశోధన నిర్వహించింది. మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకులపై ఈడీ నమోదు చేసిన కేసులు నాలుగు రెట్లు పెరిగాయని ఆ పరిశోధనలో తేలింది. 2014- 2022 మధ్యకాలంలో 121 మంది ప్రముఖ రాజకీయ నాయకులు ఈడీ విచారణలు ఎదుర్కొన్నారు. వీరిలో 115 మంది (95 శాతం) ప్రతిపక్ష నేతలే. వీరందరిపై కేసులు పెట్టారు. దాడులు చేశారు. ప్రశ్నించారు. అరెస్టు కూడా చేశారు. 2022 తర్వాత కూడా ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీఆర్ఎస్ నేత కవిత అరెస్టయ్యారు. ఈడీ విచారిస్తున్న కేసుల సంఖ్యలో భారీగా పెరుగుదల ఉన్నదని మోడీ ప్రభుత్వం పార్లమెంటుకు ఇచ్చిన సమాచారమే చెబుతోంది.

ముగిసిన కేసులు పాతికే...

తంతి టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈడీ స్వతంత్రంగా వ్యవహరిస్తోందని చెప్పేందుకు మోడీ శతవిధాలా ప్రయత్నించారు. అయితే ఆయన వాదనలో ఏ మాత్రం పసలేదని చెప్పడానికి అనేక కారణాలు ఉన్నాయి. గత సంవత్సరం మార్చిలో ఈడీ ప్రచురించిన గణాంకాలనే మోడీ ప్రస్తావించి ఉండవచ్చు. 2005 నుండి 2023 వరకూ తాను 5,906 కేసులు నమోదు చేశానని ఈడీ చెప్పుకున్నది. అయితే వాటిలో కేవలం పాతిక కేసులు అంటే మొత్తం కేసుల్లో 0.42 శాతం కేసులు మాత్రమే పరిష్కారమయ్యాయి. వాటిలో 24 కేసుల్లో నిందితులకు శిక్ష పడింది. దీనికే 96 శాతం కేసుల్లో శిక్షలు పడ్డాయని ఈడీ గొప్పలు చెప్పుకుంది. కానీ వాస్తవం ఏమిటి? రెండు దశాబ్దాల పాటు ఉనికిలో ఉన్న ఈడీ కేవలం పాతిక కేసులకు మాత్రమే ముగింపు తేగలిగింది. దీనిని బట్టి ఆ దర్యాప్తు సంస్థ, న్యాయవ్యవస్థ పనితీరును అర్థం చేసుకోవచ్చు.

పీఎంఎల్‌ఏ కింద కూడా...

2022 మార్చిలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ 2004-2014 మధ్య కాలంలో (యూపీఏ హయాంలో) మనీ లాండరింగ్ కేసుల్లో ఈడీ 112 సోదాలు జరిపిందని, ఈ సంఖ్య బీజేపీ పాలనలో (2014-2022) 26 రెట్లు పెరిగి 2,974కు చేరిందని చెప్పారు. యూపీఏ హయాంలో 104 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు దాఖలైతే బీజేపీ పాలనలో 839 దాఖలయ్యాయని తెలిపారు. పీఎంఎల్‌ఏ కింద నమోదైన 4,700 కేసుల్లో వాటిలో సగం కేసులు (2,186) 2017-2022 మధ్య దాఖలైనవేనని స్క్రోల్ పోర్టల్ వెల్లడించింది. పీఎంఎల్‌ఏ కింద విచారణ ఎదుర్కొంటున్న 122 మంది మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేల జాబితాను ఈడీ సుప్రీంకోర్టుకు సమర్పించింది. అయితే వీరిలో 52 మంది ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారే.

సవరణలతో చట్టానికి కోరలు

పీఎంఎల్‌ఏను తన ప్రభుత్వం తీసుకురాలేదని మోడీ చెప్పారు. అది నిజమే. అయితే ఆ చట్టానికి చేసిన పలు సవరణలు దానిని క్రూరమైనదిగా మార్చేశాయి. 2002లో అప్పటి బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. 2012 నుండి 2019 వరకూ దీనికి అనేక సవరణలు చేశారు. ప్రారంభంలో పీఎంఎల్‌ఏ పరిధిలో ఆరు చట్టాల కింద 40 నేరాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు దీనిని 30 చట్టాలకు విస్తరించారు. ఫలితంగా 140 నేరాలను విచారించవచ్చు. ఈ చట్టం కింద అరెస్టయితే బెయిల్ లభించడం అసంభవం. తాను నిర్దోషినని నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిదే. ఈ చట్టం కింద సమన్లు జారీ చేయడం, స్టేట్‌మెంట్లు నమోదు చేయడం, అరెస్టులు చేయడం, సోదాలు నిర్వహించడం, ఆస్తులు స్వాధీనం చేసుకోవడం వంటి అధికారాలన్నీ ఈడీకి దఖలు పడ్డయి. అనుమానం కలిగితే చాలు... ఎవరినైనా అరెస్టు చేయవచ్చు. సమన్లు జారీ చేయడానికి కారణాలు చెప్పాల్సిన అవసరం లేదు. నేరం ఏమిటో కూడా చెప్పనక్కరలేదు. ఆ విధంగా పీఎంఎల్‌ఏను క్రూరమైన చట్టంగా మార్చేసి ప్రతిపక్ష నేతలపై ప్రయోగిస్తున్నారు.

దాడుల తర్వాతే విరాళాలు

ఈడీ తనంతతానుగా ఎలాంటి చర్యలు తీసుకోదని మోడీ చెప్పారు. అయితే దాని స్వతంత్రతపై అనేక ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి, వాటి ద్వారా పాలక పక్షానికి విరాళాలు అందించిన వ్యక్తులు, కంపెనీలపై దానికి ముందే కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేశాయి. కొన్ని కంపెనీలపై నిఘా పెట్టాయి. ఈ విధంగా ఈడీ, ఐటీ శాఖల నిఘా నీడలో ఉన్న మూడు బడా కంపెనీలు పెద్ద మొత్తంలో బీజేపీకి నిధులు సమకూర్చాయి. బీజేపీకి విరాళం అందించిన మరో 14 కంపెనీలు కూడా ఈడీ సహా కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు ఎదుర్కొన్నాయి. అలాంటప్పుడు ఈడీ స్వతంత్రంగా వ్యవహరిస్తోందంటే ఎవరైనా ఎలా నమ్ముతారు?

మోడీ ప్రభుత్వాన్ని ఓడించండి

- శ్రామిక మహిళలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ పెన్షన్ కల్పించాలి : తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా కమిటీ (సీఐటీయూ) కన్వీనర్ ఎస్వీ రమ



నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రామిక మహిళల సమస్యలను పరిష్కరించలేని మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని రాష్ట్ర శ్రామిక మహిళా కన్వీనర్ ఎస్వీ రమ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం కామ్రేడ్ విమలా రణదివే 107వ జయంతిని శ్రామిక మహిళ మేడ్చల్ మాల్కాజ్‌గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విమలా రణదివే చిత్రపటానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్‌తో కలిసి రమ పూలమాల వేశారు. అనంతరం జిల్లా కన్వీనర్ ఎం. రేవతి కళ్యాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమ మాట్లాడారు. 12- 13 సంవత్సరాల కాలంలోనే విదేశీ వస్తువుల నిరాకరణ పోరాటం చేసి జైలుకి వెళ్లిన త్యాగమూర్తి కామ్రేడ్ విమలా రణదివే అని అన్నారు. ముంబై ప్రాంతంలో జూట్ మిల్ వర్కర్ల సమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. సీఐటీయూ ఆవిర్భావం నుంచి ఆమె మరణించే వరకు శ్రామిక మహిళల సమస్యల పరిష్కారానికి ఉద్యమించారని తెలిపారు. ఆల్ ఇండియా ప్లాంటేషన్ యూనియన్ ప్రథమ అధ్యక్షురాలిగా ఆమె ఎన్నికై మరణించే వరకు ఆ పదవిలో కొనసాగారన్నారు. అంగన్‌వాడీ యూనియన్ వ్యవస్థాపకురాలుగా, బీడీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకురాలుగానూ విమల రణదివే పనిచేసినట్టు చెప్పారు. నేడు కేంద్ర ప్రభుత్వం శ్రామిక మహిళలకి ఆర్థికంగా రక్షణ ఇవ్వడం లేదని, సామూహికంగా రక్షణ కల్పించడం లేదని, దీనికి నిరసనగా రాబోయే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. పదేండ్ల నుంచి ఆశా కార్మికులకు గాని, అంగన్వాడీ కార్మికులకు గాని, మధ్యాహ్న భోజన కార్మికులకు గాని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచలేదన్నారు. అంతేకాదు, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు పరం చేస్తూ, రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. కార్మికులు ఐక్యంగా ఉండకుండా, కులం, మతం, ప్రాంతం పేరుతో చిచ్చులు పెట్టి పరిపాలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆశా వర్కర్లకు పనిభారం పెంచుతూ అధికారులు మానసికంగా వేధిస్తున్నారని, దాన్ని మార్చకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. పల్స్ పోలియో డబ్బులు ఇవ్వలేదని, రాయడానికి పెన్నులు ఇవ్వట్లేదని, సర్వేకి బుక్ ఇవ్వట్లేదని, ఇవన్నీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని చెప్పారు. జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఏ. హేమలత మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ఆన్‌లైన్ పేరు మీద వేధిస్తున్నారని, చేయకపోతే రాజీనామా చేసి వెళ్లిపోండని అధికారులు బెదిరిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పదేండ్లు మా సీఎం రేవంతే..

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పదేండ్లు అధికారంలో ఉంటుందని, తమ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డే ఉంటారని, అందరూ సీఎం నాయకత్వంలోనే పనిచేస్తున్నామని అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మాజీ మంత్రి కుందురు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్ రెడ్డితో కలిసి ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. కార్యకర్తలు, అభ్యర్థులు లేక హరీశ్‌రావు, మహేశ్వర్ రెడ్డి.. ఏమాత్రం ఆలోచన లేకుండా మాట్లాడుతున్నారని, మాట్లాడేటప్పుడు విజ్ఞతతో మాట్లాడాలని హితవు పలికారు. బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు గెలుచుకున్నా.. తాను దేనికైనా సిద్ధమని, తమ పార్టీ అంతర్గత విషయాలు మహేశ్వర్ రెడ్డి మాట్లాడొద్దని వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్‌లో ఏకనాథ్ షిండేలు, గ్రూపులు లేవని, ఏకనాథ్ షిండేను సృష్టించేది బీజేపీనే అని అన్నారు. మహారాష్ట్రలో ఎన్సీపీని, శివసేనను చీల్చి ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది మీరు కాదా అని బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌ను ఎందుకు మార్చారో మహేశ్వర్ రెడ్డికి తెలుసా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని పడగొడతామన్న మాటలు బంద్ చేయాలని ఫైర్ అయ్యారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరిగాక ఆ ప్రభుత్వమే ఐదేండ్లు అధికారంలో ఉంటుందని, 50 ఏండ్ల తమ పాలనలో ఏ పార్టీని పడగొట్టలేదని, దళితులను అవమానపరిచింది మీరేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో 14 సీట్లు తామే గెలవబోతున్నామని, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని కుల, మతాల కతీతంగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏది ఏమైనా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని, ఇప్పటికే కొన్ని పథకాల అమలు, ఎన్నికల కోడ్ ముగిశాక మిగతా పథకాలు అమలు చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పాలనతో పదేండ్లు వెనక్కి

- అక్షింతలు, క్యాలెండర్ తప్ప బీజేపీ చేసిందేమీ లేదు
- వెంకట్రామి రెడ్డిని గెలిపిస్తే జోడెడ్లలా సేవ చేస్తాం : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ - చిన్నకోడూరు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, కాంగ్రెస్ పాలనతో రాష్ట్ర అభివృద్ధి పదేండ్లు వెనక్కి తీసుకెళ్లిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో గురువారం నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల విస్తృత స్థాయి సన్నాహక సమావేశానికి మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. ఓ వైపు ఎండలు.. మరో వైపు ఎన్నికలు.. అ సమయంలో ఎమ్మెల్యే ఎన్నిక ఎంత ముఖ్యమో ఎంపీ అంతే ముఖ్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ ద్వారా మంచి నీటి సరఫరా, కాళేశ్వరం ద్వారా సాగునీరు ఇలా అనేక పథకాలు అమలు చేశామని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు చెరువులు నిండింది లేదని, కాళేశ్వరం నిర్మాణంతో చెరువులు ఎండింది లేదన్నారు. పశుగ్రాసం కొనుక్కుని పశువులను కాపాడుకున్న పరిస్థితులను గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయనీ, 100 రోజుల్లో 6 గ్యారంటీలు, 13 హామీల పేరుతో నయవంచనకు గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలను స్క్రీన్‌పై వీడియో ద్వారా చూపిస్తూ కొట్లాడి అమలు చేపిస్తామని స్పష్టంచేశారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకునే వ్యక్తి రఘునందన్ రావు అని, అభివృద్ధిని అడ్డుకునే వ్యక్తికి ఓటు వేయొద్దన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో చెల్లుతుందా అని అన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందని తెలిపారు. అక్షింతలు, క్యాలెండర్ తప్ప బీజేపీ చేసిందేమీ లేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలకు ఆర్థిక సహాయం చేశానని, దేవుని పేరిట రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఢిల్లీలో జై తెలంగాణ నినాదం ఇచ్చేది కేవలం బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమే అని చెప్పారు. వెంకట్రామి రెడ్డిని గెలిపిస్తే జోడెడ్లలా సేవ చేస్తామన్నారు.

బీఆర్ఎస్ పార్టీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగం చేసిన ప్రాంతంలో పోటీ చేయడం, అభివృద్ధి ప్రాంతంలో కలెక్టర్‌గా ఉండటం తన అదృష్టమన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ఆదేశంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. గెలిచిన నెల రోజుల్లోపు వెంకట్రామిరెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.100 కోట్లతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తానని హామీ ఇచ్చారు. చేసిందే చెప్తానని, చెప్పిందే చేస్తానని, మోసపూరిత ప్రకటనలు చేయనని ప్రకటించారు. పేద కార్యకర్తల కోసం 9నెలల్లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఫంక్షన్ హాలు నిర్మిస్తానన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఉద్యోగాల నోటిఫికేషన్ సమయంలో ఫంక్షన్ హాలులో కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. తన కోసం 30 రోజులు ఇవ్వండి.. మీకు 5 సంవత్సరాలు ఇస్తానని తెలిపారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షులు కీసర పాపయ్య, మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవ వైద్య ఆవిష్కరణలే లక్ష్యంగా సీసీఎంబీ -బీఎఫ్ఐ ఒప్పందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవ శాస్త్రాలు, ఆరోగ్యం, ఔషధాలు, జీవ సాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేస్తున్నఅటల్ ఇంక్యుబేషన్ సెంటర్-సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (ఏఐసీ-సీసీఎంబీ) సంస్థ పరిశోధనల కోసం మరో ముందడుగు వేసింది. కోవిడ్-19 రెండో దశ తర్వాత ఆరోగ్యసంరక్షణ ప్రాధాన్యత ఆ రంగంలో అవసరమైన వారికి నిధుల సాయం అందించేందుకు బ్లాక్ చెయిన్ ఫర్ ఇంపాక్ట్ (బీఎఫ్ఐ)తో ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం హైదరాబాద్‌లోని ఏఐసీ-సీసీఎంబీ కార్యాలయంలో ఏఐసీ-సీసీఎంబీ సీఈవో డాక్టర్ ఎస్.మధుసూదన రావు, బీఎఫ్ఐ సీఈవో డాక్టర్ గౌరవ్ సింగ్ ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్న పరిశోధనలకుగాను బీఎఫ్ఐ 15 మిలియన్ల అమెరికా డాలర్లను కేటాయించనున్నది. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.మధుసూదన్ రావు మాట్లాడుతూ భారతదేశంలో ఆరోగ్య సమానత్వానికి ఉన్న అడ్డంకులను తొలగించేందుకు బీఎఫ్ఐ పని చేస్తున్నదని తెలిపారు. అందరికీ అందుబాటులో, చవకగా ఆరోగ్యం అందించేందుకు, ముఖ్యంగా గ్రామీణ భారతదేశం కోసం అవసరమైన ఆవిష్కరణలను అందించేందుకు బీఎఫ్ఐ పలు అంకుర సంస్థలతో కృషి చేస్తున్నదని చెప్పారు. డాక్టర్ గౌరవ్ సింగ్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న ఏఐసీ-సీసీఎంబీతో జత కట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. తాము చేయబోయే జీవ వైద్య పరిశోధనలు, ఆవిష్కరణలు ఆరోగ్యరంగానికి ఊతమిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం పట్ల బీఎఫ్ఐ వ్యవస్థాపకులు సందీప్ నైల్వాల్, ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ పూజా అగర్వాల్, సీనియర్ అడ్వైజర్ డాక్టర్ సత్యప్రకాశ్ డాష్, ఏఐసీ - సీసీఎంబీ సీఓఓ డాక్టర్ రాంజీ పల్లెల హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

నవతెలంగాణ-మర్పల్లి

జాతీయ ఉపాధి పనిచేసి చేస్తున్న ఓ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని కొత్లపురం గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్లపురం గ్రామానికి చెందిన శ్యామల వెంకట్‌రెడ్డి(45) ఎప్పటిలాగే అందరితో కలిసి ఉపాధి పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల వరకు చెక్ డ్యామ్‌లో పూడికతీత పనులు చేసుకుని ఎండలో ఇంటికి వచ్చిన వెంకట్‌రెడ్డి ఆయాసంతో బాధపడ్డాడు. తనకు చాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే వారు వెంకట్‌రెడ్డిని మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకట్‌రెడ్డి మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

రాజ్యాంగ రక్షణకు పోరాడుదాం

- పూలే ఆధునిక యుగ వైతాళికుడు : జయంతి సభలో సామాజిక సంఘాల నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యకత సామాజిక సంఘాలపై ఉందని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాలు, ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బా పూలే జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా నిలబడటమే పూలేకు నిజమైన నివాళి అని చెప్పారు. ఆధునిక యుగ వైతాళికుడు, దేశ ప్రప్రథమ సామాజిక తత్వవేత్త, మహాత్మునిగా జన నీరాజనాలందుకున్న విశిష్ట మూర్తి పూలే అని వివరించారు. తెలంగాణ కల్లుగీతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు. యం వి రమణ మాట్లాడుతూ...పూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో 1827 ఏప్రిల్ 11న జన్మించారన్నారు. తండ్రి గోవింద్ రావు. జ్యోతిరావు పూలే చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడని చెప్పారు. క్రైస్తవ మత బోధకులు ప్రారంభించిన పాఠశాలలో చదువుకున్నాడనీ, ఆయనకు పదుమూడేండ్లకే సావిత్రిబాయితో వివాహం జరిగిందని తెలిపారు. జ్యోతిబా తన బ్రాహ్మణ మిత్రుడి పెళ్ళి ఊరేగింపు లో పాల్గొన్నప్పుడు వాళ్ళ కుటుంబ సభ్యులు చేసిన అవమానంతో ఆయన జీవితం మలుపు తిరిగిందన్నారు.ఆ తర్వాత సమాజంలోని కుల వివక్షపై తనదైన అభిప్రాయాలు ఏర్పరచుకొని మిగిలిన వాళ్ళ కంటే తాము ఉన్నతులమన్న బ్రాహ్మణుల వాదనను ఖండించారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ ఆర్థిక సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం అంటూ ఆలోచించి ప్రబోధించి దళిత వర్గాలను, బలహీన వర్గాలను జాగృతం చేసిన క్రియాశీలి పూలే అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి ఎన్ సోమయ్య, కేవీపీఎస్ నాయకులు బాలపీరు, టీపీఎస్‌కే నాయకులు మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు



ఎన్టీఆర్ భవన్‌లో పూలే జయంతి

నవతెలంగాణ-హైదరాబాద్

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఎన్టీఆర్‌భవన్‌లో తెలుగుదేశం తెలంగాణ శాఖ పార్టీ నిర్వహించింది. టీడీపీ అనుబంధ సంఘం బీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగింది. జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధులు శ్రీనివాస్ నాయుడు, సూర్యదేవర లత, అధ్యక్షత వహించిన బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి సతీష్ మాట్లాడుతూ పూలే విద్య కోసం పోరాటం చేశారని అన్నారు. తనను పాఠశాలకు రానీయకుండా బహిష్కరించగా తన తండ్రిని ఒప్పించి స్కూలుకు వెళ్లి చదువుకున్నారని అన్నారు. సరస్వతి పుత్రులు అని పిలువబడే బ్రాహ్మణులకన్నా గొప్పగా జ్యోతిరావు పూలే చదువుకున్నారని చెప్పారు. వితంతువులకు గుండు కొట్టడం వంటి సామాజిక రుగ్మతలను పూలే ఆనాడే వ్యతిరేకించి విప్లవకారునిగా పేరొందారని అన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించారన్నారు. వితంతువుల సమస్యలపై పోరాడారని అన్నారు. ముఖ్యంగా మహిళలు చదువుకోవాలని ఎంతో కృషి చేశారు. జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాలకు, చదువుకున్న యువతకు రాజకీయ అవకాశాలను కల్పించి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చేశారని అన్నారు. దీనిని చంద్రబాబు కొనసాగిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పోలంపల్లి అశోక్, ఐటీడీపీ రాష్ట్ర అధ్యక్షులు టి.హరికష్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడెపు రాఘవులు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎబీఆర్ మోహన్‌రావు, టీడీపీ నాయకులు బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పేరుతో రాహుల్ మొసలి కన్నీరు

- మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక న్యాయం పేరుతో రాహుల్ గాంధీ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పూలే ఆశయాలకు అనుగుణంగా మోడీ సర్కారు పనిచేస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు బీజేపీ 30 శాతం సీట్లను ఇచ్చిందని చెప్పారు.

దేశాన్ని 55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసినందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కర్పూరి ఠాకూర్‌ను ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. చరణ్‌సింగ్ మనవడిని కాంగ్రెస్ అవమానించిందన్నారు.

అంబేద్కర్‌ను రెండు సార్లు ఎంపీగా ఓడించింది కాంగ్రెస్ పార్టీనే అని విమర్శించారు. నెహ్రూ బీసీల హక్కులను హరించారని ఆరోపించారు. మండల్ కమిషన్ సిఫారసులను రాజీవ్‌గాంధీ అడ్డుకున్నారన్నారు. ఇన్ని చేసిన కాంగ్రెస్ ఇప్పుడు ఓట్ల కోసం బీసీ గణన అంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. జూన్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 46 శాతం బీసీ రిజర్వేషన్ కల్పించి ఎన్నికలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఎంఐఎం ప్రభుత్వాలకు అంటకాగే పార్టీ

- పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుంటున్నది : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి అంటకాగటం ఎంఐఎంకి అలవాటైపోయిందనీ, పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఆ పార్టీనేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నాంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు ఆ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన చీకటి వ్యాపారాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడం, బీజేపీని వ్యతిరేకించడం అజెండాతో ఎంఐఎం పనిచేస్తోందన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే దేశికి నేతను వదిలేసి కాంగ్రెస్ చెంతకు ఓవైసీ బ్రదర్స్ చేరారని విమర్శించారు. మజ్లిస్‌కు భయపడి చెంగిచెర్ల దాడి నిందితులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మొన్నటి వరకు రాహుల్ ను తిట్టిన ఓవైసీ బ్రదర్స్.. ఇప్పుడు ఒప్పందాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనన్నారు. ఎంఐఎం తీరుతో పాతబస్తీ ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం ఒప్పందాన్ని తిరస్కరించాలని ప్రజలను కోరారు.

లక్ష్యం.. చేరలే..!

- 'మేడ్చల్'లో గ్రామ పంచాయతీల పన్ను వసూళ్లు 91.03 శాతమే..
- ఘట్‌కేసర్ మండలం టాప్.. శామీర్‌పేట లాస్ట్
- ఎన్నికల నేపథ్యంలో పన్ను వసూళ్లలో జాప్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

2023-24 ఆర్థిక సంవత్సరం గడువు ముగిసింది. ఈ ఏడాదికిగాను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో 91.03 శాతం మాత్రమే ఆస్తి పన్ను వసూలైంది. వసూళ్లలో ఘట్‌కేసర్ మండలం 93.97శాతంతో అగ్రస్థానంలో నిలువగా.. శామీర్‌పేట మండలం 85.61 శాతంతో అట్టడుగున నిలిచింది. అత్యధిక గ్రామాలు ఉన్న మేడ్చల్ మండలంలో 90.80శాతం పన్ను వసూలైంది. కాగా, జిల్లా మొత్తం రూ.23 కోట్ల 14వేల 259 పన్ను వసూలైంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు మండలాలు, 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలంలో 11 గ్రామ పంచాయతీలు, కీసరలో 10, శామిర్‌పేటలో 10, మేడ్చల్‌లో 17, మూడుచింతలపల్లిలో 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీ కాలం ముగిసే సమయానికి జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.15 కోట్ల వరకు ఇంటి పన్ను వసూలైంది. ఆ తర్వాత ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన నాటి నుంచి గడిచిన రెండు నెలల కాలంలో దాదాపు రూ.8కోట్ల వరకు పన్ను వసూలైంది. ఎన్నికలు రావడం, సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గడువులోపు 100 శాతం పన్ను వసూలు కాకపోవడానికి కారణంగా తెలుస్తోంది. దాదాపు రెండు నెలలపాటు అధికారులు అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో ఉండటంతో పన్ను వసూలులో జాప్యం జరిగినట్టు సమాచారం. దీనికితోడు ఈ ఏడాది జనవరితో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. ఇప్పటికే సొంత శాఖ పనులతో సతమతమవుతుండగా.. జీపీ బాధ్యతలను కూడా అప్పగించడంతో పన్ను వసూలులో నిర్లక్ష్యం జరిగినట్టుగా అర్థమవుతోంది. పంచాయతీలతో సంబంధం లేని అధికారులను ఆయా గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించడంతో వారికి అవగాహన లేకపోగా.. నిత్యం పన్ను వసూలుపై దృష్టి పెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్టుగా తెలుస్తోంది. 15 రోజులుగా పార్లమెంట్ ఎన్నికల హడావుడి కూడా ప్రారంభం కావడంతో పన్ను వసూలులో మరింత జాప్యం జరిగినట్టుగా సమాచారం. లక్ష్యం చేరుకోవడానికి ప్రత్యేక ప్రణాళిక ఏమైనా రూపొందిస్తారా..? లేక వచ్చే ఏడాదికి మళ్లిస్తారో.. వేచి చూడాలి మరి.

అగ్రస్థానంలో ఘట్‌కేసర్

ఘట్‌కేసర్ మండలంలో మొత్తం 11 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందుకుగాను రూ.7 కోట్ల, 69 లక్షల 80వేల 879 లక్ష్యంగా నిర్ణయించారు. ఆర్థిక సంవత్సర గడువు ముగిసే మార్చి 31వ తేదీ నాటికి రూ.రూ.7 కోట్ల 22 లక్షల 68వేల 600 వసూలైంది. అంటే 93.88శాతం లక్ష్యం చేరుకుంది.



జిల్లాలోని ఆయా మండలాల వారీగా పన్ను వసూలు వివరాలు

మండలం	మొత్తం జీపీలు	టార్గెట్	వసూలైంది	శాతం
ఘట్‌కేసర్	11	7,69,80,879	7,22,68,600	93.88
కీసర	10	3,67,24,224	3,35,62,963	91.39
మేడ్చల్	17	7,53,16,661	6,83,87,946	90.80
మూడుచింతలపల్లి	13	2,14,83,603	1,96,94,766	91.68
శామిర్‌పేట	10	4,21,69,127	3,60,99,984	85.61
మొత్తం	61	25,26,73,954	23,00,14,259	91.03

జిల్లాలో ఆయా మండలాల వారీగా పన్ను వసూళ్లలో శామీర్‌పేట మండలం లాస్ట్‌లో నిలిచింది. ఈ మండల పరిధిలో మొత్తం 10 గ్రామ పంచాయతీలకు గాను రూ.4 కోట్ల, 21 లక్షల 69వేల 127 లక్ష్యం నిర్ధారించగా.. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.3 కోట్ల 60 లక్షల 99వేల 984 వసూలుతో 85.61శాతం ఇంటి పన్నులు వసూలైంది.

ఈ నెల 15లోపు 100శాతం పూర్తి చేస్తాం
వెంకయ్య, డీపీఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

జిల్లాకు నేను కొత్తగా వచ్చాను. మార్చి 31వ తేదీలోపు లక్ష్యం చేరుకోవాలి. నేను ఇక్కడికి రాక ముందు ఏం జరిగిందో నాకు తెలియదు. ఈ నెల 15వ తేదీలోగా లక్ష్యం చేరుకుంటాం.

పన్ను వసూలులో వెనుకబడిన మండలాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. సకాలంలో పన్ను వసూలు కాకపోవడానికి గల కారణాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా ముందుకెళ్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ వారంలో రోజుల్లో 100 శాతం లక్ష్యం చేరుకుంటాం.

గీత వృత్తిపై రియల్టర్ల పగ

(మొదటిపేజీ తరువాయి)

75 లక్షల మంది వరకు జీవనం సాగిస్తున్నారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, హత్నూర, కంది, కొండాపూర్, సదాశివపేట, మునిపల్లి వంటి ప్రాంతాల్లో పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. రెండు జాతీయ రహదారులు విస్తరించి ఉండటంతో రియల్ ఎస్టేట్ రంగం కూడా విస్తరించింది. దాంతో సంప్రదాయంగా పెంచుతూ వచ్చిన ఈత, తాటి చెట్లను నరికేస్తూ పోవడం వల్ల వృత్తిదారులకు వనాల్లేని పరిస్థితి నెలకొంది. బీడు భూముల్లో పొలాల గట్ల వెంట తాటి, ఈత చెట్లు ఉండేవి. భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటిని ఇండ్ల ప్లాట్లుగా మార్చేందుకు భూముల్లో ఉన్న తాటి, ఈత చెట్లను నరికేస్తున్నారు.

ఈత చెట్లను నరికిన రియల్టర్

సంగారెడ్డి జిల్లాలోని మునిపల్లి మండలం మేడికుంద గ్రామంలో భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్టర్ కొనుగోలు చేశారు. అట్టి భూమిలో ఈత వనాలున్నాయి. కల్లుగీత కార్మికులు చెట్లకు కల్లుగీసి అమ్ముకుంటున్నారు. బీడు భూముల్ని ప్లాట్లుగా చేసి అమ్ముకునేందుకు ఈత చెట్లు అడ్డువస్తున్నాయనే నెపంతో ఎవరికీ తెలవకుండా నరికేసి నేలమట్టం చేశారు. అదే విధంగా వట్‌పల్లి-గట్టుపల్లి గ్రామాల మధ్యన ఉన్న భూముల్లో వందల సంఖ్యలో ఈత చెట్లున్నాయి. ఈ భూమిని కూడా ప్లాట్లు చేయాలనే ఉద్దేశంతో చెట్లకు నిప్పు పెట్టి తగులబెట్టారు. కల్లుపారే వందలాది ఈత చెట్లను నరికేయడం, తగులబెట్టడం వల్ల రెండు, మూడు గ్రామాలకు చెందిన కల్లుగీత వృత్తిదారులకు వృత్తిలేకుండా పోయింది. ఇదే పరిస్థితి జిల్లాల్లోని ముంబాయి, నాందేడ్ జాతీయ రహదారులు విస్తరించి ఉన్న మండలాల్లోని అనేక గ్రామాల్లో నెలకొంది. కంది, సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్, మునిపల్లి, వట్‌పల్లి, జహీరాబాద్, అందోల్, హత్నూర, చౌటకూరు, అల్లాదుర్గం వంటి మండలాల్లోనూ వందలాది వనాల్ని లేకుండా చేస్తున్నారు. మొదట్లో సాగుభూమిలో గట్ల మీద తాటి విత్తనాలు నాటి పెంచేవారు. ఆ తర్వాత సాగుకు అడ్డొస్తున్నాయని కొన్ని తొలగించేవారు. ఇప్పుడు రియల్ ఎస్టేట్ కోసం మొత్తానికే తీసేస్తున్నారని కల్లుగీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

అమలుకు నోచని జీవో 560

పట్టాభూముల్లో తాటి, ఈత వనాల్ని నరికేస్తుండడంతో కల్లుగీత వృత్తి దెబ్బతింటోంది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతి కల్లుగీత సొసైటీకి సొంతంగా ఈత, తాటి వనాల్ని పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం భూముల్ని కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘాలు ఎప్పటి నుంచో పోరాడుతున్నాయి. ప్రభుత్వం చేపట్టే చెట్ల పెంపకం కార్యక్రమంలో ఈత చెట్లను చేర్చాలని డిమాండ్ చేశాయి. ఫలితంగా గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటల కట్టలపై, కల్లుగీత సొసైటీలకు గతంలో కేటాయించిన భూముల్లో ఈత చెట్లను నాటి పెంచాలని నిర్ణయించింది. అక్కడక్కడ మొక్కలు నాటినా రక్షణలేక బతకలేదు. జీవో 560 ప్రకారం ప్రతి సొసైటీకి 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వాలని పాలసీ చేశారు. అది కూడా రాష్ట్రంలో అమలు కాలేదు. ప్రతి సొసైటీకి 5 నుంచి 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి అందులో హైబ్రీడ్ ఈత, తాటి చెట్లను పెంచడం కోసం మోటర్, నీటి వసతి కల్పించాలనే డిమాండ్ ఉంది.

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో మొక్కుబడిగా ప్రచారం కోసం కొన్ని గ్రామాల్లో సొసైటీలకు భూములిస్తున్నట్టు ప్రకటించారు. పట్టా సర్టిఫికెట్లు మాత్రమే ఇచ్చి భూములపై పొజిషన్ చూపలేదు. దాంతో చాలా చోట్ల సొసైటీలకు కేటాయించిన భూముల్ని రియల్టర్లు కాజేస్తున్నారు. ఇతర అవసరాల పేరిట వాటిని వాడుకోవడంతో సొసైటీకి దక్కని పరిస్థితి. చెట్ల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది.

ఆధునీకరణ, నీరా ఉత్పత్తులపై ఉత్తమాటలే

కల్లుగీత వృత్తి దినదిన గండంగా మారింది. కల్లు గీసేందుకు కార్మికులు రోజుకు రెండు మూడు సార్లు చెట్లు ఎక్కి దిగాల్సి వచ్చేది. వర్షాలు, ఈదులు గాలులు, ఇతర కారణాల చేత తరచూ ప్రమాదాలకు గురవుతూ వృత్తిదారులు చనిపోతున్నారు గాయాలపాలై వృత్తికి దూరమవుతున్నారు. కల్లుగీత వృత్తిని ఆధునీకరించేందుకు వృత్తిలో ఆధునిక పద్ధతులు ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నా.. ఈ దిశగా అడుగులు పడట్లేదు. కల్లు శ్రేష్టమైన ప్రకృతి పానీయమైనందున నీరా ఇతర ఉత్పత్తుల్ని పెంచాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం 2019 అక్టోబర్ 28న నీరా పాలసీని తీసుకొచ్చి జీఓ ఎంఎస్ నెంబర్ 116 విడుదల చేసింది. గౌడ, ఈడిగ కులాల వారు మాత్రమే నీరా తీయడం, సేకరణ, అమ్మకాలు చేయాలని జీవోలో పేర్కొన్నారు. రూ.25 కోట్ల వ్యయంతో నెక్లెస్‌రోడ్‌లో నీరాకేఫ్‌ను నిర్మించి 2023 మే 6న ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా ముద్విన్, సంగారెడ్డి జిల్లా మునిపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనం, సర్వేల్ నుంచి నీరా సేకరించాలని నిర్ణయించారు. నీరా పాలసీ ఆరంభ శూరత్వంగానే మిగిలిపోయింది. ఎన్నికల కోసమే చేశారనే ఆరోపణలు గతంలోనూ వినిపించాయి.

ఈత చెట్లు నరికిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

ఆశన్న, రమేష్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునిపల్లి, వట్‌పల్లి ప్రాంతాల్లో ఈత చెట్లను నరికేసిన, చెట్లను తగులబెట్టిన వ్యక్తుల్ని గుర్తించి క్రిమినల్ కేసులు పెట్టాలి. ఈత, తాటి చెట్లను నరికేస్తున్న వ్యక్తుల్ని ఉపేక్షించడం వల్లనే జిల్లా వ్యాప్తంగా రియల్టర్లు యదేచ్ఛగా చెట్లను తొలగిస్తున్నారు. నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి శిక్షించడం ద్వారానే వృత్తిదారులకు రక్షణ కలుగుతుంది. పారిశ్రామిక అభివృద్ధి, రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరిట ఈత, తాటి వనాల్ని లేకుండా చేస్తున్నారు. ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని చెట్లు నరికేస్తున్న వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

రేవంత్ అంటే..నా వంతేంటని అడుగుతున్నారు

- సెటిల్‌మెంట్ల దందా చేస్తున్నారు
- కాంగ్రెస్‌లో చేరేటోళ్లు తమ రేటెంత అని అడుగుతున్నారు : బీజేపీఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హెటిరో సంస్థకు కేటాయించిన 30 ఎకరాల భూమి కేటాయింపు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రూ.300 కోట్లను తీసుకుని ఢిల్లీకి పంపారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, సెటిల్‌మెంట్లు గతంతో పోలిస్తే మరింత పెరిగాయనీ, అవినీతి నేతలు రేవంత్‌రెడ్డి దగ్గరకు పోయి సెటిల్‌మెంట్ చేసుకుంటే తన వంతు కోటా ఏంటి అని బహిరంగంగా అడుగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరే నేతలు రెడ్డీ తమ రేటెంత అని అడుగుతున్నారనీ, ఈ రేటును ఎవరు ఫిక్స్ చేస్తున్నారో అర్థం కావటం లేదని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారం లోకి రాగానే అవినీతి చేసినోళ్లను జైలుకు పంపిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారనీ, నాలుగు నెలలు దాటినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డునున్న 15 ఎకరాల భూమిని గత ప్రభుత్వం అప్పటి ఎంపీ పార్థసారథి రెడ్డికి, హెటిరో డ్రగ్స్ సంస్థకు ఇస్తే రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారనీ, ఇప్పుడు ఆయన సర్కారే రూ.2 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొత్త జీవో ద్వారా అంటగట్టారని విమర్శించారు. గత ప్రభుత్వ అరాచకాన్ని బయటపెట్టారని సంతోషించేలోపే దాన్ని వారికే కట్టబెట్టారని తెలిపారు. సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ప్రభుత్వ భూమి విలువ 10 శాతం పెంచాలి కదా? అని ప్రశ్నించారు. ఈ భూమి విషయంలో రేవంత్‌రెడ్డి రూ.300 కోట్లు తీసుకుని ఢిల్లీకి పంపారని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అవినీతికి సంబంధించిన ఫైళ్లను దగ్గర పెట్టుకుని, ధరణిపై వేసిన కమిటీ ఎత్తిచూపుతున్న లోపాలను ఆధారం చేసుకుని దందాలు, సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారని విమర్శించారు. అందుకే కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగించట్లేదన్నారు. చిన్న ఆధారం దొరికితేనే వందల కోట్ల సెటిల్‌మెంట్లు జరిగాయని తేలిందన్నారు. 2 లక్షల కోట్ల ధరణి కుంభకోణంలో ఏ మేరకు సెటిల్ మెంట్ చేయనున్నారో అని ఆందోళన వ్యక్తం చేశారు. కొంత మంది వ్యక్తులను ఏర్పాటు చేసుకుని సుడో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. రెండు, మూడు రోజుల్లో మరో సెటిల్‌మెంట్‌ను బయటపెడతానన్నారు.లీకులు బయటకు వస్తున్నాయనే సచివాలయంలో ఆంక్షలు తీవ్రతరం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడు రాజగోపాల్ రెడ్డి ఇంటికి వెళ్ళగానే వెంకట్‌రెడ్డికి భయం పట్టుకుందన్నారు. ఏక్‌నాథ్ షిండేలు లేకపోతే రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఎందుకు అభద్రతాభావంతో మాట్లాడారని విమర్శించారు.

కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమాలు

- ఆలిండియా కిసాన్ సభ 89వ ఆవిర్భావ దినోత్సవ సభలో.. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు
- రైతు సమస్యలపై ఏఐకేఎస్ అనేక పోరాటాలు : మిర్యాలగూడ సభలో జూలకంటి



నవతెలంగాణ-ఖమ్మం/మిర్యాలగూడ

స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా రైతులంతా సంఘటితమై ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) పేరుతో ఏర్పడిన సంఘం రైతు సంఘం అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ తెలిపారు. గురువారం ఏఐకేఎస్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జెండా ఆవిష్కరణలు, సభలు నిర్వహించారు. ఖమ్మంలోని జిల్లా ప్రజా సంఘాల కార్యాలయం సుందరయ్య భవన్‌లో రైతు సంఘం జెండాను పోతినేని ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పేద రైతులు, కౌలు రైతుల విముక్తి కోసం ఒక సంఘం కావాలని, అలా దేశంలో 1936లో ఏర్పడిన అఖిల భారత కిసాన్ సంఘ్ రైతాంగ సమస్యలపై దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందన్నారు. రైతు సంఘం ఏర్పడిన మొట్టమొదటి సారి ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలోని ఇచ్చాపురం నుంచి తడా వరకు బ్రహ్మాండమైన రైతు యాత్ర నిర్వహించి, దేశ వ్యాప్తంగా రైతు ఉద్యమాలకు శ్రీకారం చుట్టినట్టు గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా తీసుకువచ్చిన 3 నల్లచట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరిగిన రైతు పోరాటాల్లో ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. రైతుల పోరాటాలకు తలొగ్గి మోడీ ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేసిందని, మళ్ళీ వాటిని అమలు చేయడం కోసం దొడ్డిదారిన ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రైతులకు ఇచ్చే వ్యవసాయం సబ్సిడీల మీద కోత పెడుతుందని, ఉపాధి హామీ చట్టాన్ని కూడా నీరుగారుస్తుందని, ఎరువు, విత్తనాలకు ఇచ్చే సబ్సిడీల మీద కోతలు పెడుతూ రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పంటకు కనీస మద్దతు ధర కల్పించకుండా, మార్కెట్‌లను ఎత్తివేయాలని ప్రయత్నం చేస్తుందని, వీటన్నింటికి వ్యతిరేకంగా పెద్దఎత్తున రైతులు పోరాటాలు చేయాలని, ఇప్పటి వరకు సాధించుకున్న చట్టాలను, హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అఖిల భారత కిసాన్ సభకు ఎంతో చారిత్రాత్మక చరిత్ర ఉందన్నారు. జాతీయోద్యమంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, రైతాంగాన్ని సమీకరించి, దున్నేవాడికి భూమి కావాలనే లక్ష్యంతో రైతు ఉద్యమం నిర్వహించి దాదాపు కోట్లాది ఎకరాల భూమి సాధించుకున్న చరిత్ర ఏఐకేఎస్‌కు ఉందన్నారు. భారత దేశంలో భూములను కార్పొరేట్ శక్తులు కబలించే కుట్రలకు వ్యతిరేకంగా పోరాడే సంఘం ఏఐకేఎస్ అని తెలిపారు.

భవిష్యత్‌లో జరిగే రైతు ఉద్యమాలకు రైతులంతా ఐక్యంగా సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, సీఐటీయూ జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, వ్యకాస జిల్లా నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్, బోడపట్ల సుదర్శన్, పొన్నెకంటి సంగయ్య, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకులు మెరుగు రమణ, కేవీపీఎస్ నాయకులు నందిపాటి మనోహర్, పగడాల నాగేశ్వరరావు, నెల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆ సంఘం జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన రైతాంగ పోరాటం నేటికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిపారని, ఆ పోరాటంలో 80 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు రైతన్న సమస్యలపై సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ కాలనీలో సిద్ధార్థ్ కాలేజీ వద్ద రైతు సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కూన్‌రెడ్డి నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ శ్రీశైలం ఆవిష్కరించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో సంఘం జెండాను తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో రైతు సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు.

సామాజిక అసమానతలపై పోరాడిన పూలే

- బీసీటీఏ అధ్యక్షులు కృష్ణుడు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో సామాజిక అసమానతలపై పోరాడిన సంఘసంస్కర్త జోతిబాపూలే అని బీసీటీఏ అధ్యక్షులు కె కృష్ణుడు అన్నారు. 197వ జయంతి సందర్భంగా గురువారం పూలే విగ్రహానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కృష్ణుడు మాట్లాడుతూ దేశాన్ని పట్టిపీడిస్తున్న అంటరానితనం, కులవివక్ష, సామాజిక అసమానతలపై పూలే నిరంతరం పోరాటం చేశారని చెప్పారు. మహిళాభివృద్ధి, వితంతు పునర్వివాహం కోసం కృషి చేశారనీ, అంటరానితనం, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పనిచేశారని అన్నారు. సమస్యలు తొలగిపోవాలంటే విద్య ఏకైక మార్గమంటూ గ్రహించి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశారని వివరించారు. పూలే ఆశయాలను ముందుకుతీసుకెళ్లాలనీ, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక అసమానతలున్నాయని చెప్పారు. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ నాయకులు మహేష్, వివేకానంద, మధు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ, జైన, సిక్కు మతాల్లోకి మారాలన్నా అనుమతి కావాల్సిందే

- గుజరాత్ ప్రభుత్వ సర్క్యులర్

న్యూఢిల్లీ : హిందూమతం నుంచి ఎవరైనా బౌద్ధ, జైన, సిక్కు మతాల్లోకి మారాలనుకుంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం హుకుం జారీ చేసింది. గుజరాత్ హోం శాఖ చడీచప్పుడు లేకుండా ఇందుకు సంబంధించిన ఒక సర్క్యులర్‌ను ఇటీవల జారీ చేసింది. ముందస్తు అనుమతి కోరుతూ దరఖాస్తులు అందినప్పుడు సంబంధిత కార్యాలయాలు రాజ్యాంగంలోని 25(2) అధికరణ కింద సిక్కు, జైన, బౌద్ధ మతాలు హిందూమతంలోనే చేర్చబడినందున అటువంటి మత మార్పిడికి ముందస్తు అనుమతి అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని, ఇక నుండి అలా కుదరదని ఆ సర్క్యులర్‌లో ప్రభుత్వం పేర్కొంది. మత మార్పిడికి అనుమతించేటప్పుడు నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆ సర్క్యులర్ పేర్కొంది. హిందూ మతంలో కుల వివక్షకు వ్యతిరేకంగా దసరా వంటి పండగల సందర్భంలో దళితులు బౌద్ధమతంలోకి మూకుమ్మడిగా మారడం ఈ రాష్ట్రంలో సాధారణంగా జరుగుతూ ఉంటుంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బౌద్ధంలోకి మారినవారు ఉన్నారు. 'హిందువుగా పుట్టినందుకు గర్వించు, హిందువుగానే జీవించు' అన్న ఫాసిస్టు ఆరెస్సెస్ నినాదానికి భిన్నంగా జరుగుతున్న ఈ పరిణామాలను బిజెపి ప్రభుత్వం అడ్డుకోవాలనుకుంది. అంతే ఆగమేఘాల మీద సర్క్యులర్ జారీ చేసింది.. హిందూమతం నుంచి బౌద్ధమతానికి మారేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించే సమయంలో కొంతమంది జిల్లా మేజిస్ట్రేట్‌లు చట్టానికి, ఆ నిబంధనలకు తప్పుగా భాష్యం చెబుతున్నారని ఆ సర్క్యులర్‌లో పేర్కొంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శుక్రవారం | ఏప్రిల్ 12, 2024 | www.navatelangana.com

అంబేద్కర్ శోభాయాత్ర గోడపత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ - చైతన్యపురి

ఈ నెల 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎల్బీనగర్ నుండి కొత్తపేట చౌరస్తా వరకు అంబేద్కర్ శోభాయాత్రను నిర్వహించనున్నట్టు కామన్ మ్యాన్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ చైర్మన్ సంఘటి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం అంబేద్కర్ శోభాయాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి కార్యచరణ కలిసివచ్చే ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, బహుజన వాదులందరూ కలిసి చేసుకునే ఒక మహాద్భుతమైన పండుగ ఈ శోభాయాత్ర అని అన్నారు. ఈ యాత్రను ఈ నెల 14న సాయంత్రం 6:30 నుండి రాత్రి పది గంటల వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వార్షిక టర్నోవర్ రూ.50 వేల కోట్లకు పైగా సాధించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

నవతెలంగాణ - చైతన్యపురి/బంజారాహిల్స్

ప్రపంచంలోనే 6వ అతిపెద్ద ఆభరణాల వ్యాపార సంస్థగా నిలిచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ రికార్డు వార్షిక టర్నోవర్ గత సంవత్సరం రూ.51, 218 కోట్ల వార్షిక రిటైల్ గ్లోబల్ టర్నోవర్‌ను చేరుకున్నట్లు చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ న్యూజిలాండ్, ఈజిప్ట్, బంగ్లాదేశ్, ఐరోపాలోని మరికొన్ని ప్రాంతాలలో అదనంగా కొత్త షోరూమ్‌లను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. వచ్చే ఏడాదిలోపు 100 షోరూంలను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దీంతో అదనంగా 7000 మందికి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. జార్ఖండ్, గోవా, అస్సాం, త్రిపుర, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకు మలబార్ ఉనికిని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటివరకు మలబార్ గ్రూపు యొక్క కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా సేవా కార్యక్రమాల కోసం రూ.234 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు.



బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - మీర్‌పేట్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి జేటవత్ శ్రీనివాస్ నాయక్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కొందరు నాయకులు తమ స్వలాభం కోసం ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీ గెలుపు కోసం పని చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అలా నమ్మక ద్రోహం చేయకుండా ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఇతర పార్టీల నాయకులు కొందరు బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని మాట్లాడుతున్నారన్నారు. ఇది కేవలం బీఆర్ఎస్ పార్టీ నాయకులను అయోమయంలో నెట్టేసేందుకే అవాస్తవాలు మాట్లాడుతున్నారని కొట్టిపడేశారు. గత పదేండ్లలో కేసీఆర్ చేసిన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులకు తేడా చెప్పాలని సూచించారు. 13న నిర్వహించనున్న చలో చేవెళ్ల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అణిచివేతలకు గురైనవారికోసమే సామాజిక నిధి సేకరణ



- రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య

నవతెలంగాణ - ఎల్బీనగర్

అణిచివేతలకు గురైనటువంటి వారికి అండగా ఉండడం కోసమే సీఐటీయూ సామాజిక ఉద్యమ నిధిని సేకరించడం చేయడం జరిగిందని జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య అన్నారు. జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీఐటీయూ సామాజిక ఉద్యమ నిధి సమీకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడారు. బీజేపీ మతోన్మాద విధానాలను అనుసరిస్తుందన్నారు. మతోన్మాద బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదేండ్లలో అనేకమంది కార్మికులు, రైతులు, విద్యార్థులు, మేధావులు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. అణిచివేతలకు గురైనటువంటి వాళ్లకు అండగా ఉండడం కోసం సామాజిక నిధి వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ నిధిని సీఐటీయూ సామాజిక ఉద్యమాలకు, పోరాటాల కోసం ఉపయోగిస్తుందన్నారు. 14న జరగబోయే భారతదేశంలో కార్మికుల సమస్యలు, భారత రాజ్యాంగం ప్రమాదం ఎల్బీనగర్‌లో సదస్సు సీఐటీయూ ఆఫీసులో ఉంటుంది తెలిపారు. అప్పటివరకు వసూలైన నిధిని సీఐటీయూ రాష్ట్ర కేంద్రానికి సదస్సు అనంతరం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు గోపి, జయమ్మ, పద్మ, కళావతి, అనురాధ, యాదమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మాల సంఘాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చెవుల దశరథ, గౌరవ అధ్యక్షుడిగా ఓనమాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా ఓనమాల వేణుగోపాల్, కడారి శ్రీరామ్, ప్రధాన కార్యదర్శిగా తావుల శ్రీనాథ్, కోశాధికారిగా చెవుల నరేందర్, సంయుక్త కార్యదర్శిగా ఓనమాల చక్రపాణి, చెవుల వంశీ, రావుల యాదయ్య, గౌరవ సలహాదారుడుగా తావుల జగన్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దశరథ మాట్లాడుతూ తుర్కయంజాల్‌లో మాలల అభివృద్ధికి తమ కమిటీ పనిచేస్తుందని హామీ ఇచ్చారు. మాలల సమస్యలను ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే నూతన సభ్యులుగా చెవుల విష్ణు, ఓనమాల బలరాం, చెవుల నవీన్, కడారి కిరణ్, రాంప్రసాద్, వినోద్, సాయికృష్ణ, భాస్కర్, అశోక్, గణేష్, శ్రీకాంత్ లు ఎన్నికయ్యారని తెలిపారు.

కోలా శ్రీనివాస్‌కు జ్యోతిరావు పూలే పురస్కార అవార్డు



నవతెలంగాణ - బడంగ్‌పేట్

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఖైరతాబాద్ లోని విశ్వేశ్వరయ్య భవనంలో వివిధ కుల సంఘాలు, బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కోల శ్రీనివాస్‌కు జ్యోతిరావు పూలే పురస్కార అవార్డును ప్రదానం చేశారు. గత 25 సంవత్సరాలుగా బీసీ సంఘంలో కుల సంఘంలో ఎన్నో సేవలు చేసినందుకు గాను పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర ఎం.బి.సి, డి.ఎన్.టీ.అధ్యక్షులు కోల శ్రీనివాస్‌కు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, మహాత్మ జ్యోతిబాపూలే ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై శ్రీనివాస్‌కు ఆ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీల కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాత్మ జ్యోతిరావు పూలే వంటి మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరీపై ఉందని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం నాడు ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బోర్డు బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎండీ హాజరై.. జ్యోతి ప్రజ్వలన చేసి, పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు దశరథ్ రెడ్డి, శ్రీధర్, వినోద్ భార్గవ, ప్రభు, జీఎంలు, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, జలమండలి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామరాజు, ప్రధాన కార్యదర్శి



సాయికిరణ్ గౌడ్, ఇతర నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.త



నవతెలంగాణ - ఎల్బీనగర్

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎల్బీనగర్ సర్కిల్లో ఉన్న ఆయన విగ్రహానికి వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా, తెలంగాణ సామాజిక ఫ్రంట్, లెఫ్ట్ బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాయ బండి పాండురంగచారి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ కన్వీనర్ వెన్నపూజ పరశురాజ్, వర్కర్స్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగయ్య ముదిరాజ్, సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్య, ఎల్బీఎఫ్ కన్వీనర్ బడే అజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను, సీనియర్ పాత్రికేయులు కంతం సైదులు, మమ్మద్ ఇస్మాయిల్, గోర శ్యామ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ- నాగోల్

జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని సరూర్‌నగర్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన వెంట మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, బేర బాల కిషన్, అరవింద్ కుమార్, వెంకట్ గౌడ్, స్కూల్ స్టూడెంట్స్ తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ - మీర్ పేట్

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - మీర్ పేట్

జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని బాలాపూర్ చౌరస్తాలో ఉన్న పూలే విగ్రహానికి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ స్థానిక కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ అల్కాపురి చౌరస్తాలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, జ్ఞానేశ్వర్ యాదవ్, శ్రీశైలం, వెంకట్, రమేష్, సైదులు, విప్లవ రెడ్డి, నగేష్, శివ తదితరులు ఉన్నారు.





నవతెలంగాణ - నాగోల్

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బీసీ కులాల ఐక్యవేదిక పెద్ద పూర బ్రహ్మయ్య ఆధ్వర్యం లో నాగోలు డివిజన్‌లోని అల్కాపూర్ చౌరస్తాలోని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం వద్ద ఉన్న జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాగోల్ డివిజన్ అధ్యక్షురాలు మంజులారెడ్డి, లక్ష్మీ ప్రసన్న గౌడ్, ఎం నరేందర్ గౌడ్, పగడాల ఎల్లయ్య, పరశురాం, నాగిళ్ల యాదగిరి, చిలక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురిలోని బోడెపుడి స్మారక భవనంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్ అధ్యక్షతన గురువారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి ఎల్బీనగర్, సరూర్ నగర్, హయత్‌నగర్ సర్కిల్ కమిటీల నాయకులు, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్‌లు పూలమాలలు



వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షవరా వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేష్, రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి మల్లేష్, సిహెచ్ వెంకన్న, కృష్ణ, మల్లేష్, బి.కనకయ్య, ఆలేటి ఎల్లయ్య, వీరయ్య శివ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో గురువారం పూలే చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బి.శంకరయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్, అడ్వకేట్ కె. అరుణ్ కుమార్, నాయకులు యం.



సత్యనారాయణ, ఐ.భాస్కర్, కే. వెంకట కృష్ణ, ఎస్.యాదగిరి, మాధవ రెడ్డి, పల్లె.కృష్ణ, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు జస్టిస్ బి.చంద్రకుమార్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఉపాధ్యక్షులు చిరుమర్తి శేఖర్, ఏ.వి.ఎం. మీడియా చైర్మన్ అనపోసల వెంకటేష్, బీసీ కులాల సమన్వయకర్త బొమ్మ రఘురాం నేత, గంగుల నరసింహారెడ్డి, బచ్చు రామకృష్ణ, బీఆర్‌పి ఎస్ అధ్యక్షులు కోట్ల వాసు, చేపూరి చంద్రశేఖర్, ఆడెపు త్యాగరాజు, తాటి ఎల్లయ్య, ఎర్రోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - నాగోల్

జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఎల్బీనగర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగోలు డివిజన్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు సిద్దాల ఐలయ్య, కేసిరెడ్డి పద్మ రెడ్డి, రామ్ దయాకర్ రెడ్డి, నరేందర్ పటేల్, మనోజ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని మధుర నగర్ కాలనీలో గురువారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు శ్రీనివాస్, రాములు, వట్టికోట శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో కలిసి కొండా సంగీతారెడ్డి ప్రచారం

నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి కొండా సంగీత రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని గురువారం ఉదయం మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ స్కూల్ పార్కులో నిర్వహించారు. తర్వాత వాకర్స్‌తో కలిసి బీజేపీ సారథ్యంలో నరేంద్ర మోడీ చేసిన దేశాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా కొండా సంగీత రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ధర్మాన్ని కాపాడడంలో నరేంద్ర మోడీ ఎంతో కృషి చేశారని చెప్పారు. విశ్వేశ్వర్ రెడ్డికి చేవెళ్ల అభివృద్ధిపై సమగ్రమైన విజన్, ప్లానింగ్ ఉన్నాయని చెప్పారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి, కొండా విశ్వేశ్వర్ రెడ్డిని, నరేంద్ర మోడీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌దే విజయం



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - ఎల్బీనగర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురడం ఖాయం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో గురువారం పలుచోట్ల జరిగిన రంజాన్ ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తర్వాత ముస్లిం సోదర సోదరిమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలోని ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట్, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం కొత్తపేట రాజధాని గార్డెన్స్‌లో జరిగింది. ఈ సమావేశానికి మల్కాజ్ గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తాతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారే వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీని వీడిన వారు మరలా ఈ పార్టీ వైపు చూసే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో పార్టీ ప్రచార కార్యక్రమాలను నిర్వహించి.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించాలని కోరారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెరిగిపోయిన కరెంట్, తాగునీటి కష్టాలు..

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరెంటు, తాగునీటి కష్టాలు పెరిగిపోయాయని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. ప్రతి ఇంటిలో మూలనపడ్డ ఇన్వర్టర్లను, జనరేటర్లను రిపేరు చేసుకునే దుస్థితి దాపరించిందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మంచి సేవ చేసే గుణమున్న రాగిడి లక్ష్మారెడ్డిని మనం గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మనమే అభ్యర్థి అన్నట్లుగా కష్టపడి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుందాం..కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం అని అన్నారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు సాగర్ రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, పలు డివిజన్ల తాజా, మాజీ అధ్యక్షులు, అధ్యక్షురాండ్లు, పలు విభాగాల కమిటీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, పలు విభాగాల తాజా, మాజీ కమిటీ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

శుక్రవారం | ఏప్రిల్ 12, 2024 | www.navatelangana.com



గౌతమ్ నగర్ చౌరస్తాలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్‌నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, జవహర్ కార్పొరేటర్ ముర్గేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరశురాం రెడ్డి,జేపీసీ వెంకన్న, చిన్నా యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-మల్కాజిగిరి

పూలే జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

పూలే జయంతి ఉత్సవాలను సైనిక్‌పురి చౌరస్తాలో తిరుపతయ్య సేవా ఆర్గనైజేషన్ వ్యవస్థాపక నాయకులు మల్లేశ్ వంశ రాజ్, యట భాస్కర్, పెంచాల సురేందర్‌ల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు స్వర్ణ రాజు శివమణి, బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు పావని మణిపాల్ రెడ్డి, గొల్లూరి అంజ య్య, శ్రీనివాస్ రెడ్డి వివిధ పార్టీల నాయకులు అంజిరెడ్డి రాఘవరెడ్డి, మల్కా రమాదేవి, కుమార స్వామి, బాల్ నరసింహ, రమేష్ యాదవ్, సీతారాం రెడ్డి, మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. పూలే సేవలు ఎప్పటికీ మనకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు.



చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

నవతెలంగాణ-ఉప్పల్

చిలకనగర్ డివిజన్‌లోని పిస్తా హౌస్ వద్ద ఆర్య సమాజ్ తపస్య ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉప్పల్ ఆర్య సమాజ్ తపస్య ఫౌండేషన్ వారు ప్రతీ సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు ఎంతో సేవ భావంతో పని చేస్తున్నారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తపస్య ఫౌండేషన్ సభ్యులు ఆచార్య వేద సింధు, బొల్ల విజయ్ కుమార్ , బ్రిజానంద్ రెడ్డి, గంగా ధర్ ,మహాజన్ ,సత్య కళ, లక్ష్మణ్ ,పండిత్ విజయ్ కుమార్ ,ఎస్ ప్రకాష్, గోపి, సత్యనారాయణ, మూర్తి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ రామాంజనేయులు, కిషోర్, శ్యామ్, బాలు, చిన్న, పాపి రెడ్డి తదితరులున్నారు.



వికలాంగుడికి ఎంపీపీ చెరుకు మిషన్ అందజేత

- ఇద్దరు ఆడపిల్లల చదువుకు భరోసా..

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ పట్టణానికి చెందిన క్రాంతి (వికలాంగుడు) సహాయం కోసం రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిని కోరగా ఎంపీపీ వైయస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో చెరుకు మిషను అందజేశారు. ఈ మేరకు గురువారం పరకాల కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావుతో కలిసి చెరుకు మిషను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలు కోల్పోయి కుటుంబాన్ని పోషించలేక జీవనోపాధికి ఇబ్బంది పడుతున్నారని సహాయం కొరకు అడగగానే వైయస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో చెరుకు మిషను అందజేశామని తెలిపారు. వారి కుటుంబానికి ఇతర ఏ సమస్యలు ఏర్పడినా తన దృష్టికి తీసుకురావాలని, ఇద్దరు ఆడపిల్లల చదువుకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మారావు, మాజీ ఉపసర్పంచ్ మాయ నరేష్, మాజీ వార్డు సభ్యులు మల్లేష్, రామచందర్, నాయకులు సదానంద రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శివ నాయక్, విక్రాంత్ రెడ్డి, సామూహిక కార్యకర్త జీవన్ రెడ్డి, వైయస్ రెడ్డి ట్రస్ట్ సభ్యులు కాసుల వెంకటేష్ గౌడ్, చిలకమర్రి రాము, వీరారెడ్డి, బాబు కుమార్, అనిల్ గౌడ్,గుమ్మడి ప్రవీణ్ చీమల భాను యాదవ్, అశోక్ గౌడ్, శివగల భాను, క్రాంతి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



కాలనీ ముఖద్వార తోరణం ప్రారంభం

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ నివాసులైన మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి కుటుంబం నిర్మించిన కాలనీ ముఖద్వార తోరణం (ఆర్చ్)ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరలు పంపిణీ

నవతెలంగాణ-ఉప్పల్

రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉప్పల్లో దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ బుడే సాహెబ్ తనయుడు టీపీసీసీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ మదర్ వలి తన నివాసం వద్ద ప్రతి ఏటా లాగే పరిశుద్ధ కార్మికులకు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొట్టు రాజేష్, సుధాకర్ రెడ్డి(దేవి గార్డెన్స్) రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి రఫిక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, బూర్గుల రమేష్, కొంపల్లి బాలరాజు, ఆవులగడ్డ శ్రీనివాస్ యాదవ్, బూర్గుల వేణు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బుడే సాహెబ్ ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధికి రు.5 లక్షల వితరణ

నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్ యాదవ సంఘం చైర్మెన్ సర్వ శ్రీనివాస్ యాదవ్ గురువారం ఓల్డ్ రామంతాపూర్‌లోని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధికి రు.5 లక్షల చెక్కును ప్రధాన పురోహితులు మోత్కూరు శేఖర్ బాబు శర్మ, అధికారి శ్రీనివాస రావులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, సర్వ రవి యాదవ్, బాబు యాదవ్, సూర్య మురళి గౌడ్, యాదవ్, అరుణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





ఆధునిక యుగ వైతాళికుడు పూలే

పలు చోట్ల ఘనంగా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-కాప్రా

ఆధునిక యుగ వైతాళికుడు మహాత్మ జ్యోతి రావు పూలే అని జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాస్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పూలే జయంతిని కుషాయిగూడ మేడ్చ ల్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు టి శ్రీనివాస్, జిల్లా సమతా విభాగం కన్వీనర్ సబితా రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాటా డుతూ పూలే సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు అని, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు శివ శంకర్ రెడ్డి, దుర్గా చారి, శివప్రసాద్, దినేష్, బ్రహ్మారెడ్డి, పి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర భారతానికి వందేండ్ల ముందే బడుగు బలహీన వర్గాలచే మహాత్ముడిగా జన నీరాజనాలు అందుకున్న గొప్ప సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతిబా పూలే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్ బోస్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు ఆయన మాట్లాడుతూ పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావి తరాలకు సైతం మార్గ దర్శకుడని చెప్పారు. సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, ఏఐవై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నర్సింగ్ రావు, సత్యనారాయణ, నర్సింహా రావు తదితరులు పాల్గొన్నారు.

ఘట్కేసర్ : సామాజిక విప్లవ స్ఫూర్తి ప్రదాత జోతిభా పూలే నేటి తరానికి ఆదర్శప్రాయుడని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్ సబిత కొనియాడారు గురువారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో పూలే జయంతి కార్యక్రమం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సబిత మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో కుల వివక్ష వ్యతిరేక ఉద్యమాన్ని, సామాజిక, న్యాయం కోసం పోరాడాలన్నారు . లాభాలు వచ్చే నవరత్నాలు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చవుకగా బడా కార్పొరేట్ శక్తులకు



బీజేపీ పాలనలో మోడీ అమ్ముతున్నాడని ప్రభుత్వ రంగం మొత్తం ప్రయివేటు చేయడం ద్వారా దళిత గిరిజన బలహీనవర్గాలకు క్రమంగా రిజర్వేషన్లు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మహనీ యుల స్ఫూర్తితో మతోన్మాద మనువాద శక్తులను ఓడించి రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, బీసీ కులగణ నను, ప్రభుత్వ రంగ సంస్థలను, సామాజిక న్యాయా న్ని మతసామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యురాలు కే అలివేల, చల్లగొండ అరుణ, బి.సునీత మంజుల, కె. అనసూయ జయ రామక్క, శాంత,పార్వతమ్మ లలితలి లిభారతమ్మ విజయ పి శేఖర్ మోహన్, పుల్లయ్య, బాబు, మమత తదితరులు పాల్గొన్నారు

పూలే విగ్రహావిష్కరణ

కాప్రా : కుషాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన పూలే విగ్రహాన్ని కుషాయిగూడ గ్రామ పెద్దలు, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం విగ్రహ దాత, యువ నాయకుడు చల్లా ప్రభాకరను గ్రామ పెద్దలు అభినందించారు. అసోసియేషన్ ప్రతినిధులు చల్లా వేరేషం, పనగట్ల చక్రపాణి గౌడ్, చిత్తుల కిషోర్ గౌడ్ , పంజాల బాబు గౌడ్ , వాసు దేవ ముదిరాజ్, క్యాత దినేష్, గణేష్ ముదిరాజ్, చందన్న, కొడకండ్ల యాదయ్య, యదన్న, చల్లా వెంకటేష్, సారా అనిల్, బింగి బిక్షపతి, బ్యాటరీ గోపాల్, బాలనర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ : అల్వాల్ సర్కిల్‌లో మచ్చ బొల్లారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలే జయంతి ఘనంగా జరుపుకున్నారు. లింగాల శంకర్, పద్మిని, అజయ్ రెడ్డి, వెంకటేష్, సుజాత,అజిత్ సాయి, మల్లికార్జున్ యాదవ్, గొల్ల ఆనంద్, ప్రదీప్, పివి శ్రీకాంత్,మహేష్ రాజ్, ఉదయ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.







సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన పూలే

- తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాములు

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సైనిక్‌పురి చౌరస్తాలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర సంస్మరణ సభ నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాములు, కోమటి రవి, చంద్రశేఖర్, మల్లేశంలు హాజరై పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.అనంతరం ముఖ్య అతిథి రాములు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆనాడు సామాజిక వివక్షలకు వ్యతి రేకంగా గొప్పగా పోరాడారని చెప్పారు. తాను కూడా వివక్షను ఎదుర్కొని చదువు కోటానికి ఎన్ని ఆటంకాలు వచ్చినా ముందుకే సాగారని తెలిపారు. అంటరా నితనం బడుగు బలహీన వర్గాలు చదువు నిరాకరించబడిన తరుణంలో తన భార్య సావిత్రిబాయి పూలే ను తర్ఫీదు చేసి అంటరాని కులాల పిల్లలకు ముఖ్యం గా ఆడపిల్లలకు విద్యను బోధించారని, అంతేకాకుండా అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసి పీడిత ప్రజలకు విద్యను అందించడంలో ఎంతో గొప్ప కృషి చేశారన్నారు. అలాగే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాటం కాకుండా వితంతువులకు ఆశ్రయము కల్పించి కుటుంబీకుల దాష్టికాలకు బలైపోయిన తల్లు లకు ఆదరణ కల్పించి వారి పిల్లలను కూడా పెంచి పెద్ద చేసిన గొప్ప మానవతావాది ఆయన అని అన్నారు. ప్లేగు వ్యాధి వచ్చినప్పుడు ప్రజలకు సేవలు చేసి దానికే బలైన గొప్ప సంఘసంస్కర్త పూలే అన్నారు. భారత ప్రజలు నిర్మించుకున్న రాజ్యాంగాన్ని నేటి పాలకులు పూర్తిగా ధ్వంసం చేసి సనాతన మనువాదాన్ని కొత్త రాజ్యాంగంగా రూపొందించుకోవాలని ప్రయత్నిస్తున్నారని దానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రసాద్ బాబు , సీహెచ్ నాగేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం జరిగిన చర్చా కార్యక్రమంలో రాములు ప్రసాద్ బాబు, కోమటి రవి, మల్లేశం, నరసింహారావు, సిహెచ్ నాగేశ్వ రరావు పాల్గొని ప్రసంగించారు. జె చంద్రశేఖర్, ఎస్. శ్రీనివా స్, కోమ టి రవి, మురారి, వెంకటేశ్వరరావు, సంపత్, హెచ్‌వి. స్వామి, సీహెచ్ నాగేశ్వ రరావు వెంకటసుబ్బయ్య, జి శివరామకృష్ణ, ఆర్ఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ మహిళా, ఓబీసీ, ఎస్టీ సెల్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు పత్తి కుమార్, రాజనోల్ల లక్ష్మి, గువ్వ రవి ముదిరాజ్, గణేష్ నాయక్, రాహుల్ యాదవ్‌లు గురువారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-కాప్రా

గుక్కెడు నీళ్లిచ్చి గొంతు తడపండి మహాప్రభో..




అసలే వేసవికాలం గుక్కెడు నీళ్లు ఇచ్చి గొంతు తడపండి అంటూ చిల్కానగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్ కాలనీవాసులు వేడుకుంటున్నారు. ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 3లో గత కొన్ని రోజులుగా నీళ్లు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన కరుణించే నాధుడే కరువయ్యారని కాలనీవాసులు వాపోతున్నారు. తమ గోడును పట్టించుకుని గుక్కెడు నీళ్లు ఇవ్వాలని మొరపెట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

నవతెలంగాణ-ఉప్పల్

మేడిపల్లి తహసీల్దార్, ఆర్ఐలపై కేసు నమోదు

- ప్రభుత్వ స్థలమంటూ వేధించి.. నష్టపర్చినందుకు..



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్‌లోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన స్థలాన్ని ప్రభుత్వ స్థలమంటూ నిత్యం వేధించి, ఆ స్థలంలో నిర్మించిన కట్టడాలను కూల్చివేసి నష్టపర్చిన వ్యవహారంలో మేడిపల్లి మండల తహసీల్దారు ఆర్ఐతో పాటు, మరో ఇద్దరు వ్యక్తులపై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు పాశం సంతోష్ కుమార్ గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తన ఆవేదనను వెల్లడించారు. అప్పట్లో తన తాత ఏర్పుల రాములు ద్వారా తనకు సంక్రమించిన బోడుప్పల్లోని సర్వే నంబర్ 63బై 36 ప్లాటు నంబర్ -3లో సుమారు మూడు వందల గజాల స్థలంలో అప్పటి గ్రామపంచాయతీ అనుమ తితో చిన్న షెడ్డును నిర్మించుకున్నానని వెల్లడించారు. తన కుటుంబ పోషణ నిమిత్తం సదరు స్థలంలో టీ కొట్టుతో పాటు, స్క్రాప్ దుకాణాన్ని కొన్ని సంవత్సరాలుగా నడుపుతు న్నానని వివరించారు. అయితే గత అక్టోబర్ నెలలో ఇద్దరు వ్యక్తుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి మండల తహసిల్దారు హసీనా, ఆర్ఐ సునీతలు తన స్థలాన్ని ప్రభుత్వ స్థలముంటూ అందులో నిర్మించుకున్న నిర్మాణాలను కూల్చివేశారని వెల్లడించారు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ హైకోర్టును సంప్రదించగా న్యాయస్థానం సదరు స్థలంపై మధ్యంతర ఉత్తర్వులను జారీ చేస్తూ స్టేటస్ కో విధించిందన్నారు. కేసు న్యాయస్థానంలో నడుస్తుండగా మేడిపల్లి తహసిల్దారు, ఆర్ఐలు తన స్థలంలో నిర్మించుకున్న నిర్మాణాలను జేసిబీలతో కూల్చివేసి తనకు తీవ్ర స్థాయిలో నష్టం కల్గించారన్నారు. తనకు అనుకూలంగా న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అధికారులకు చూపించినా ఏమాత్రం లెక్క చేయకుండా తాను నిర్మించుకున్న ఇంటి నిర్మాణాన్ని పలుమార్లు ఏక పక్షంగా కూల్చి వేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రెవిన్యూ అధికారులకు రూ.5 లక్షల మొత్తా న్ని లంచం రూపంలో ఇచ్చినా ఫిర్యాదులు వస్తున్నాయంటూ తనను, తన తండ్రి పాశం మల్లేశ్‌కు మానసికంగా వేధిస్తూ తనకు తీవ్ర స్థాయిలో నష్టం కల్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తాను రూ. 30లక్షలకు పైగా నష్టపో యాయని సంతోష్ కుమార్ వివరించారు. చట్టపరంగా తన స్థలానికి సంబంధించి తన వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నా, తాను ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వక్తిని కావడం వల్లనే మేడిపల్లి తహసీల్దారు, ఆర్ఐల హోదాలలో ఉన్న హసీనా. సునీతలతో పాటు సాయిని అమృతం, బండ నర్సింహులు మానసికంగా వేధిస్తూ తనకు తీరని నష్టాన్ని కలిస్తుండటంతో న్యాయస్థాన్ని ఆశ్రయించానన్నారు. దాంతో న్యాయస్థానం తాను ఫిర్యాదులో పేర్కొన్న మేడిపల్లి తహసీల్దారు హసినా, ఆర్ఐ సునీతలతో పాటు ప్రైవేటు వ్యక్తులు పాయిని అమృతం, బండ నర్సింహలపై కేసును నమోదు చేయాలని మేడిపల్లి పోలీసులను ఆదేశించిం దన్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటితో పాటు, సెక్షన్లు 156(3),సిఆర్పీసి 454, 380,384, 506 ఐపిసి సెక్షన్లు 3(1)(2) ఆఫ్ ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదైందన్నారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని తెలిపారు.

అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-జవహర్ నగర్

అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రైతు సంఘం జెండాలను ఎగురవేసి వాడ వాడలా గ్రూప్ మీటింగులు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లోని గిరి ప్రసాద్ నగర్ లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ రాష్ట్ర సెక్రటరీ పశ్య పద్మ రైతు సంఘం జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమం మేడ్చ ల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నిమ్మల నరసింహులు అధ్యక్షతన జరిగింది. సిహెచ్ దశరథ్ గౌరవ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట్ రెడ్డి, మోతే రాజేశ్వరి జంగయ్య కనకయ్య లక్ష్మణ్ చంద్రయ్య చైతన్య పద్మ లక్ష్మి లత కవిత ఫాతిమా లక్ష్మి స్వప్న తదితరులు పాల్గొన్నారు. పశ్య పద్మ మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ ఏర్పడి 88 సంవత్సరాలు నాడు బ్రిటిష్ పాలకులకు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ప్రము ఖులు రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతులను సమీకరించి సంఘాలను ఏర్పాటు చేశారని తెలిపారు. బ్రిటిష్ పాలకులను తరిమికొట్టి విజయాన్ని సాధించగలిగామని.. నేడు బీజేపీ నేతృత్వంలో కొనసాగుతున్న ఎన్డీఏ పాలకుల రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఖండించడానికి సాగుతున్న రైతు ఉద్యమంలో ఏఐకేఎస్ కీలకమైన పాత్రను నిర్వహిస్తోందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో రైతు వ్యతిరేకి బిజెపి ఆర్ఎస్ఎస్ శక్తులను ఓడించడానికి సమయత్తం కావాలని పశ్య పద్మ కోరారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా ఈద్గా దర్గాలో, మల్లాపూర్ దర్గాలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి తో కలిసి ఉప్పల్ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు బద్రుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన రంజాన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ నెల ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైందన్నారు. వారు నెల రోజులపాటు కఠిన తర ఉపవాసాలు దీక్షలు చేస్తూ అలా హ్‌కు ప్రార్థనలు చేస్తారన్నారు. ముస్లిం సోదరులందరికీ శు భాకాంక్షలు తెలియ జేశారు. బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్ ,రహీమ్, శివ ,కిట్టు తదితరులు పాల్గొన్నారు .

ముస్లిం సోదరులకు కార్పొరేటర్ జెరిపోతుల ప్రభు దాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. గురవారం ముస్లీం సోదరు లను ఆలింగనాలు చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ పండుగ అని, సామరస్యానికి, సహృద్భావానికి, సర్వ మానవ సమాన త్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శేఖర్ గౌడ్, సుబ్బారెడ్డి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.





రంజాన్ పవిత్రమైన పండగ: సునీతా మహేందర్ రెడ్డి

శామీర్ పేట : రంజాన్ ముస్లిం సోదరుల కు పవిత్రమైన పండగ అని కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం హజ్ కమిటీ సభ్యులు ముజీబ్ ఆధ్వర్యంలో శామీర్ పేట మండల కేంద్రంలో ని ఈద్గలో రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సునీతా మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు లతో తదితరులతో కలిసి హాజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ఎంసీ పల్లి మండల వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, శామీర్ పేట మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, మూఢుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింలు యాద వ్, జిల్లా నాయకులు మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.



గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ కు బోరబండ కాంగ్రెస్ నేతలు మహేష్ కాసుల, నరసింహ, అశోక్ కుమార్, దేవేందర్, వీరయ్య, లఖన్, తదితరులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ వైద్య కాలేజీలో దరఖాస్తుల ఆహ్వానం

- మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ స్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా స్థాయి కమిటీ ద్వారా కుత్బుల్లాపూర్‌లోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి టి.రఘునాథ స్వామి తెలిపారు. ట్యూటర్స్ 7, సీనియర్ రెసిడెంట్లు 22 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తును అభ్యర్థులు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులు నింపి అవసరమైన సర్టిఫికెట్ల కాపీలను జతచేసి ఈ నెల 25వ తేదీ నుంచి అందజేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యక్రమంలో ఇంటర్వ్యూ ఉంటుంది అని తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మండువేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడం కోసం దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, గాంధీనగర్ ఠాగూర్స్ హై స్కూల్ ప్రాంగణంలో పాఠశాల ప్రిన్సిపల్ దివంగత బండారు ఉమారాణి జ్ఞాపకార్థం పాఠశాల పూర్వ విద్యార్థులు వారా జీవన్ కుమార్, కిరణ్, మనోజ్, వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్, పాఠశాల చైర్మెన్ కరస్పాండెంట్ బండారు సాయికుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు(దాతలు) ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం పట్ల సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బండారు సాయికుమార్ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా తమ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత హోదాల్లో, ఉద్యోగాల్లో స్థిరపడి సమాజంలో మేము సైతం అంటూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చైతన్య కుమార్, సరళ, భారతి, సుజాత, స్థానిక నాయకులు శివ బండారు, ఎండి. అబ్దుల్ ఖాదర్, జల్దా లక్ష్మీనాథ్, తిమ్మయ్య పాల్గొన్నారు.

భావంలోని అర్థం ప్రపంచానికి వివరించే మేధావులు కవులు

- ప్రముఖ కవి,ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం
- చైతన్య కళానికేతన్ ఆధ్వర్యంలో 'ఉగాది కవి సమ్మేళనం'



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భావంలోని అర్థాన్ని బాహ్య ప్రపంచానికి వివరించే గొప్ప మేధావులు కవులేనని ప్రముఖ కవి, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి జగద్గిరిగుట్ట డివిజన్, మగ్దూం నగర్‌లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో 'చైతన్య కళానికేతన్' వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు శివరాత్రి యాదగిరి, అభినవ కవి, మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామిరెడ్డిల ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర 'ఉగాది కవి సమ్మేళనం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు కవులు డాక్టర్ గంటా మనోహర్ రెడ్డి, నాలేశ్వరం శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి కాంచని చోట కవి తప్పక కనిపిస్తాడని అంత గొప్ప శక్తి యుక్తులు కవులకే ఉంటాయన్నారు. నాటినుండి ఎంతోమంది కవులు తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుతూ వాటి విశిష్టతలను కవితల రూపంలో నేటికీ వర్ణించడం గొప్ప విషయం అన్నారు. గత మూడు దశాబ్దాలుగా ఎంతోమంది కవులను ఒకే వేదికపై రప్పించి వారిలోని కళా నైపుణ్యాన్ని బాహ్య ప్రపంచానికి పరిచయం చేస్తున్న చైతన్య కళానికేతన్ అధ్యక్ష, కార్యదర్శులు శివరాత్రి యాదగిరి, వాకిటి రాంరెడ్డిలను వారు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో పేద కవులు ఉపాధి, ఆదరణ లేక దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం వారికి చేయూత అందించి, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల కవితల ప్రాచుర్యం ప్రమాదపు అంచుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత చైతన్యవంతులై కవితల్లోని కమ్మదనం తెలుసుకోవాలని భావితరాలకు వివరించాలని పునరుద్ఘాటించారు. చైతన్య కళానికేతన్ అధ్యక్షులు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ ఊహ తెలిసిన నాటి నుండి కళా రంగం, విద్యారంగం వైపు మక్కువతో నైపుణ్యం పెంచుకొని కవులకు,కళాకారులకు తన వంతు బాధ్యతగా ఇటువంటి కవి సమ్మేళనాలు,పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా సేవలు విస్తృతం చేస్తానని స్పష్టం చేశారు. ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 50 మంది కవులు వారి కవితా పాటవాలను వినిపించారు. అనంతరం చైతన్య కళానికేతన్ ఆధ్వర్యంలో మెమెంటోలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కవులు వేముల సత్యనారాయణ, డాక్టర్ నందనం సృజనాకర్, మేడ రాజేశ్వరి, సత్యవీణ, సోమయాజులు, చింతా రామకృష్ణ, కనకాచారి, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శివరాత్రి మంగ, ఇన్‌చార్జిగీతతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీకి నాయకులు, కార్యకర్తలే బలం

- మాజీ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, బండి రమేష్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనను లోకల్ కాదనే వాళ్లే అసలు లోకల్ కాదని ప్రతిసారి ఇలాంటి వాళ్లకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని మహేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో స్థానిక కమిటీలు వేయాలని సూచించారు. ఫైవ్ కమిటీలు వేయడం ద్వారా డివిజన్‌లో పార్టీ పట్టు పెరిగి పార్లమెంట్ అభ్యర్థి సునీత గెలుపు సునాయాసం అవుతుందన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా కార్యకర్తలకు ఎప్పటికీ అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తలే పార్టీ కుటుంబ సభ్యులనీ వారితోనే పార్టీ విజయం సాధ్యమన్నారు. త్వరలో పార్టీలోకి భారీ చేరికలు ఉంటాయని హరివర్ధన్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఆర్గనైజేషన్ చాలా ముఖ్యమని దాన్ని నాయకులు, కార్యకర్తలు గుర్తించాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు. కార్యకర్తలను గుర్తించకపోతే నాయకుడే నష్టపోతాడని పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ లక్ష్యంగా ఎలాంటి ఏమరుపాటుకు చోటు లేకుండా కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి కార్యకర్తల బలం ఉందని అయితే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడాల్సిందేనన్నారు. రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా పార్టీ పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు మరియు సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కల్తీపాలు కనిపిస్తే ఖండిస్తాం



- వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు

నవతెలంగాన-సిటీబ్యూరో

వినియోగదారుల హక్కుల సంస్థకు తార్నాక నాగార్జున నగర్ కాలనీలో ఉన్న రైతన్న పాల కేంద్రం బర్రె పాలపై వచ్చిన కంప్లైంట్ మేరకు, ఆ శాంపుల్స్ సేకరించి టెస్టింగ్‌కి ఇవ్వగా ఆ పాలు నాసిరకమని ఫుడ్ సేఫ్టీ లాబరేటరీ అనలిస్ట్ రిపోర్ట్ ఇచ్చారు. సెక్షన్ 3.1 ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 ప్రకారం సబ్ స్టాండర్డ్ అనగా నాసిరకమని నిర్ధారించడం జరిగింది, పాలకేంద్రం యజమాని ప్యూర్ బఫెల్లో మిల్క్ అని అముతూ వినియోగదారులను మోసం చేస్తున్న తీరుని గమనించి గురువారం సంస్థ తరపున సంస్థసికింద్రాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మాచపల్లి సంతోష్ నాయకత్వంలో చుట్టుపక్కల ఉన్న తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్, నాగార్జున కాలనీ అసోసియేషన్‌తో కలిసి వినియోగ దారులను అవగాహన పరిచారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మానవ ఆహారంలో పాలు అత్యంత ముఖ్యమైన అంశం అని, పాలు మనిషి జీవితంలో కీలక మైన పౌష్టికాహారం అని రోజు వాడే పాలతో విటమిన్ 'ఎ' విటమిన్ 'డి' లాంటివి మానవ శరీరానికి దొరుకుతుందని తెలిపారు. పేదవాడి నుంచి గొప్పవాళ్ల దాకా పాలు చిన్న పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు, పాలు రెగ్యులర్ సోర్స్ అని తెలిపారు. పాలతో మజ్జిగ, పెరుగు, వెన్నె, నెయ్యి, స్వీట్స్, లాంటివి ఎన్నో తిను పదార్థాలు తయారవుతాయని, పాలలో కల్తీ జరిగితే చాలా నష్టం జరుగుతుందని తెలిపారు. పాలు కల్తీ ఎక్కడ జరిగినా, నాసిరకమని ఎక్కడ కనబడ్డ వినియోగదారుల హక్కుల సంస్థ దాన్ని తీవ్రంగా ఖండిస్తుందని, వినియోగదారుల ప్రాణాలు కాపాడడానికి వినియోగదారుల హక్కులను కాపాడడానికి అనుక్షణం రోడ్ ఎక్కడానికి సంస్థ ఎప్పుడు అందుబాటులో ఉంటుం దని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడాపర్తి శివకుమార్, వల్లాల రవి, రాష్ట్ర సెక్రటరీలు దుర్గాప్రసాద్, రాజేష్, కృష్ణపర సంఘం, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆకుల కవి లత, గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులు టి.రమేష్, దేవా, బి.సంజయ్, సికింద్రాబాద్ నియోజకవర్గం కమిటీ శంకర్, బాల, అనిల్ కుమార్, ప్రవీణ్, పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే జీవితం ఆదర్శనీయం



- సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బ్రాహ్మణులకు, క్షత్రియులకు పరిమితమైన చదువును అన్ని వర్గాలకు అందించిన మహనీయుడు జ్యోతిబాపూలే అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్, సీపీఐ రాష్ట్ర నాయకులు కే.యేసురత్నంలు అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే 197వ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట శాఖ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 వ శతకంలో చదువు కేవలం బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు పరిమితమై కింది కులాల వారు చదివితే నాలుక కోసివేయ్యడం, చెవిలో సీసం కరిగించి పోయడం లాంటి దూరచరాలు మూఢ నమ్మకాలు ఏలుతున్న కాలంలో ప్రజల బాధలు తొలగాలంటే చదువు ద్వారానే సాధ్యమని తెలిపారు. ముందుగా తన ఇంటి నుంచే ప్రారంభించిన గొప్ప మహనీయుడు అని జ్యోతిబా పూలే వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలో అనేక పాఠశాలలను నెలకొల్పి చదువును అన్ని వర్గాల ప్రజలకు చేర్చి చైతన్యాన్ని నింపిన జ్యోతిబా పూలే ఆశయసాధన ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అందరికి చదువు నేర్పుతున్నారని తట్టుకోలేని బ్రాహ్మణ వర్గం వారిపై భౌతిక దాడులకు దిగిన భయపడకుండా బ్రాహ్మణ వర్గాలకు ఎదురుతిరిగి సత్య షోదక్ సమాజాన్ని ఏర్పాటు చేసి మూఢనమ్మకాలను పారద్రోలాడానికి పనిచేశారని అన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ కూడా జ్యోతిబా పూలే ను తన గురువుగా చెప్పుకున్న మహానుభావుడు పూలే అని అన్నారు. ఆనాడు వారు కలలుకన్న సమసమాజాన్ని నేడు బీజేపీ మళ్ళీ ధర్మం పేరిట ప్రజలను విడదీస్తున్నారని ప్రజలు నిజాన్ని తెలుసుకొని రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఏఐటీయూసీ అధ్యక్షులు వి.హరినాథ్, మున్సిపల్ అధ్యక్షులు రాములు, శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, జ్యోతి విలేకరి వెంకట్, సీపీఐ నాయకులు, రాజు, జానకిరామ్ పాల్గొన్నారు.

భవగీత్ క్రాఫ్టోఫియా, 'లీలా'స్ ఎస్తేటిక్స్ షాప్ ప్రారంభం



- ప్రారంభించిన కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని కెవియర్ వ్యాలీలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన భవగీత్ క్రాఫ్టోఫియా, లీలా'స్ ఎస్తేటిక్స్ స్పోర్ట్స్ స్టేషనరీ, టాయ్స్ షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ప్రజల నుంచి మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, అర్కాల అనంత స్వామి ముదిరాజ్, మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ షామీర్పేట్ రంగయ్య, మాజీ ఉపసర్పంచ్ రాఘవేందర్, నాయకులు తిరుమలేష్, శ్రీశైలం యాదవ్, మోర హరీష్, నిర్వాహకులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొండా గెలుపే మనకు అండ



- సురభి రవీందర్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా, శేర్లింగంపల్లి అసెంబ్లీలోని వివేకానంద నగర్ డివిజన్‌లో అసెంబ్లీ సీనియర్ నాయకులతో కలిసి, ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, మహిళా మోర్చ నాయకురాలు చెన్నమనేని ప్రవంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపొందాలని పేర్కొన్నారు. ఆయన గెలుపే మనకు అండ అని, ఆయన గెలుపుతోనె అభివృద్ధి సాధ్యమవుతుందని, తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుపొందుతుందని ఆయన అన్నారు.



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని, గురువారం వివేకానందనగర్ డివిజన్‌లో శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, సురభి రవీందర్ రావు పాల్గొని ఇంటింటికి కరపత్రాలు పంచారు.

పలు డివిజన్‌లలో రంజాన్ వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని, గుడ్ విల్ హోటల్ చౌరస్తాలో గల ఈద్గాలో, ముస్లిం సోదరులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి తనయుడు ఆర్యన్ రెడ్డి, అల్లుడు రాజేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని, ముస్లిం సోదరులందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లి సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని రాజీవ్ గృహకల్ప 1 లోని గౌస్ ఇంటివద్ద, రాజీవ్ గృహకల్ప ఫేస్ 2లోని ఇస్మాయిల్ ఇంటివద్ద, నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరై రంజాన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు.
నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లో , గురువారం రంజాన్ పండగ సందర్భంగా దర్గాలోని వేడుకల్లో స్థానిక కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, ఆర్కెల అనంత స్వామితో కలిసి పాల్గొన్న బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
నవతెలంగాణ-దుండిగల్



ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నా... ఎమ్మెల్యే కేపీ. వివేకనంద్
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



బాచుపల్లిలోని జితే ఫిర్ దర్గాలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శంభీపూర్ కృష్ణ.. నవతెలంగాణ-దుండిగల్



రంగారెడ్డి నగర్‌లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్నా సంఘ సేవకుడు ఎండి.మహమ్మద్ గౌసుద్దీన్, ఆయన కుటుంబ సభ్యులు...
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి....
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ఈద్గా వద్ద ముస్లింలతో కలిసి, ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ. వివేకనంద్ కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్...
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మహాత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పాల్గొని, పూలేకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే సేవలను కొనియాడారు. 130 సుభాష్ నగర్ డివిజన్, సూరారం కాలనీలోని తెలుగు తల్లి నగర్‌లో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. చదువులతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన మహాత్ముడు అని చెప్పుకొచ్చారు. సమాజంలో కులవ్యవస్థ నిర్మూలన, స్త్రీ, పురుషులకు సమాన హక్కుల కోసం ఎంతగానో పోరాడిన సామాజిక యోధుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు, నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయినపల్లి 119 డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు జయంతి వేడుకలను ఓల్డ్ బోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.
నవతెలంగాణ-బాలానగర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గండి మైసమ్మ చౌరస్తా వద్ద గల బొంగు నూరి ప్రతాప్ రెడ్డి ఆఫీస్ వద్ద మహనీయులు మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
నవతెలంగాణ-దుండిగల్



మహాత్మ జ్యోతి రావు పూలె 197వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి పలువురు కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు.
నవతెలంగాణ-బాలానగర్



వివేకానంద నగర్ డివిజన్‌లోని రిక్షాపుల్లర్స్ కాలనీ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి, జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి

మెదక్ నియోజకవర్గం ఏడుపాయల శ్రీ వన దుర్గా భవాని అమ్మవారిని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అర్కల అనంత స్వామి ముదిరాజ్, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, భారత్ కుమార్, సీనియర్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ శామిర్పేట రంగయ్య, 24 వార్డు ప్రెసిడెంట్ రమేష్, , నాయకులు తిరుమలేశ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | ఏప్రిల్ 12, 2024 | www.navatelangana.com

ముస్లిం సోదరులకు నివేదిత శుభాకాంక్షలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల అభ్యర్థి నివేదిత ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు గురువారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బలం రాయి కార్ఖానా తదితర ప్రాంతాల్లోని మసీదులకు, ఈద్గా, దర్గాల వద్దకు వెళ్లి ముస్లిం సోదరులను పర్వదిన శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి బాటలు వేసిన ఫూలే



నవతెలంగాణ-బంజారాహిల్స్

బీసీల అభివృద్ధికి మాటలు వేసిన నికార్సైన బీసీ బాంధవుడు కుల వివక్షకు గురవుతున్న బీసీలకు విద్య బుద్ధులు నేర్పిన వారికి విద్యాలయాలు ఏర్పాటు చేసి విద్యుత్ అనే సుసాధ్యమని నిరూపించిన జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి రాజ్యసభ సభ్యులు బీసీసంఘాల జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య , అనిల్ కుమార్ యాదవ్ నివాళులర్పించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ... బీసీ కులాలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్న రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలంటే ఫూలే బాటలో ప్రతి ఒక్క బీసీ కొనసాగే అవసరం ఎంతైనా ఉందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రజలందరూ, బీసీ నాయకులను ఐక్యమత్యం చేసి ఉద్యమానికి మారుపేరుగా ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవాలు సైతం ఫూలే ఆశయాన్ని కొనసాగించడానికి ఎంతో ఉపయోగపడిందని అందరి ఐక్యత విద్య సమానత్వం తోనే దేశ అభివృద్ధి కొనసాగుతుందని వారు తెలిపారు.

'చంపేందుకు వచ్చినవాడికి చదువు చెప్పిన ఫూలే'



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

చంపడానికి వచ్చిన ఇద్దరి మనసును కూడా మార్చిన వ్యక్తి జ్యోతిరావు ఫూలే అని సీఐటీయూ నాయకులు అన్నారు. రహమత్ నగర్ డివిజన్ ఎస్పిఆర్ హిల్స్ రెండు బొమ్మల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఫూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు స్వామి ,అశోక్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అంటరాని వారిని దూరంగా ఉంచేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఫూలే ఆశయాలు కొనసాగించాలంటే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. రహమత్ నగర్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, కార్యదర్శి దేవదాసు, మోతి నగర్ యూనియన్ కార్యదర్శి బాలు, ప్రసాద్, కే సుధాకర్, టి భాగ్యరాజు, బాలయ్య ,నగేష్, ఏసు, రాజు సంగమేష్ ,బాలు ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోరబండ డివిజన్‌లో ఫూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్ బాబా సైలని నగర్‌లోని స్టార్ ఆఫీస్ వద్ద ఫూలే జయంతి వేడుకలు సీఐటీయూ ఆటో ఆక్సిలరీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు టి.సాయి శేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ లింగ భేదాలు ఉండకూడదని స్వతహాగా ఒక అభ్యుదయ సంఘం పెట్టి అందరినీ చైతన్య పరిచిన వ్యక్తి జ్యోతిరావు ఫూలే అని అన్నారు. ఆక్సిలరీ శాఖ సెక్రెటరీ దిలీప్ కుమార్, స్వామి దాసు ,దేవదాసు ,సికిందర్, ప్రకాష్ ,సోమలా నాయక్ ,రవి, దత్తు ,అనిత ,సునీత ,సుభాష్, నస్రీన్, శంషు, ఇక్ర, జాన్ ,లక్ష్మణ్, గ్లోరీ ,తదితరులు పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



నవతెలంగాణ-ఆల్వాల్

ఎస్.కె అఫ్సర్ గృహంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, రాజ్ జితేంద్రనాథ్, అశోక్ రెడ్డి, బొబ్బిలి సురేందర్ రెడ్డి,లక్ష్మి కాంత్ రెడ్డి, కృష్ణ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ వెంకటేష్ పాల్గొన్నారు ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

జ్యోతిరావుఫూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాత్మ జ్యోతిబా ఫూలే 198వ జయంతి వేడుకలు గురువారం జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా జరి గాయి. ఈ సందర్భంగా పలువురు అధికారులు మహాత్మా జ్యోతి బా ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సామాజిక అసమానతలు దురాచారాలను రూపుమాపేందుకు, అవిశ్రాంతిగా కృషి చేసిన మహనీయుడని, ప్రత్యే కించి బాలికల విద్య కోసం పాఠశాలలను నెలకొల్పి ప్రత్యేక కృషి కొనసాగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శ్రీ వాస్తవ, (ఎస్టేట్స్) అడ్మిన్ నళిని పద్మావతి, యాదగిరిరావు, (స్పోర్ట్స్), ఎంట మాలాజి చీఫ్ డాక్టర్ రాంబాబు, ఓఎస్‌డి. వేణుగోపాల్, సూపరెంటెండెంట్ సురేష్, లేబర్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి ఫూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఫూలే ఆశయ సాధన దిశగా సంక్షేమ కార్యక్రమాలు

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ లోని లాలాపేట్ ఇసుక బావి వద్ద ఫూలే విగ్రహానికి, టీటీయూసీ కార్మిక విభాగ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రేమ్ లాల్, రామ్ లాల్, మహేష్, ప్రవీణ్ లాల్, కిషోర్ యాదవ్, రవి, హరినాథ్, శ్రీను పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు పనిచేయండి..



- ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పిలుపు

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపే కార్యకర్తలు లక్ష్యంగా పెట్టుకోవాలని బీఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో కంటోన్మెంటట్ బీఆర్ఎస్ నాయకుల విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక అభ్యర్థి నివేదితను, అలాగే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి అందరూ మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే కార్యకర్తల భేద భావాలు పక్కకు పెట్టేయాలని, అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. నివేదిత, లక్ష్మారెడ్డిలతోపాటు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్, లోక నాథన్, శ్యామ్ కుమార్, నళిని కిరణ్, అనిత ప్రభాకర్, సీనియర్ నాయకులు టి ఎన్.శ్రీనివాస్ , ఆకుల రూప, పెద్దల నరసింహ, పనస శ్రీకాంత్, శివ, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో ఈటల

నవతెలంగాణ-హాయత్ నగర్

ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా హాయత్ నగర్ లో ఉన్న హాయత్ బక్షి మసీదు లో ముస్లిం మత పెద్దలతో కలిసి మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈట ల రాజేందర్ అలయ్ బలయ్ చేసుకున్నారు. ఆయన వెంట హాయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి,కళ్లెం రవీందర్ రెడ్డి,బీఆరెస్ హాయత్ నగర్ యూత్ అధ్యక్షుడు డ్యాగల రాకేష్ కుమార్,రఫిక్ లు పాల్గొన్నారు.

ఫూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బంజారా హిల్స్

తెలంగాణ ప్రభుత్వం ఫూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కో కన్వీనర్ బోళ్ల శివశంకర్ డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఫ్రంట్ ఆధ్వర్యంలో ఫూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన శివశంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ తన గురువుగా భావించిన ఫూలే విగ్రహాన్ని 130 అడుగులతో నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫూలే ఫ్రంట్ విద్యార్థి విభాగం కన్వీనర్ ఎల్బల దత్తాత్రేయ, నాయకులు ఆలకుంట హరి, సత్యవతి, గీత, లింగం , గుర్రం శ్రావణ్ , జాగతి నాయకుడు నర్సన్న, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫూలే స్ఫూర్తితో బహుజనులు రాజ్యాధికారాన్ని సాధించుకోవాలి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఫూలే జయంతిని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో ఏదో ఒక జిల్లాకు మహాత్మ జ్యోతిబా ఫూలే జిల్లాగా నామకరణం చేయాలని, తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. టీఎంఎస్ఎఫ్ ఓయూ ప్రెసిడెంట్ శ్రీకాంత్, బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు మేడి పవన్,రీసెర్చ్ స్కాలర్స్ పెరుమల్ల ఏడుకొండలు, రంగు సుధాకర్ గౌడ్ ,బద్రి, పుట్ట పవన్, సంతోష్, కిరణ్, గణేష్, జయంత్, మహేష్, రాజశేఖర్, వెంకటేష్, నవీన్,ప్రవీణ్ ,కిషోర్, శివ, రామకష్ణ పాల్గొన్నారు.

ఫూలే నిరంతరం గుర్తుండిపోతారు

ఓయూ వీసీ ప్రొ.డి. రవీందర్



- నవతెలంగాణ-ఓయూ

ఫూలే చేసిన సేవలకు నిరంతరం గుర్తుండిపోతారని ఓయూ వీసీ ప్రో.డి. రవీందర్ అన్నారు. ఓయూలోని ఫూలే-అంబేద్కర్ సెంటర్ ఫర్ ఇంక్లూసివ్ అండ్ ఎంపవర్మెంట్ స్టడీస్‌లో బీసీ సెల్ అండ్ మహాత్మా జ్యోతిబా ఫూలే రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్.చలమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సీ/ఎస్టీ సెల్, మైనారిటీల సెల్, డా. బి.ఆర్. అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, మహ లకా బాయి చందా సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఫూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓయూ వీసీ ప్రొ. డి రవీందర్ హాజరై మాట్లాడుతూ. శూద్రులను, ఇతర నిమ్న కులాల ప్రజలను ఐక్యం చేయడానికి, ఉద్ధరించడానికి, కుల వ్యవస్థ కారణంగా ఏర్పడిన సామాజిక ఆర్థిక అసమానతలను తిప్పికొట్టడానికి సత్యశోధక్ సమాజ్ ("సత్య శోధనల సంఘం") అనే సంస్కరణ సమాజాన్ని స్థాపించారు ఫూలే అన్నారు. డాక్టర్.చలమల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫూలే కేవలం శూద్ర వర్ణాల్లో అణిచివేతకు గురౌతున్న కులాల ప్రజల పక్షాన పోరాడటమే కాకుండా, అగ్రవర్ణ వితంతువుల పునర్వివాహానికి గొప్ప కృషి చేశారన్నారు. 1873లో 'గులాంగిరి', 'సేద్యగాని చర్మకోల' అనే గ్రంథాల్ని రచించారని తెలిపారు. 'దీనబంధు' అనే పత్రికను స్థాపించి పురోహితులు చేసే దోపిడీలపై ప్రచారం చేశారన్నారు. ఎస్సీ / ఎస్టీ సెల్ అండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, డైరెక్టర్ ప్రొ" బి.మంగు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. అర్జున్ రావు, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాములు, నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. భీమా,మహాత్మా జ్యోతిబా ఫూలే రీసెర్చ్ అడ్వైసర్ ప్రొ". సిహెచ్.శ్రీనివాస్, పొలిటికల్ సైన్స్ హెడ్ ప్రొ. ఆర్ చంద్రు నాయక్ ఎక్సమ్ చీఫ్ కంట్రోలర్ ప్రొఫెసర్. రాములు ప్రొ".రాజేందర్, డాక్టర్ నాచగొని నర్సింహులు,డాక్టర్ బి అశోక్ తదితరులు పాల్గొని ఫూలే చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు.

బోరబండ వీకర్ సెక్షన్‌లో ఫూలే జయంతి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ బోరబండ డివిజన్ వీకర్ సెక్షన్ లో జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిం చారు. డివిజన్ నాయకులు విజయకుమార్, ఏడి. మధు, బాబు రావు, యూసఫ్, దేవమని, రహమత్ బాబా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్













నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ రెహమత్ నగర్ డివిజన్ మాజీ డివిజన్ అధ్యక్షులు బషీర్ నివాసంలో రంజాన్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నజీర్, చోటు, ఫయాజ్, కుమార్, దనుజ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరబండ డివిజన్‌లో ముస్లిం సోదరులతో

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ గురువారం బోరబండ డివిజన్ మొయిజ్ నివాసంలో రంజాన్ విందులో పాల్గొన్నారు. విజయకుమార్, సర్దార్, ఇర్ఫాన్, బాబు రావు, యూసఫ్ భాయ్, బాబా నాయక్, దేవమని, రమేష్, రెహ్మత్ తదితరులు పాల్గొన్నారు .

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ గురువారం కంటోన్మెంట్ పరిధిలోని ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. న్యూ బోయినపల్లి చౌరస్తాలో పలువురు ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు రిజ్వాన్, ఇమ్రాన్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గణేష్ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నాయకులూ మొహమ్మెద్ సిరాజ్, షకీబ్ హుస్సేన్, చోటు మౌలా, నజీర్, అజామ్, జావేద్, ఇంతియాజ్, బషీర్, ఇస్థాయాద్, మిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మైనార్టీ నాయకులు సోయల్ గురువారం ఇచ్చిన రంజాన్ విందులో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీరామ్‌నగర్ సీనియర్ నాయకుడు లియాకత్ అలీ పాల్గొన్నారు.

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, స్థానిక ముస్లిం నాయకులు గురువారం శ్రీరామ్‌నగర్ డివిజన్ మాజీ ప్రెసిడెంట్ లియాకత్ అలీ ఇంటికి వచ్చి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు.

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

సీనియర్ నాయకుడు లియాకత్ అలీ ఇంటికి రంజాన్ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి వచ్చి రంజాన్ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

బాబా ఫసియుద్దీన్‌కు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసి ఉద్దీన్‌ను బోరబండ కాంగ్రెస్ నేతలు మహేష్ కాసుల, నరసింహ, అశోక్ కుమార్, దేవేందర్, వీరయ్య, లఖన్ తదితరులు కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లు కూలిపోయిన బాధితులను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) కార్వాన్ డివిజన్ కార్యదర్శి కళ్యాణ్





నవతెలంగాణ-ధూల్ పేట్

ఇల్లు కూలిపోయి గాయాలైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలనీ సీపీఐ(ఎం) కార్వాన్ డివిజన్ కార్యదర్శి కళ్యాణ్ డిమాండ్ చేశారు. పైకప్పు కూలి పోతుందని అధికారులకు రాజకీయ నాయకులకు అనేక మార్లు వేడుకున్న స్పందించ లేదనీ బాధితులు వాపోతున్నారన్నారు. కార్వాన్ డివిజన్ అల్లూరి సీతారామరాజు నగర్ బస్తీలో ఒక ఇల్లు పైకప్పు కూలి ఇంట్లో ఉన్న వాళ్లకి ఆరు మందికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక సీపీఐ(ఎం) నాయ కులతో కలిసి ఆయన సంఘటన స్థలానికి చేరుకుని కులిన ఇల్లును దర్శించి, గాయాలైన కుటుంబ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కూలిన ఇంటిలో చిన్న పిల్లలు, పెద్దలు ఉన్నారనీ, వారికి ప్రాణా పాయం తప్పిందన్నారు. గతంలో కూడా చానా ఇల్లు కూలిపోవడం జరిగిం దన్నారు. అధికారులకు చెప్పిన వాళ్లు స్పందించక పోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా ప్రాణ నష్టం జరిగితే గానీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పం దించడం దారుణమన్నారు. 1998లో నిర్మించిన ఇల్లు ఉన్నాయనీ, ఇప్పటివరకు చాలా ఇల్లు ఇలాగే కూలిపోతున్నాయనీ ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి ఆ ఇల్లు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గాయాలైన ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, నష్ట పరిహారం చెల్లించాలనీ కోరారు. ప్రమాదకరంగా ఉన్న అనేక ఇండ్లను పరిశీలించి అధికారులు కూల్చివేసి ఈ ప్రమాదాల నుండి తప్పించాలన్నారు. ఇదేవిధంగా ఉంటే చాలా మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం కూడా ఉందని, అధికారులు వెంటనే స్పందించి వారందరిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

జ్యోతిరావు ఫూలే సేవలు చిరస్మరణీయం





నవతెలంగాణ-బంజారా హిల్స్

బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఖైరతాబాద్ వారి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లైబ్రరీ సర్కిల్ బడా గణేష్ వద్ద ఫూలే జయంతి కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ పి విజయ రెడ్డి హాజరై ఫూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంతకుముందు ఆమె... రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీని, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్,రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిల శ్రీధర్ బాబు, మధు యాష్కి గౌడ్‌తో కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్ యాదవ్‌తో పాటు బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బోధనేతర ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో

నవతెలంగాణ-ఓయూ

ఓయూ మూడు బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో గురువారం నాన్ టీచింగ్ హోమ్‌లో ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు బియ్యాన్ని జ్ఞానేశ్వర్ , నాగరాజ రావు, శివ శంకర్ ,విజయ్ కుమార్, శంకరయ్య, రాకేష్ ,భాస్కర్, భిక్షపతి, గోపాల్, రమేష్ ,పాల్గొన్నారు.



టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సర్పారెడ్డి రెడ్డి భూపతి రెడ్డి గురువారం రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలను గోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఆవుల జగన్ యాదవ్, వెంకయ్య చౌదరి, ఆవుల జగదీష్ యాదవ్, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్‌లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల వ్యాప్తంగా గురువారం రంజాన్ పండుగ సందర్భంగా మసీదులు,ఈద్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరిని ఒకరు మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకున్నట్లు పలువురు ముస్లిం నాయకులు తెలియజేశారు. మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో మండల కో ఆప్షన్ సభ్యురాలు షేక్ రుక్సానా యూనిస్ పాషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ వేడుకలు జరుపుకున్నారు.మేడ్చల్ పట్టణంలోని 8వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ చాపరాజు పలువురు ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో యూనిస్ పాషా, అనిఫ్, చాంద్ పాషా, రఫీక్, మొలిసాబ్, అలిమియా,ముక్తార్ పాషా, అమీరుద్దీన్ పాల్గొన్నారు.

ఎంఐఎంతో దోస్తీకోసమేనా..!





- కాంగ్రెస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి ఖరారు చేయకపోవడానికి కారణమదే..
- ఇక్కడ ఎంఐఎంకు సహకారం.. మిగతాచోట్ల కాంగ్రెస్‌కు..
- ప్రచారంలో బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ అభ్యర్థులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చి రోజుల గడుస్తున్న.. కాంగ్రెస్ పార్టీ మాత్రం హైదరాబాద్ స్థానానికి తమ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. ఇప్పటికే ఎంఐఎం, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించగా.. వారు ప్రచారాన్ని సైతం ప్రారంభించారు. కానీ అధికార పార్టీ అయి ఉండి కాంగ్రెస్ మాత్రం తమ అభ్యర్థిని ప్రకటించకపోవడంపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఇప్పటికే సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్ల స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్.. ఎంఐఎంతో దోస్తీ కోసమే హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టిందని వినికిడి. ఇటీవల కాలంలో ఇరుపార్టీలు నేతలు కూడా పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం కూడా ఇవే సూచిస్తున్నాయి. అంతేగాక హైదరాబాద్ ఎంపీ స్థానంలో ఎంఐఎంకు సహకరించి.. గ్రేటర్‌తో పాటు రాష్ట్రంలోని మిగతా చోట్ల తమ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు ఎంఐఎం సహాయాన్ని తీసుకునే యోచనలో కాంగ్రెస్ ఉంది. అందుకనే నేటికి ఇక్కడ అభ్యర్థిని ప్రకటించడంలేదు. ఒకవేళ అభ్యర్థిని ప్రకటించిన నామమాత్రపు పోటీకోసమేనని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గ్రేటర్‌లోని హైదరాబాద్ పార్లమెంట్ స్థానం ఎంఐఎంకు కంచుకోట. కొన్నేండ్లుగా ఇక్కడ నుంచి ఆ పార్టీకి సంబంధించిన ఎంపీ అభ్యర్థులే గెలుస్తున్నారు. అందుకు ప్రధాన కారణం.. ఈ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఐఎం ఎమ్మెల్యేలు ఉండడమే. దాంతో పాటు ఆ స్థానాల్లో వారు వరుసగా గెలుస్తుండటంతో హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఆపార్టీ సునాయసంగా గెలుస్తూ.. వస్తోంది. దీంతో ఇతర పార్టీల అభ్యర్థులు అక్కడ పోటీచేసేందుకు అంతగా ఆసక్తి చూపారు. అయితే ఈసారి బీజేపీ ఎంఐఎంతో గట్టిగా ఢీకొనేందుకు సిద్ధమైంది. ఆ పార్టీ అభ్యర్థిగా మాధవిలతను ముందుగానే ప్రకటించగా.. ఆమె ప్రచారం సైతం ప్రారంభించారు. అదే సమయంలో బీఆర్ఎస్ కూడా తమ అభ్యర్థిగా శ్రీనివాస్ యాదవ్‌ను పోటీలో నిలిపింది. కానీ కాంగ్రెస్ మాత్రం తమ అభ్యర్థిని నేటికి ప్రకటించలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పలువురు ఆశావహులు పోటీ చేసేందుకు సై అంటున్న.. ఎంఐఎంతో దోస్తీ కోసమని నై అంటుంది.

ప్రచారంలో మూడు పార్టీ అభ్యర్థులే..

ఎంఐఎం అభ్యర్థిగా మరోసారి ప్రస్తుత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పోటీ చేస్తున్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో ఆయన పూర్తిస్థాయిలో ప్రచారంలో పాల్గొనడంలేదు. అయితే వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు తమ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో చర్చిస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు దీటుగా రంజాన్ తర్వాత హైదరాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా తమ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం కూడా చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి శ్రీనివాస్ యాదవ్ కూడా ప్రచారం ప్రారంభించారు. ఆయా నియోజకవర్గ పరిధిలోని ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇక బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాధవీలత సైతం ప్రచారంలో ముందుకు వెళ్తోన్నారు. ప్రధానంగా ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలను టార్గెట్ చేస్తూ నిత్యం ఓటర్లను ఆమె కలుస్తున్నారు. ఎంఐఎం కంచుకోటగా ఉన్న హైదరాబాద్ పార్లమెంట్ స్థానంపై ఈసారి ఖచ్చితంగా బీజేపీ జెండా ఎగురవేస్తామనే ధీమాతో మాధవిలత ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ నుంచి అలీ మస్కతి, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలివుల్లా, ఫెరోజ్ ఖాన్ పేర్లు ఏఐసీసీ పరిశీలన ఉండగా.. మరోవైపు మాజీ క్రికెటర్ అజారుద్దీన్, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా పేర్లు కూడా తెరపైకి వచ్చాయి. వీరిలో పలువురు పోటీకి ఉత్సహం చూపిస్తున్నా పార్టీ పెద్దలు మాత్రం ఇక్కడ పోటీ గురించి పెద్దగా సీరియస్ తీసుకోవడంలేదు. ఎంఐఎంకు హైదరాబాద్ వదిలేసి.. మిగతా చోట్ల ఆ పార్టీ మద్దతుతో మైనార్టీ ఓట్లు గంపగుత్తగా రాబట్టుకొని.. తద్వారా మెజార్టీ స్థానాలను కైవలం చేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది.

మెట్రోను సందర్శించిన మంగోలియా ప్రతినిధులు



- ప్రాజెక్టు వివరాలను వివరించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు కార్యాలయాన్ని మంగోలియా ప్రభుత్వ ప్రతినిధులు సందర్శించారు. మంగోలియా రాజధాని ఉలాన్ బాటోర్‌లో మెట్రో రైలు నిర్మించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగోలియా మంత్రి పురెవ్ సురెన్ నాయకత్వంలో వివిధ విభాగాలకు చెందిన 20మంది సీనియర్ అధికారుల బృందం గురువారం మెట్రో రైలు సందర్శన.. అనంతరం బేగంపేటలోని మెట్రో రైల్ భవన్‌లో మెట్రో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మెట్రో రైలు సౌకర్యాలు, అత్యాధునిక సాంకేతిక ప్రాజెక్టు అమలు చేయడంలో ఎదురైన సున్నితమైన సమస్యలు, పరిష్కారాలు, ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మంగోలియా ప్రతినిధులకు వివరించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో అతి పెద్ద ప్రాజెక్టును ఎలా అమలు చేయాలనే అంశంపై మెట్రో రైలు ఎండీ అందించిన వివరాలు తమకు ఎంతో అమూల్యంగా భావిస్తున్నట్టు మంగోలియా ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సెషన్‌లో ఎస్‌సీఐ ప్రొఫెసర్ సుబోధ్ కందముతన్, ఏ.శ్రీదేవి. హెచ్ఎంఆర్ఎల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వాస్తవ జీవిత ప్రతీకలు మార్పు మంచిదే కథలు



నవతెలంగాణ-కల్చరల్

ప్రతీ వ్యక్తికీ నేపథ్యంలో ఒక కథ ఉంటుందనీ వాటిని అక్షరబద్ధం చేసే సామర్థ్యం వున్న వారు కథా రూపంలో తెస్తారని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కె.సీతారామారావు అన్నారు. మార్పు మంచిదే కథాసంపుటిలోని ప్రతీ కథ వాస్తవ జీవితాలకు ప్రతీకలు అని అయన పేర్కొన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పీ.వీ.సాహిత్య పీఠం కరీంనగర్ నిర్వహణలో డాక్టర్ కె పద్మలత రచించిన మార్పు మంచిదే కథా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా సీతా రామా రావు పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. పద్మ లత కథ చెప్పటం లో నేర్పు ఆసాంతం ఆసక్తి రేకెత్తిస్తుందనీ వివరించారు. ప్రముఖ కథా రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య మాట్లాడుతూ వాడుక భాషలో సులువైన పదాలతో పద్మలత కథలు అల్లారని పేర్కొన్నారు. కవయిత్రి నెల్లుట్ల రామా దేవి సంపుటిలోని కథలను సమీక్ష చేస్తూ ప్రతీ కథలో మనకు నిత్య జీవతంలో తారస పడే వ్యక్తులే కనిపిస్తారని తెలిపారు. అధ్యక్షత వహించిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వీ.సంతోష్ బాబు తమ సంస్థ లక్ష్యాలు వివరించారు. చివరగా రచయిత్రి పద్మలత కతజ్ఞతా ప్రసంగంలో తనను రచనకు ప్రేరేపించిన అంశాలు తెలిపారు. వేదిక పై విశ్లేషకుడు బీ.వీ.ఎస్.స్వామి, సినీ టీ.వీ.రచయిత కంచెనపల్లి రాజేంద్ర రాజు తదితరులు పద్మలతను అభినందించారు.

14న ఎన్ఎస్ఎస్, ఎన్ఎన్ఎస్ వసంతోత్సవం



నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 14 న ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థలు నవ్య సాహిత్య సమితి(ఎన్.ఎస్.ఎస్) నవ్య నాటక సమితి(ఎన్.ఎన్.ఎస్) సంయుక్తంగా శ్రీ కష్ణ భాషా నిలయం లోని వేదిక పై వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయ కుమార్ సమన్వయ కర్త సుధామాల తెలిపారు. సంస్థ కార్యాలయంలో రాష్ట్ర పే అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర వేడుకలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. నూతన ఉగాది పురస్కరించు కొని నాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె.వీ.రమణ పాల్గొన్నారు. సాహిత్య రంగంలో మాది రాజు బ్రహ్మానంద రావు, పత్రికా రంగంలో అక్కిరాజు జనార్ధన్ రావు, నత్య రంగంలో డాక్టర్ కళా కృష్ణ, సంగీత రంగంలో రాధా సారంగపాణి, విద్యా రంగంలో సాగర్ రావులను సత్కరిస్తారనీ కవి డాక్టర్ ఫణీంద్ర అధ్యక్షత వహిస్తారనీ తెలిపారు. ఉగాది కవి సమ్మేళనం ప్రత్యేక ఆకర్షణ అన్నారు. గోడ పత్రిక విడుదల కార్యక్రమంలో విజయ కుమార్ గోదా లక్ష్మి సుధా మాల, కావ్య చంద్రిక మేఖల పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 12, 2024 | www.navatelangana.com



రంజాన్ ప్రార్థనల సందర్భంగా గురువారం మీరాలం ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ హైదరాబాద్ సిటీ పోలీస్ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ వి.సత్యనారాయణ, డీసీపీ శ్రీ సాయి చైతన్యతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



రంజాన్ పర్వదినం సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్)ను ఆ సంఘం జిల్లా కార్యదర్శి విక్రమ్, అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరిబాబు, ఈసీ శంకర్, శ్రీధర్‌తో పాటు వారి కార్యవర్గం గురువారం కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబోకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ సెక్రటరీ శివ కుమార్, ఉపాధ్యక్షులు శేఖర్, స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ సభ్యులు ప్రియాదేవ్ ఠాకూర్, సుదర్శన్, శ్రీనివాస్ బాబు, మొహమ్మద్, అక్రమ్ పాల్గొన్నారు. -నవతెలంగాణ-సిటీబ్యూరో

నాటి కంపవాతమే నేటి పార్కిన్సన్స్

- మన దేశంలో 70 లక్షల మంది బాధితులు
- మహిళల కంటే పురుషులకే ఎక్కువ
- వాయు కాలుష్యం, ఊబకాయం వల్ల కూడా వచ్చే అవకాశం
- డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్సతో పరిష్కారం
- పార్కిన్సన్స్ డిసీజ్‌పై కిమ్స్ ఆస్పత్రిలో అవగాహన సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

చేతులు అదే పనిగా వణికిపోతూ ఉంటాయి. నీళ్ల గ్లాసు గానీ, కాఫీ కప్పు గానీ సరిగా పట్టుకోలేరు. అన్నం తినడం కూడా కష్టమే అవుతుంది. మాట సరిగా రాదు. అడుగులు పడటం కష్టమవుతుంది. ఇలా మన శరీరం మన అదుపులో ఉండనే ఉండదు. దీన్నే పార్కిన్సన్స్ డిసీజ్ అంటారు. నిజానికి ఎప్పుడో 4,500 ఏండ్ల క్రితం ఆయుర్వేదంలోనే దీని ప్రస్తావన ఉంది. అప్పట్లో దీన్ని కంపవాతం అనేవారు. కంపం అంటే వణుకు, వాతం అంటే కండరాల సమస్య. అప్పట్లో దీనికి వెల్వెట్ బీన్ మొక్కతో చికిత్స చేసేవారు. ఆ మొక్కనుంచే లెవోడోపా అనే మందును ఆ తర్వాత అభివృద్ధి చేశారు. దాన్నే ఇప్పుడు పార్కిన్సన్స్ డిసీజ్ చికిత్సలో ఉపయోగిస్తున్నామని కిమ్స్ ఆస్పత్రికి చెందిన ప్రముఖ పార్కిసన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ జయశ్రీ అన్నారు. అంతర్జాతీయ పార్కిన్సన్స్ డే సందర్భంగా నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, ఆస్పత్రికి చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సీతాజయలక్ష్మి, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి, డా. మోహన్ దాస్, డా. ప్రవీణ్ తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సమస్య గురించి వారు లోతుగా వివరించారు.

ఎవరు కనిపెట్టారు..?

1817లో తొలిసారి తన వ్యాసంలో షేకింగ్ పాల్సీ అనే సమస్య గురించి జేమ్స్ పార్కిన్సన్ రాయడంతో అప్పట్నుంచి దీనిపేరు పార్కిన్సన్స్ డిసీజ్ అని వచ్చింది. న్యూరో సమస్యలలో వైకల్యానికి, మరణాలకు కారణమవుతున్న వాటిలో ఇదొకటి. 40 ఏళ్ల దాటిన వారిలో ప్రతి లక్షమంది ప్రజల్లో 94 మందికి ఇది ఉంటోంది. భారతదేశంలో సుమారు 70 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తాజా పరిశోధనలో తేలింది.

ముప్పు కారకాలు..

ఐదు పదుల వయసు దగ్గరపడే కొద్దీ దీని లక్షణాలు కనిపిస్తుంటాయి. మహిళల కంటే పురుషులకే ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ. ఈ నిష్పత్తి 1:1.4గా ఉంది. త్వరగా మెనోపాజ్ రావడం, ఈస్ట్రోజన్ తగ్గడం వల్ల మహిళల్లో ఈ సమస్య కనిపిస్తోంది. కుటుంబంలో సన్నిహితులకు ఉంటే తర్వాతి తరంలో వారికి వచ్చే ప్రమాదం మూడురెట్లు ఎక్కువ అవుతుంది. పురుగు మందులు, వాయు కాలుష్యం, ముఖ్యంగా నైట్రోజన్ డయాక్సైడ్, అతిసూక్ష్మ ధూళికణాల వల్ల కూడా ఇది వస్తుంది. డెయిరీ ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవడం, కాపర్, మాంగనీస్ లేదా లెడ్ ఎక్కువగా విడుదలయ్యే ప్రాంతాల్లో ఉండటం, వ్యవసాయ పనులు, బావి నీరు తాగడం, ఐరన్, మాంగనీస్ ఎక్కువగా తీసుకోవడం, డి-విటమిన్ తగ్గడం కూడా ముప్పు కారకాలే.

శారీరక కారణాలు..

జీవనశైలి సమస్యలు కూడా పార్కిన్సన్స్ డిసీజ్‌కు కొంత కారణమవుతున్నాయి. ఊబకాయం, టైప్-2 మధుమేహం, మెదడుకు గాయం కావడం, మెలనోమా లేదా ప్రోస్టేట్ కేన్సర్ రావడం లాంటివి ఇందుకు కారణాలు.

గుర్తించడం ఎలా..

ఇందులో ప్రధానంగా మూడు లక్షణాలుంటాయి. అవి.. వణుకు, నడక నెమ్మదించడం, గట్టిగా అయిపోవడం. మొత్తం రోగుల్లో 70-80 శాతం మందికి వణుకు ఉంటుంది. మొదట్లో ఇది ఇతరులు గుర్తించేంతగా ఉండదు గానీ, ఎవరికి వారికే తెలుస్తుంది. వ్యాధి తీవ్రమయ్యే కొద్దీ ఇతరులకూ అది కనిపిస్తుంది. మొదట్లో చేతుల్లో వణుకు మొదలై, క్రమంగా కాళ్ల, పెదవులు, దవడ, నాలుక, అరుదుగా తల కూడా వణుకుతాయి. ముఖంలో భావాలు పలికించలేరు. కళ్ల ఆర్పడం తగ్గుతుంది. మాట సరిగా రాదు. స్పష్టంగా, గట్టిగా మాట్లాడలేరు. సరిగా నమలలేరు. నోట్లోంచి చొంగ కారుతూ ఉంటుంది. చేతిరాత సరిగా రాదు. ఉన్నట్టుండి చేతులు, కాళ్ల కదులుతాయి. శరీరం మొత్తం ఒకవైపు వంగిపోయినట్లు ఉంటుంది. గూని వచ్చినట్లు ఉంటారు. మంచం మీద ఒకవైపు నుంచి మరోవైపు తిరగలేరు. కొంత మతిమరుపు వస్తుంది. ఆందోళన, కుంగుబాటు ఉంటాయి. నిద్రసరిగా పట్టదు.

చికిత్స పద్ధతులు..

చాలా వరకు దీని లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తారు తప్ప వ్యాధికి చికిత్స దాదాపుగా లేదు. లెవోడోపా అనే మందును ఎక్కువగా వాడుతున్నారు. దాంతోపాటు డోపమైన్ అగోనిస్టులు, మోనోమైన్ ఆక్సిడేస్ టైప్ బి లాంటివి కూడా లక్షణాలను బట్టి సూచిస్తారు. అయితే ఇవన్నీ కూడా లక్షణాలను తగ్గించేవే తప్ప వ్యాధిని నయం చేసేవి కావు. డాక్టర్ మానస్ పాణిగ్రాహి మాట్లాడుతూ.. పార్కిన్సన్స్ డిసీజ్ లక్షణాలను బాగా తగ్గించగలిగే చికిత్సలలో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్స ఒకటి ప్రాచుర్యం పొందింది. శరీర కదలికలను సాధారణ స్థితికి తీసుకొచ్చేలా మెదడు లోపలి భాగాలను ప్రేరేపితం చేయడమే ఈ శస్త్రచికిత్స ప్రధాన ఉద్దేశం. రోగి పరిస్థితిని, వయసును బట్టి దీన్ని నిర్ణయిస్తారు. మందుల కంటే దీనివల్ల కొంత ఎక్కువ ఫలితం ఉంటుందని పరిశోధనల్లో తేల్చారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బేగంపేట్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం సనత్ నగర్ లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనల లో ఆయన పాల్గొన్నారు. ఈ ప్రార్థనలలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం మత పెద్దలు, పలువురు ముస్లిం సోదరులను ఎమ్మెల్యే ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ సనత్ నగర్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు ఖలీల్, రాజేష్ ముదిరాజ్, ఫాజిల్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం

- ఎమ్మెల్యే దానం, రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మెన్ మెట్టు సాయికుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే దానం నాగేందర్, రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మెన్ మెట్టు సాయికుమార్ అన్నారు. గంగపుత్ర చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మెన్ ఎన్నికైన మెట్టు సాయికుమార్ కు అభినందన సత్కార సభ గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం నాగేందర్, మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన వెంటనే రాష్ట్రంలో మత్స్య పరిశ్రమపై ఆధారపడిన వారికి తోడ్పాటును అందించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులు, సహకార సంఘాలకు అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గంగపుత్ర మాట్లాడుతూ అటవీ సంపదపై ఆ ప్రాంతంలో ఉండే అన్ని వనరులపై ఏ విధంగానైతే పూర్తి హక్కులు కలిగి ఉంటారో అదే విధంగా సనాతన సంప్రదాయ మత్స్యకారులకు, బెస్త, గూండ్ల గంగపుత్రులకు సంబంధించిన చేపల వేట అమ్మకం కులవృత్తిపై ఇప్పటికే ఉన్న అన్ని సొసైటీలలో పూర్తి హక్కులు కల్పించి ప్రత్యేక చట్టం చేయాలని, మత్స్యశాఖలో ఉద్యోగాలలో 40శాతం వాటా కల్పించాలని, గంగపుత్ర కార్పొరేషన్ కు రూ.2వేల



కోట్లు కేటాయించాలని, గంగపుత్ర ఆత్మగౌరవ భవనం నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు ఉపాధికి సంబంధించి చెరువులలో రెండున్నర ఎకరాలకు సభ్యత్వాలు ఇచ్చే విధంగా కొనసాగుతున్న నూతన సభ్యత్వాలను తలసరి ఆదాయం ప్రాతిపదికన సమగ్రంగా విచారణ జరిపిన తర్వాత మాత్రమే నూతన సభ్యత్వాలు గాని సొసైటీగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ఫిషరీస్ కోపరేటివ్ ఫెడరేషన్ నుంచి కొప్పు పద్మ గంగపుత్ర, కాంగ్రెస్ ఫిషరీస్ విభాగం హైదరాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల చైర్మన్లు సత్యనారాయణ గంగపుత్ర, నర్సయ్య గంగపుత్ర, ప్రవీణ్ గంగపుత్ర, పరమేశ్వర్ గంగపుత్ర, హైదరాబాద్ జేపీసీఎస్ అధ్యక్షులు సుమిత్ర గంగపుత్ర, గంగపుత్ర సంఘం నేతలు రచ్చ ఎల్లయ్య అన్నయ్య గంగపుత్ర, దయానంద్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

ఫూలే అనుసరించిన మార్గంలో ముదిరాజ్ కులస్తులు ముందుకెళ్లాలి

- శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బహుజనుల హక్కుల పోరాట యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అనుసరించిన మార్గంలో ముదిరాజ్ కులస్తులు నడుస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ సూచించారు. పూలే జయంతి సందర్భంగా గురువారం హైదర్‌గూడలోని పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశం గర్వించే గొప్ప మహనీయుల్లో పూలే ఒకరని, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. సమాజ వికాసానికి స్త్రీ విద్య అవసరమని గుర్తించి 1948లో మొట్ట మొదటిసారిగా స్త్రీల కోసం పాఠశాలను ఏర్పాటు చేసి ఆయన సతీమణి సావిత్రిబాయిని మొదటి మహిళా టీచర్‌గా పరిచయం చేశారని గుర్తు చేశారు. పూలే జీవితం బడుగు, బలహీన వర్గాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ అధ్యాయన వేదిక చైర్మెన్, ప్రొఫెసర్ నీలా రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి న్యాయవాదులు డి.ఎల్.పాండు, ఎంసీ చంద్ర శేఖర్, నాయకులు కనకయ్య శ్రీరాములు, సురేష్, శ్రీశైలం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం సాధించడమే ఫూలేకు నిజమైన నివాళి



- ఎంపీ ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీలకు రాజ్యాధికారంతో వాటా సాదించడమే మహాత్మ పూలేకు నిజమైన నివాళి అని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాలు విద్యానగర్ బీసీ భవన్ లో ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై మహాత్మా జ్యోతిభాపుల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ,ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి విద్యా ద్వారానే జరుగుతుందని మహాత్మా పూలే సిద్ధాంతం ప్రకారం బీసీ సంక్షేమ సంఘం పోరాడి రెండు తెలుగు రాష్ట్రాలలో 6వేల హాస్టళ్ళు - 1500 ఎస్సీ,ఎస్టీ,బీసీ గురుకుల పాఠశాలలు పెట్టం ఇందులో 10 లక్షల మందిని విద్యార్థులు 3వ తరగతి నుండి పీజీ వరకు ఉచితంగా చదువుకుంటున్నారన్నారు. ఇప్పటివరకు 12 వేలకు పైగా ఉద్యమాలు, ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, అసెంబ్లీ ముట్టడిలో, సచివాలయం లాంటివి మిలిటెంట్ పోరాటాలు చేసి బీసీల అభివృద్ధికి అనేక స్కీములు పెట్టించామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భరత్, నందగోపాల్, వేముల రామకృష్ణ, రాజ్ కుమార్, నిఖిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పైలా వాసుదేవరావు జీవితం నేటికీ ఆదర్శం



- ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యు) జాతీయ కన్వీనర్ వి.సంధ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

శ్రీకాకుళం గిరిజన రైతాంగ విప్లవ పోరాట యోధుడు కామ్రేడ్ పైలా వాసుదేవరావు జీవితం నేటికీ ఆదర్శమని ప్రగతిశీల మహిళా సంఘం(పి.ఓ.డబ్ల్యు) జాతీయ కన్వీనర్ వి.సంధ్య తెలిపారు. విప్లవ పోరాట యోధుడు సీపీఐ(ఎం-ఎల్) రాష్ట్ర కార్యదర్శి కేంద్ర సీనియర్ నాయకులు కామ్రేడ్ పైలా వాసుదేవరావు14వ వర్ధంతి సందర్భంగా గురువారం విద్యానగర్ లోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యాలయంలో సిపి భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్యక్క, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనురాధ ఘనంగా జోహార్లు అర్పించారు. పైలా తన జీవితాన్ని మొత్తం విప్లవం కోసం,పీడిత ప్రజల విముక్తి కోసం అంకితం చేసిన పైలా వాసుదేవరావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పొడ పంగి నాగరాజు, జిల్లా నాయకులు తీగల శ్యామ్,ప్రగశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి,మల్లిక్, ఆటో యూనియన్ నాయకులు కొండల్, ఉమా,రేణుక తదితరులు పాల్గొన్నారు.

పైప్ పై నుంచి కారు వెళ్లిందని వ్యక్తిపై దాడి

నవతెలంగాణ-నాగోల్

వాటర్ ప్లాంట్ పైప్ పై నుంచి కారు వెళ్లిందని కారు నడుపుతున్న వ్యక్తిపై వాటర్ ప్లాంట్ నిర్వాకులు దాడి చేసి గాయపరిచిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ ఆనంద్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉండే ఢిల్లీ ప్రదీప్ రెడ్డి బుధవారం మధ్యాహ్న సమయంలో తన కారులో నాగోలు నుంచి ఆనంద నగర్‌కు వస్తున్నాడు. బండ్లగూడ వద్ద రోడ్డు మీద చర్లపల్లి అశోక్ గౌడ్ వాటర్ ప్లాంట్ ఉంది. కారులో వస్తున్న ప్రదీప్ రెడ్డి వాటర్ ప్లాంట్ పైపును గమనించకుండా దానిపై ఎక్కించాడు. దాంతో వాటర్ పైప్ పగలిపోవడంతో ఆగ్రహంతో చర్లపల్లి అశోక్ గౌడ్ అతని కుమారులు క్రాంతిగౌడ్, రాముగౌడ్ కలిసి ప్రదీప్ రెడ్డి పై దాడి చేశారు. ముగ్గురు కలిసి దౌర్జన్యంచేసి రక్తగాయాలు వచ్చే విధంగా దాడి చేసి గాయపరిచారు. అనంతరం బాధితుడు నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు.. అశోక్ గౌడ్, క్రాంతిగౌడ్, రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు మీద వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన నిర్వాహకులపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

13న మాతా వైష్ణో దేవి విశాల్ జాగరణ్

మా వైష్ణో దేవి మాతా జాగరణ్ మండల్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

చైత్ర నవరాత్రుల సందర్భంగా ఈనెల 13న గోషామహల్ పోలీస్ గ్రౌండ్ లో 21వ మా వైష్ణో దేవి విశాల్ జాగరణను నిర్వహించనున్నట్లు మా వైష్ణో దేవి మాతా జాగరణ్ మండల్, హైదరాబాద్ కోర్ కమిటీ సభ్యులు అంజనీ కుమార్ అగర్వాల్, రాకేష్ నర్సింగ్ పురియా, సంజయ్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, రామ్ కిషన్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, పురుషోత్తం అగర్వాల్, ముకేశ్ అగర్వాల్, రాకేష్ జలాన్, ప్రవీణ్ నవీందర్, సూర్యకమాల్ గుప్తా, అంజాన్ సరావుగిలు తెలిపారు. గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు జాగరణ్ భూమి పూజ, ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ.. దైవిక రక్షణను, కుటుంబాలకు ఆశీర్వాదం కోసం పురాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ప్రేమ, కరుణ, భక్తి ధర్మం వంటి విలువలు ప్రచారం కోసం గత 20 సంవత్సరాల నుండి హైదరాబాద్‌లో మాతా వైష్ణో దేవి విశాల్ జాగరణ్ పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. 13న సాయంత్రం ఏడు గంటలకు జమ్మూలోని మా వైష్ణో దేవి మాతా దేవాలయం ప్రధాన పూజారి బ్రహ్మోహీన్ అమీర్ చంద్ జి.పూజారి ఆశీస్సులతో ప్రస్తుత ప్రధాన పూజారి లోకేష్ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి మాతా వైష్ణో దేవి విశాల్ జాగరణ్‌ను ప్రారంభిస్తారన్నారు. మాతా కా జాగరణ్ అనేది ప్రధానంగా భక్తితో కూడిన కార్యక్రమాన్ని ఇందులో ప్రముఖ భక్తి గీతాల గాయనీగాయకులు రాజస్థాన్ నుండి ప్రకాష్ మాలి, ఢిల్లీ నుండి కరిస్మా శర్మ, మీనాక్షి శర్మ, హైదరాబాద్ నుండి మురారి దహిమ తదితరులు ఆరాధనలో భాగంగా భజనలు, భక్తి పాటలు ఆలపిస్తారని వెల్లడించారు. దాదాపు 20,000 మంది భక్తులు హాజరవుతారని జమ్మూలోని మా వైష్ణో దేవి మాతా ఆలయం నుండి తెచ్చిన 'ప్రసాదం' ఖజానా నాణేలను జాగరణ సందర్భంగా వచ్చే భక్తులకు ఉచితంగా అందజేస్తామని వారు తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు, ఎమ్మెల్యేలు రాజా సింగ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మ రావు గౌడ్, మైనంపల్లి రోహిత్, బీజేపీ హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థి మాధవి లతా తదితరులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందుతారని, ఈ పవిత్రమైన అవకా శాన్ని ఉపయోగించుకొని భక్తులందరు ఈ మా వైష్ణో దేవి మాతా జాగరణ్ వేలాదిగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేసారు.

ఫూలే ఆశయ సాధనకు కృషి చేయాలి











నవతెలంగాణ-అంబర్‌పేట:

మూడువేల ఏండ్ల మనువాదం నేటి వెనుక బాటుతనానికి మూల కారణమైందని మనువాదాన్ని మట్టికరిపించే మహెూద్యమాలే మహాత్మ జ్యోతి బా పూలేకు అర్పించే ఘన నివాళి అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్ బాబు అన్నారు. గురువారం అంబర్‌పేటలోని అలికేఫ్ చౌరస్తాలో జ్యోతిబాపూలే విగ్రహానికి కేవీపీఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎం.దశరథ్, బి.సుబ్బారావు, జిల్లా నాయకులు మహేందర్, జి. రాములు, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ బాల పీరు నాయకులు వై.శ్రీనివాస్, యు.గోవి, జి. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట:

దేశంలో కుల వ్యతిరేక ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కొనియాడారు. సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 198 వ జయంతి సందర్భంగా అంబర్‌పేట అలీ కేఫ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి డాక్టర్ దిడ్డి సుధాకర్ తోపాటు ఆప్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, దివ్యంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేష్ నేతలు శివాజీ, రాకేశ్ సింగ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి, మాజీ మంత్రి, సి.కృష్ణ యాదవ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమాల ఆనంద్ గౌడ్, బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు, డివిజన్ అధ్యక్షులు నాగభూషణం చారి సీనియర్ నాయకులు యశ్వంత్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముషీరాబాద్

మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ అడ్వకేట్ జెఏసి కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-ధూల్‌పేట్

మనువాదానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన యోధుడు జ్యోతిబా పూలే అని సీఐటీయు సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నాగేశ్వర్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పూలే 198 వ జయంతి నీ పురస్కరించుకొని బేగంబజార్ చౌరస్తా లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాలర్పించారు. ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. 150 సంవత్సరాల క్రితమే భారత దేశం లోని ప్రజల మధ్య అస మానతలకు కారణమైన కులవ్యవస్థ, దాన్ని ప్రోత్సహిస్తున్న మనుధర్మ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడిన ధైర్యశాలి పూలే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎన్. గోపాల్, కార్యకర్తలు నారాయణ, సురేష్ , నరేష్, జె.రాజు, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యం మెరుగుపడాలంటే..?!

నేటికాలంలో చాలామంది మొబైల్ ఫోన్లకు అలవాటుపడిపోయారు. రోజులో ఎక్కువ గంటలు కంప్యూటర్, మొబైల్ ఫోన్ల స్క్రీన్లు చూస్తుంటే వారి కంటి ఆరోగ్యం దెబ్బతింటుంది. దీంతో చిన్నవయసులోనే కండ్ల జోడ్లు వాడక తప్పని పరిస్థితి. మరి కంటి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సిట్రస్ పండ్లు : ఇవి కంటి ఆరోగ్యాన్ని పెంచుతాయని వైద్యులు చెబుతున్నారు. సీజన్లలో దొరికే బత్తాయి, నారింజ పండ్లలో కంటికి ఉపయోగపడే పోషకాలు మెండుగా ఉంటాయి. ముఖ్యంగా నారింజ పండులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, కెరోటినాయిడ్లు కంటిచూపును మెరుగుపరుస్తాయని వైద్యులు చెబుతున్నారు.

క్యారెట్ : ప్రతిరోజూ క్యారెట్ జ్యూస్ తాగితే కంటి చూపు మెరుగుపడుతుంది. చేపలలో ఉండే ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ కంటి ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.

ఆకుకూరలు : రోజూ మీరు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి. ఆకుకూరల్లోనూ బచ్చలికూర ఎక్కువగా తీసుకుంటే మంచిది.

లింగ వివక్ష ఇబ్బంది పెట్టినా...





పంకజ్ బదౌరియా... భారతదేశంలోనే మొట్టమొదటి మాస్టర్‌చెఫ్. ఇప్పుడు దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా తన పాకశాస్త్ర ప్రభావాన్ని విస్తరించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, న్యూయార్క్‌లోని వర్లీ ఫుడ్ ఫెస్టివల్, బీబీసీ సిరీస్ వంటి ప్రతిష్టాత్మక ప్లాట్‌ఫారమ్‌ల నుండి వచ్చిన ఆహ్వానాలతో విదేశాలలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రపంచవ్యాప్త వర్క్‌షాప్‌లు, మాస్టర్ క్లాస్‌లు, ఫుడ్ ఫెస్టివల్స్‌తో భారతీయ వంటకాల చక్కదనాన్ని, రుచిని విదేశీయులకు అందిస్తున్న ఆమె పరిచయం ఆమె మాటల్లోనే...

చిన్నతనంలో కూడా అంటే చెఫ్ అంటే ఏమిటో తెలియనప్పుడు, ఆహార తయారీ కూడా వృత్తిగా ఉంటుందని తెలియనప్పుడే ఆహారంతో నిత్యం ఏదైనా కొత్తగా చేయాలని కోరుకున్నాను. బహుశా మంచి ఆహారం పట్ల నాకున్న అభిమానమే దాని వెనుక ఉన్న ప్రేరణ అనుకుంటా. నా తల్లిదండ్రులు ఇద్దరూ వంట అద్భుతంగా చేసేవారు. నిజానికి అమ్మ పెళ్లయిన తర్వాతనే నాన్న, అమ్మమ్మ దగ్గర వంట నేర్చుకుంది. బంధువులు, చుట్టుపక్కల వారు మా ఇంట్లో పార్టీలకు రావడానికి ఎప్పుడూ ఎదురు చూస్తుండేవారు. ఎందుకంటే మా ఇంట్లో వండే వంటలు, వాటి ప్రదర్శన అద్భుతంగా ఉంటుందని వారందరికీ తెలుసు. అదే నాకు స్ఫూర్తినిచ్చింది. అమ్మా, నాన్న ఇద్దరూ కలిసి వంట చేయడం, నేను కూడా అమ్మకు వంటగదిలో సహాయం చేస్తూ వంట నేర్చుకున్నాను. అయితే మొదట్లో నేను వంటను వృత్తిగా తీసుకోలేకపోయాను. అయితే కొన్నేండ్ల తర్వాత మాస్టర్‌చెఫ్ ఇండియా కార్యక్రమం నా జీవిత గమనాన్ని మార్చివేసింది.

వ్యాపారవేత్తగా మారాలని

2010లో మాస్టర్‌చెఫ్ ఇండియాను గెలుచుకున్న తర్వాత నాలో నమ్మకం వచ్చింది. వ్యాపారవేత్తగా మారాలని నిర్ణయించుకున్నాను. దాంతో ఆగస్ట్ 2012లో పంకజ్ బదౌరియా క్యులినరీ అకాడమీని స్థాపించాను. నా స్వస్థలం లక్నోలో దీన్ని ప్రారంభించాను. వర్ధమాన చెఫ్‌లకు శిక్షణ ఇవ్వాలని, వారి కలల వృత్తిని ప్రారంభించడంలో వారికి సహాయపడాలని కోరుకున్నాను. నన్ను చాలా అందంగా స్వాగతించిన పరిశ్రమకు తిరిగి ఇచ్చే మార్గం కూడా ఇదే అని బలంగా నమ్మాను. నా కల నెరవేర్చుకోవడానికి నా భర్త కూడా తన ఉద్యోగాన్ని వదులుకున్నాడు. వాస్తవానికి ఆయన సపోర్ట్ లేకుండా నేను ఇదంతా చేయలేను.

> నా సొంత స్టూడియో కూడా ప్రారంభించాను. దీని అధ్వర్యంలో వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా భాగస్వామ్యం చేయడానికి కంటెంట్‌ను ఉత్పత్తి చేయడం ప్రారంభించాను.



ఎలాంటి అనుభవం లేదు

ఈ రంగంలోకి రాక ముందు నాకు 16 ఏండ్ల బోధనా అనుభవం ఉంది. వ్యాపారవేత్తగా ఎలాంటి అనుభవం లేదు. ఏదైనా హోటల్‌లో చెఫ్‌గా చేరడం కంటే ఇదే మంచి పద్ధతి అని నిర్ణయించుకున్నాను. అయితే నా భర్త ఎంబీఏ చేశాడు. ఆయన చదువు మా వ్యాపారానికి ఎంతో ఉపయోగపడింది. అతనికి ఉన్న పరిజ్ఞానంతో అకాడమీని ప్లాన్ చేయడం, అమలు చేయడం, నడిపించే బాధ్యత అతని భుజాలపై పడింది. నేను అకడమిక్ నిర్మాణాన్ని ప్లాన్ చేస్తున్నప్పుడు, నా డ్రీమ్ ప్రాజెక్ట్ సృష్టికి సంబంధించిన అన్ని ఇతర వివరాలను అతను ప్లాన్ చేసి అమలు చేసేవాడు. ఇలా నా భర్త నాకు అన్ని విధాల సపోర్ట్‌గా నిలబడ్డాడు.

ఏడు పుస్తకాలు రాశాను

వర్ధమాన చెఫ్‌లకు శిక్షణ ఇవ్వడంతో పాటు టెలివిజన్ కుకరీ షోలను హోస్ట్ చేస్తున్నాను. అలాగే వంటల పుస్తకాలు కూడా రాశాను. (ఇప్పటి వరకు ఏడు). నా అకాడమీకి సమయం కేటాయించడం, ప్రపంచాన్ని పర్యటించడం, స్పీకర్‌గా ఆహ్వానం పొందడం ఇలా అసంఖ్యాక ఈవెంట్‌లు, సెమినార్‌లు, TEDx సెషన్‌లతో పాటు సోషల్ మీడియా ఇప్పుడు చాలా పెద్ద విషయంగా మారిపోయింది. నా సొంత స్టూడియో కూడా ప్రారంభించాను. దీని అధ్వర్యంలో వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా భాగస్వామ్యం చేయడానికి కంటెంట్‌ను ఉత్పత్తి చేయడం ప్రారంభించాను.

నా పనే వారికి సమాధానం

స్త్రీలు ఎంత చేసిన ప్రజలు గుర్తించడం చాలా కష్టం. అలాగే నేను కొంతమందికి 'ఒక ప్రదర్శనలో విజేతను మాత్రమే'. అది నన్ను చాలా ఇబ్బంది పెట్టింది. కానీ నేను వారి మాటలను లైట్‌గా తీసుకున్నాను. అలాంటి వారి వద్ద నేను ఏదో సాధించి నిరూపించాల్సిన అవసరం లేదు. అయితే తర్వాత కాలంలో నా పనే వారికి సమాధానం చెప్పింది. చివరికి వారు కూడా నన్ను వ్యాపారం తెలిసిన స్త్రీని అని అంగీకరించారు. నా ప్రయాణంలో చాలా ఆశ్చర్యకరమైన విషయాలు ఉన్నాయి. అలాగే కొన్ని ఆహ్లాదకరమైనవీ ఉన్నాయి. అన్నింటి కంటే మహిళల పట్ల ఉన్న లింగ వివక్ష నన్ను ఇబ్బంది పెడుతుంది. అయితే నేను ఆ వివక్షను ఎదిరించి దాని కంటే పైకి ఎదగగలుగుతున్నాను అనేది మాత్రం వాస్తవం. ■

> నా ప్రయాణంలో చాలా ఆశ్చర్యకరమైన విషయాలు ఉన్నాయి. అలాగే కొన్ని ఆహ్లాదకరమైనవీ ఉన్నాయి. అన్నింటి కంటే మహిళల పట్ల ఉన్న లింగ వివక్ష నన్ను ఇబ్బంది పెడుతుంది. అయితే నేను ఆ వివక్షను ఎదిరించి దాని కంటే పైకి ఎదగగలుగుతున్నాను అనేది మాత్రం వాస్తవం.

కండ్లు తెరిచి కష్టపడండి

సమాజం నుండి నేను పొందిన ప్రేమ, ఆప్యాయత, గుర్తింపుతో నా హృదయం బరువెక్కిపోయింది. అయితే ఇది ఇలా దీర్ఘకాలం ఉంటుందని నేను ఊహించలేదు. నా ఆనందం, నా మొత్తం ఉనికి, నా మొత్తం పని, నా ఆనందం అన్నీ నా పిల్లలకు సంబంధించినవి. వారి అందమైన ముఖాలు నా కష్టాన్ని మర్చిపోయేలా చేస్తాయి. ఎప్పుడైనా పని ఒత్తిడిగా అనిపించినప్పుడు నాకెంతో ఇష్టమైన కవి రాబర్ట్ ఫ్రాస్ట్ రచించిన కొన్ని పంక్తులు గుర్తు చేసుకుంటాను. అవి నన్ను ముందుకు సాగమని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంటాయి. నేను నేటి యువతకు చెప్పేది ఒక్కటే. కలలు కనండి! దయచేసి కలగనండి! కలలు మనకు జీవించడానికి, ఆకాంక్షించడానికి, సాధించడానికి ఓ కారణాన్ని ఇస్తాయి! అయితే మీరు కండ్లు మూసుకుని కనే కలలు ఏవైనా, వాటిని సాధించడానికి మాత్రం మీ కండ్లు తెరిచి కష్టపడండి!.



పొద్దున్నే సంగీతం వింటే....?!



రోజూ ఉదయాన్నే చాలామంది బద్ధకంగా నిద్రలేస్తారు. లేచీ లేవగానే.. ఆరోజు చేయబోయే పనులను గుర్తుకు తెచ్చుకుంటే మరింత ఒత్తిడికి గురవుతారు. ఎంత ప్రణాళికలు వేసుకుని నిద్ర లేచినా.. మూడ్ సరిగ్గా ఉండదు. ఆ సమయంలో మీకు నచ్చిన పాటలు వింటే.. ఉల్లాసంగా ఉంటారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. పొద్దున్నే నిద్రలేవగానే.. ల్యాప్‌టాప్ ముందు పెట్టుకుని కాఫీ తాగుతూ.. ఈ-మెయిల్స్ చెక్ చేసుకోవడం.. వాటికి రిప్లయి ఇవ్వడం వంటివి జరుగుతూనే ఉంటాయి. ఆ పనులతోపాటు మీకిష్టమైన సంగీతం వింటే ఆరోజంతా ఎనర్జీగా ఉంటారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

- మీరు ఉదయాన్నే ప్రశాంతంగా కొంచెంసేపు సంగీతం వింటే మానసిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ఆరోజంతా మీరు సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తారు.
- పొద్దున్నే సంగీతం వింటే.. ఒత్తిడిని తగ్గిస్తుంది. సంగీతం ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను తగ్గిస్తుంది.
- మ్యూజిక్ మీ పనిపై ప్రభావం చూపుతుంది. ఏకాగ్రతతో పనిచేసేందుకు దోహదపడుతుంది. దీనివల్ల పని మరింత మెరుగ్గా చేయగలుగుతారు.
- హృదయ స్పందన రేటు పెరుగుతుంది.
- సంగీతం మీ సృజనాత్మకతకు ప్రేరణ కలిగిస్తుంది. కొత్త ఆలోచనలు వస్తాయి. కొత్త ఆవిష్కరణలకు ప్రేరేపిస్తుంది. ■

అందని వైద్యబీమా

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్, ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో మొత్తం ఖర్చులో కేంద్రం 90 శాతం వరకూ చెల్లించాలి. కొన్ని చోట్ల అయితే కేంద్ర ప్రభుత్వమే పూర్తి వ్యయాన్ని భరించాలి. అయితే వాస్తవానికి కేంద్రం చెల్లిస్తున్న వైద్య ఖర్చులు చాలా తక్కువగానే ఉంటున్నాయి. రాష్ట్రాలపైనే భారం ఎక్కువగా పడుతోంది. ఈ పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ ఇంకా 40 కోట్ల మందికి వైద్య బీమా లభించపోవడం గమనార్హం.

కేంద్రం ఇచ్చింది 28శాతం మాత్రమే

ఈ పథకం ప్రస్తుతం 23 రాష్ట్రాలలో అమలవుతోంది. రాష్ట్ర స్థాయిలో తమకు వేరే ఆరోగ్య బీమా పథకాలు ఉన్నాయన్న కారణంతో పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఢిల్లీ రాష్ట్రాలు ఇందులో చేరలేదు. బడ్జెట్ ప్రకారం 2019 నుండి 2023-24 వరకూ కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ఆస్పత్రి అడ్మిషన్ల కోసం రూ. 23,575.89 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి రూ.15,712, 26 కోట్లు సమకూర్చాయని అంచనా. అయితే ప్రభుత్వ గణాంకాలు మరోలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 2వ తేదీ నాటికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.80,000 కోట్లు ఖర్చు చేశామని పీఎంజేఏవై డాష్‌బోర్డు తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించిన ప్రీమియం కంటే ఇది రెండు రెట్లు అదనం. మొత్తం వ్యయం రూ.80,000 కోట్లలో కేంద్రం ఇచ్చింది రూ.23,575 అయితే మిగిలింది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు భరించినట్లే కదా. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే పీఎంజేఏవై కింద రాష్ట్రాలు 72శాతం సమకూర్చితే కేంద్రం విదిల్చింది కేవలం 28శాతం మాత్రమే.

లబ్దిదారుల ఎంపిక రాష్ట్రాలదే

ఆరోగ్యం అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశమే. అందులో సందేహం ఏమీ లేదు. అయితే ఇప్పటికే నిధుల పంపిణీ విషయంలో కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఆర్థికపరమైన సమస్యలు, వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పీఎంజేఏవై పథకం రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారాన్ని మోపుతోంది. పథకంలో ఎంతమంది లబ్దిదారులనైనా రాష్ట్రాలు చేర్చవచ్చు. ఇందులో కేంద్రం ప్రమేయం ఉండదు. లబ్దిదారుల ఎంపిక విషయంలో రాష్ట్రాలు వేర్వేరు సమాచారాలను పరిగణనలోకి తీసుకున్నాయి. ఇరవై రాష్ట్రాలు 2011 నాటి జనగణన లేదా ఎస్‌ఈసీసీ వివరాలను ఆధారంగా చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తమ పౌర సరఫరాల విభాగాలు అందించిన సమాచారంపై ఆధారపడ్డాయి. జార్ఖండ్ వంటి కొన్ని రాష్ట్రాలు ప్రజా పంపిణీ వ్యవస్థ గణాంకాలను ప్రామాణికంగా తీసుకున్నాయి.

పుదుచ్చేరి, ఉత్తరాఖండ్, లఢక్ వంటి కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కేంద్రం నిర్దేశించిన లక్ష్యాల కంటే ఒకటిన్నర రెట్లు అధికంగా లబ్దిదారులను ఎంపిక చేశాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాలు లక్ష్యాల కంటే 25శాతం అదనంగా లబ్దిదారులను ఎంపిక చేసుకున్నాయి. చాలా రాష్ట్రాలు మాత్రం లక్ష్యాలకు అనుగుణంగానే వ్యవహరించాయి. ఇంకొన్ని రాష్ట్రాలు తమకు లక్ష్యంగా నిర్దేశించిన లబ్దిదారుల సంఖ్యలో 32-80 శాతం మందిని మాత్రమే ఎంపిక చేశాయి.

కార్డుల జారీలో...

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ పథకానికి విశేష ప్రాచుర్యం కల్పించి పేదలు, మధ్య తరగతి ఓటర్లను ఆకర్షించాలని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో పీఎంజేఏవై కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. అయితే చాలా రాష్ట్రాలు మాత్రం దీనిపై పెద్దగా ముందడుగు వేయడం లేదు. 19 రాష్ట్రాలు జాతీయ స్థాయి (57.46శాతం) కంటే ఎక్కువగా 31 కోట్ల కార్డులు జారీ చేశాయి. 14 రాష్ట్రాలు జాతీయ స్థాయి కంటే తక్కువగానే కార్డులు ఇచ్చాయి. వీటిలో కేరళ, తమిళనాడు, కర్నాటక ఉన్నాయి. రాష్ట్ర స్థాయి పథకాలలో ఎక్కువ మంది లబ్దిదారులను చేర్చిన ప్రభుత్వాలు, పీఎంజేఏవై లక్ష్యం కంటే తక్కువగానే కార్డులు జారీ చేశాయి. బీహార్ రాష్ట్రంలో కేవలం లక్ష్యంలో 13శాతం మాత్రమే కార్డులు జారీ అయ్యాయి.

అందుబాటులో సుమారు 30 వేల ఆస్పత్రులు

పీఎంజేఏవై పథకం కింద వైద్య సేవలు పొందడానికి 17,135 ప్రభుత్వ, 12,626 ప్రైవేటు (మొత్తం 29,761) ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఒక్కో ఆస్పత్రిలో సగటున 48 బెడ్లు ఉన్నాయి. అంటే పథకం కింద వైద్య సేవలు పొందుతున్న 31.63 కోట్ల మందికి 14.28 లక్షల బెడ్లు అందుబాటులో ఉన్నాయన్న మాట. ఈ సంఖ్య తక్కువే అయినప్పటికీ జాతీయ సగటు (వెయ్యి మందికి 0.6 బెడ్లు) కంటే మాత్రం ఎక్కువే. జాతీయ స్థాయిలో ప్రతి లక్ష మంది లబ్దిదారులకు 9.41 ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయి. అయితే కేరళ వంటి 12 రాష్ట్రాల్లో జాతీయ స్థాయి కంటే తక్కువ సంఖ్యలోనే ఆస్పత్రులు ఈ పథకం కింద వైద్య సేవలు అందజేస్తున్నాయి. రాష్ట్రాల మధ్య మాత్రమే కాదు... రాష్ట్రంలోని కొన్ని జిల్లాల మధ్య కూడా ఆస్పత్రుల కేటాయింపు సరిగా జరగలేదు.

అవగాహనా లోపంతో...

ఈ పథకం కింద ప్రతి వెయ్యి మంది లబ్దిదారుల్లో సగటున సుమారు 160 మంది వైద్య సేవలు పొందుతున్నారు. అయితే మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, హర్యానా, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాల్లో వైద్య సేవలు పొందుతున్న వారి సంఖ్య జాతీయ సగటు (ప్రతి వెయ్యి మందికి 29 మంది) కంటే తక్కువగా ఉంది. ప్రజల్లో అవగాహన కల్పించకపోవడమే దీనికి కారణంగా చెప్పవచ్చు. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే పురుషులతో పోలిస్తే మహిళలు తక్కువ సంఖ్యలో ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు.

స్కాన్ చేయండి..స్కామ్ చూడండి

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోని అధికార బీజేపీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. అయితే, ఆ పార్టీకి మాత్రం ఊహించని పరిణామం ఏర్పడింది. అక్కడ బీజేపీకి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్కామ్(కుంభకోణం)కు పాల్పడిందంటూ పలు ప్రదేశాల్లో కనిపించాయి. ఈ పోస్టర్లలో పైభాగంలో 'జీ పే' అని రాసి ఉన్నది. ప్రధాని మోడీ ఫొటోతో పాటు దానిపై ఒక క్యూఆర్ కోడ్ ఉన్నది. "స్కామ్ చూడటానికి స్కాన్ చేయండి" అని దానిపై రాసి ఉన్నది.

ఆ పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఒక వీడియో ఓపెన్ అవుతున్నది. ఈ వీడియోలో ఒక వ్యక్తి.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ అవినీతి(ఆరోపిత) గురించి, కాగ్ నివేదిక హైలెట్ చేసిన అవకతవకల గురించి వివరిస్తూ కనిపిస్తుంది. పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో అవినీతి గురించి వివరించటమూ ఆ వీడియోలో ఉన్నది. అలాగే, బడా కార్పొరేట్లకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల మేర రుణాలను రైటాఫ్ చేసిందని ఆ వీడియో వివరించింది. బీజేపీని తిరస్కరించి, ఇండియా బ్లాక్‌కు మద్దతు తెలపండి అని ఓటర్లను కోరటం అందులో కనిపించింది. కాగా, ఈ పోస్టర్లను డీఎంకే కార్యకర్తలు పెట్టినట్టు తెలుస్తున్నది. తమిళనాడులోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలకు ఈనెల 19న ఒకే దశలో ఎన్నికలు జరగ నున్నాయి. ఎన్నికలకు ఒక వారం రోజుల సమయమే మిగిలి ఉండటం, బీజేపీ కేంద్ర అధినాయకత్వం రాష్ట్రంలోని ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తరుణంలో ఇలాంటి పోస్టర్లు తమిళనాడులో దర్శనమివ్వటం ఆ పార్టీకి ప్రతికూల అంశమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కేంద్రంలో అధికారంలోకి రాగానే కులగణన

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత పాశవిక ఆచారాలకు వ్యతిరేకంగా పోరాడి సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు తుది శ్వాస వరకు పోరాడిన పూలే ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని కుల సంఘాల నుంచి సలహాలు సూచనలు తీసుకుని పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకులు నవీన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి డాక్టర్ దనసరి సీతక్క పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి పట్టణంలోని గడియారం సెంటర్ లో పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శిపై వేటు

వైభవ్ కుమార్‌పై 2007లో నోయిడా పోలీసులు కేసు నమోదు చేశారు. కేజ్రీవాల్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా నియమించే సమయంలో ఆయన ఈ కేసు వివరాలు వెల్లడించలేదని విజిలెన్స్ విభాగం పేర్కొంది. లిక్కర్ స్కాంకు సంబంధించి ఈ నెల 8న వైభవ్ కుమార్‌ను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే.

ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తోన్న బీజేపీ : ఆప్

ఈ చర్యపై ఆప్ నేత జాస్మిన్ షా తీవ్రంగా మండిపడ్డారు. తప్పుడు కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, ఇప్పుడు ఆయన వ్యక్తిగత కార్యదర్శి సహా కేజ్రీవాల్ సిబ్బంది మొత్తాన్ని తొలగించే పని మొదలు పెట్టారని విమర్శించారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మరో ఆప్ ఎమ్మెల్యేపై ఈడీ దృష్టి

మరో ఆప్ నేతపై వేటు వేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమైంది. ఓఖ్లా ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌పై అరెస్ట్ వారెంట్ కోరుతూ ఈడీ బుధవారం ఢిల్లీ కోర్టుకు వెళ్లింది. ఢిల్లీ వక్ఫ్ బోర్డ్ నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయనను విచారణ చేయాలని కోరింది. దరఖాస్తుకు మద్దతుగా కొన్ని పత్రాలు దాఖలు చేయడానికి ఈడీ సమయం కోరడంతో సీబీఐ, ఈడీ ప్రత్యేక న్యాయమూర్తి రాకేష్ సియాల్ విచారణను ఏప్రిల్ 18కి వాయిదా వేశారు.

సమస్యలపై అవగాహన ఉన్న నేత కొప్పుల :కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా సమస్యలను అవగాహన చేసుకోవడంలో తమ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను మించిన నాయకుడు లేరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. సింగరేణి కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన రాజకీయంగా ఎదిగిరిన తీరు యువతకు ఆదర్శమని చెప్పారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన కొప్పుల ప్రజలకు ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ఎమ్మెల్యేగా, ప్రభుత్వంలో చీఫ్ విప్‌గా, మంత్రిగా అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. కొప్పులను ఎంపీగా ప్రజలు ఆశీర్వదిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ గురువారం ట్వీట్ చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ స్థానాల వారీగా సమన్వయకర్తలను నియమించినట్టు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.

గెలుపు బాధ్యత వారిదే...

(మొదటిపేజీ తరువాయి)

పై ఎత్తులు వేస్తున్నది. పార్లమెంటు ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి అప్పగించింది. తొమ్మిది నియోజకవర్గాలను ఏఐసీసీ ఇన్‌చార్జి రోహిత్ చౌదరికి, ఎనిమిది నియోజకవర్గాలను మరో ఏఐసీసీ ఇన్‌చార్జి పీసీ విష్ణునాథ్‌కు అప్పగించింది. అంతేకాకుండా ఒక్కొక్క పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక్కొక్క ఇన్‌చార్జీని నియమించింది. బూత్‌స్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా పార్టీ నాయకులకు స్పష్టమైన బాధ్యతలు అప్పజెప్పింది. ఎన్నికల్లో ఇన్‌చార్జీలే కీలకం కానున్నారు. గెలుపు బాధ్యతలు కూడా వారి భుజస్కందాలపైన్నే పెట్టింది. ఆ మేరకు ఇన్‌చార్జీలు ఎన్నికల రంగంలోకి దిగారు. కొంత మంది ఇన్‌చార్జీలు ఇంకా కదలని పరిస్థితులున్నాయి. అయితే ఎక్కువ మంది మంత్రులు తాము బాధ్యులుగా ఉన్న పార్లమెంటరీ నియోజకవర్గాల్లో అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో సీఎం కూడా పాల్గొని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సందర్భంగా పండుగలు, శుభకార్యాలకు తప్పకుండా హాజరు కావాలి, ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడంతోపాటు కష్టాల్లో ఉన్నవారికి భరోసా కల్పించాలని, ప్రతి గడపను తట్టాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. పార్టీ ఓడినా, గెలిచినా ఆ బాధ్యత ఇన్‌చార్జీలదేనన్న సంకేతాలిచ్చారు. ముఖ్యంగా పార్టీలో నెలకొన్న అంతర్గత కమ్ములాటలు, గ్రూపులను సమన్వయం చేయడం ద్వారా నాయకులను ఏకతాటిపై నడిపించాలనే అంశాన్ని ఆయన సూచించారు. దాన్ని ఎవరూ అతిక్రమించినా వారి పట్ల పార్టీ సీరియస్‌గా ఉంటుందనే సంకేతాలిచ్చారు. ప్రతి ఒక్కర్ని సమన్వయం చేసుకుంటూ... ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతి ఓటర్ వద్దకు తీసుకెళ్లేలా ప్లాన్ చేశారు. ఆయా గ్రామాల్లో సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించడంతోపాటు ప్రజల్లో భరోసా కల్పించేలా మంత్రులు తమ హోదాను ఉపయోగించుకోవాలంటూ ఆదేశించారు. నల్లగొండ, పెద్దపల్లి, సికింద్రాబాద్, భువనగిరి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, చెవేళ్ల, మల్కాజిగిరి, మెదక్, జహీరాబాద్ నియోజకవర్గాల సమీక్ష సమావేశాలు ఇప్పటికే పూర్తయ్యాయి. వరంగల్, మహబూబాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు రంగంలోకి దిగాల్సి ఉంది. వీటిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ అభ్యర్థులను ప్రకటించడకపోవడంతో ఇంకా సమావేశాలు జరగలేదు. 17 నియోజకవర్గాల్లో పదింటిని మంత్రులకు అప్పగించగా, మిగిలిన ఏడు నియోజకవర్గాలను సీనియర్ నేతలకు అప్పగించారు. ఇన్‌ఛార్జీలంతా నామినేషన్ పర్వం మొదలుకుని ఓటింగ్ ప్రక్రియ ముగిసే వరకు దగ్గరుండి అన్ని పనులను చూసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన రోజే బహిరంగ సభను నిర్వహించడంతోపాటు జాతీయ నాయకులను సమన్వయం చేసుకోవాలి. నామినేషన్ కార్యక్రమలన్నిటిలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనేలా టీపీసీసీ షెడ్యూల్ సిద్ధం చేసింది. అంతేకాకుండా ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీతోపాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ప్రచార సభలకు రానున్నారు. తద్వారా కాంగ్రెస్ గెలుస్తుందన్న వాతావరణం తీసుకొచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేయాలని ఇన్‌చార్జీలను పార్టీ ఆదేశించింది.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలంటూ అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్‌ను కోరినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులందరూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని గురువారం సీఎం ట్వీట్ చేశారు.

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. బీసీలకు అంతర్జాతీయ స్థాయి గురుకులాలు నెలకొల్పుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందనీ, ఆ మేరకు మండలానికో గురుకులాన్ని వెంటనే ప్రారంభించాలని అన్నారు. మరో మూడేండ్లలో రానున్న ద్విశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మహాత్మా జ్యోతిబాపూలే సమున్నత విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల విషయంలో కేవలం మాటలకే పరిమితం కాకుండా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఆచరణలోకి తేవాలని డిమాండ్ చేశారు. పూలే బోధనలు, ఆశయాలు నేటికీ అనుసరణీయాలని కేటీఆర్ ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన ఆశయాలను మాజీ సీఎం కేసీఆర్ ఆచరణలో పెట్టారని గుర్తుచేశారు. విద్యతోనే వికాసం వస్తుందని నమ్మిన పూలే వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆయన ఆశయాలను బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో చేతల్లో చూపించామని తెలిపారు. అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ బీసీలను కేవలం రాజకీయాల కోసమే వాడుకుంటున్న కాంగ్రెస్ పార్టీపై బడుగు, బలహీన వర్గాలు కన్నెర్ర చేయడం ఖాయమని హెచ్చరించారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో గత పదేండ్లలో కేసీఆర్ బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక, రాజకీయరంగాల్లో అవకాశాలు కల్పించారని తెలిపారు.

ముంబయి ధనాధన్



- ఛేదనలో కిషన్, సూర్య, పాండ్య జోరు
- బెంగళూర్‌పై ముంబయి ఘన విజయం
- బెంగళూర్ 196/8, ముంబయి 199/3

నవతెలంగాణ-ముంబయి

ముంబయి ఇండియన్స్ జోరందుకుంది. సొంతగడ్డపై వరుసగా రెండో విజయం సాధించింది. వాంఖడేలో 197 లక్ష్యాన్ని 15.3 ఓవర్లలోనే ఊదేసిన ముంబయి 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఛేదనలో ఇషాన్ కిషన్ (69, 34 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సులు), సూర్యకుమార్ యాదవ్ (52, 19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులు) అర్థ సెంచరీలు బాదగా.. రోహిత్ శర్మ (38, 24 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు), హార్దిక్ పాండ్య (21 నాటౌట్, 6 బంతుల్లో 3 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడారు. తిలక్ వర్మ (16 నాటౌట్, 10 బంతుల్లో 3 ఫోర్లు) సైతం మెరవటంతో మరో 27 బంతులు ఉండగానే ముంబయి లాంఛనం ముగించింది.
అంతకుముందు, జశ్‌ప్రీత్ బుమ్రా (5/21) ఐదు వికెట్లతో విజృంభించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. దినేశ్ కార్తీక్ (53 నాటౌట్, 23 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులు), రజత్ పాటిదార్ (50, 26 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు), డుప్లెసిస్ (61, 40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) అర్థ సెంచరీలు సాధించారు.

బుమ్రా ఐదేశాడు :
బెంగళూర్ ఇన్నింగ్స్‌లో ఫామ్‌లో ఉన్న ఓపెనర్ విరాట్ కోహ్లి (3) సహా విల్ జాక్స్ (8) పవర్‌ప్లేలోనే డగౌట్‌కు చేరుకున్నారు. డుప్లెసిస్ (61), రజత్ పాటిదార్ (50) మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. అర్థ సెంచరీలతో మెరిసిన ఈ ఇద్దరూ బెంగళూర్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. జశ్‌ప్రీత్ బుమ్రా పరుగుల పొదుపుతో పాటు రెండుసార్లు వరుస వికెట్ల ప్రతాపంతో బెంగళూర్‌ను దెబ్బకొట్టాడు. వికెట్లు పడుతున్నా దూకుడుగా ఆడిన బెంగళూర్ రన్‌రేట్ విషయంలో రాజీపడలేదు. గ్లెన్ మాక్స్‌వెల్ (0), మహిపాల్ లామ్రోర్ (0), విజయ్ కుమార్ (0)లు డకౌట్‌గా నిష్క్రమించారు. డెత్ ఓవర్లలో దినేశ్ కార్తీక్ (53



నాటౌట్) దంచికొట్టాడు. 21 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన దినేశ్ కార్తీక్ ఇన్నింగ్స్ ఆఖరు ఓవర్లో 19 పరుగులు పిండుకున్నాడు. దీంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 196 పరుగులు చేసింది. డుప్లెసిస్, రజత్ జోడీ 47 బంతుల్లో 82 పరుగులు జోడించగా.. కార్తీక్, డుప్లెసిస్‌లు 26 బంతుల్లో 45 పరుగులు జతచేశారు. ముగ్గురు బ్యాటర్లు అర్థ సెంచరీలు సాధించినా.. బుమ్రా బూమ్‌బూమ్‌తో బెంగళూర్ 200 లోపే స్కోరుకే పరిమితమైంది.

సింధుకు చుక్కెదురు

- ప్రీ క్వార్టర్‌ఫైనల్లో పరాజయం
- తనీశ, అశ్విని జోడీ, ప్రణయ్ సైతం
- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్



2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట టీమ్ ఇండియా షట్లర్లకు గట్టి ఎదురుదెబ్బ. పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు ఆశిస్తున్న మన షట్లర్లు.. బ్యాడ్మింటన్ పవర్‌హౌస్‌లు తలపడే ఆసియా చాంపియన్ షిప్స్‌లో సత్తా చాటాలని తపించారు. కానీ వరల్డ్ నం.1 జోడబీ సాత్విక్, చిరాగ్‌లు పోటీ నుంచి తప్పుకోగా.. బరిలో నిలిచిన అగ్ర షట్లర్లు సింధు, లక్ష్యసేన్, ప్రణయ్, శ్రీకాంత్‌లు మట్టి కరిచారు. ఆసియా బ్యాడ్మింటన్ వైఫల్యంతో భారతబ్యాడ్మింటన్ క్రీడాకారులు మరింత ఒత్తిడిలో పడ్డారు!.

నింగ్‌బో (చైనా) : ప్రతిష్టాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత షట్లర్ల పోరాటానికి తెరపడింది. జంబో బృందంతో చైనాకు చేరుకున్న భారత బ్యాడ్మింటన్ జట్టు.. రెండో రౌండ్‌కే చాప చుట్టేసింది. 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట ఫామ్‌లోకి రావాలని ప్రయత్నిస్తున్న రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలైంది. 69 నిమిషాల పాటు సాగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో పి.వి సింధు పోరాడినా ఓటమి తప్పలేదు. మ్యాచ్‌కు ముందు చైనా షట్లర్, ఆరో సీడ్ హన్ వీపై 5-0 క్లీన్ రికార్డుతో బరిలోకి దిగిన సింధు మూడు గేముల మ్యాచ్‌లో నిరాశపరిచింది. 18-21, 21-13, 17-21తో సింధు పోరాడి ఓడింది. ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌ను సింధు దూకుడుగా మొదలెట్టింది. 8-4తో ఆరంభంలోనే ఆధిక్యం దక్కించుకుంది. 14-8తో మరింత ముందుకెళ్లిన సింధు ఆ తర్వాత వరుస తప్పిదాలు చేసింది. సుదీర్ఘ ర్యాలీలతో సింధుపై పైచేయి సాధించిన చైనా షట్లర్ 15-15తో స్కోరు సమం చేసింది. గేమ్‌ను నియంత్రణలోకి తీసుకున్న హన్.. వెనక్కి తగ్గలేదు. 21-18తో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. కీలక రెండో గేమ్‌లో సింధు ఎదురుదాడి చేసింది. దూకుడుగా ఆడుతూ పాయింట్ల వేట సాగించింది. దీంతో 16-8తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పుంజుకునేందుకు చైనా అమ్మాయి ఎన్ని ప్రయత్నాలు చేసినా సింధు జోరు తగ్గలేదు. 21-13తో రెండో గేమ్‌ను సింధు సొంతం చేసుకుంది. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. డిసైడర్‌లో సింధుకు మంచి ఆరంభం దక్కినా.. తెలుగు తేజం సద్వినియోగం చేసుకోలేదు. 8-4తో చైనా అమ్మాయి ముందంజలోకి వెళ్లింది. లాంగ్ ర్యాలీలతో దూకుడు ప్రదర్శించిన చైనీస్ షట్లర్ ఈ క్రమంలో తప్పిదాలు చేసింది. దీంతో 10-10తో స్కోరు సమమైంది. ఈ సమయంలో పుంజుకున్న హన్ 17-10తో భారీ ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత సింధు చేసిన ప్రయత్నం పాయింట్ల అంతరం కుదించేందుకే సరిపోయింది. 21-17తో నిర్ణయాత్మక గేమ్‌తో పాటు క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను సైతం హన్ వీ సొంతం చేసుకుంది.

ముగిసిన పోరాటం : ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత పోరాటానికి తెరపడింది. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ పరాజయం పాలైంది. ప్రీ క్వార్టర్‌ఫైనల్లో 17-21, 12-21తో మూడో సీడ్ జపాన్ షట్లర్ల చేతిలో అశ్విని, క్రాస్టో ఓటమి చెందారు. తొలి రౌండ్లో భారత షట్లర్లకు వాకోవర్ లభించిన సంగతి తెలిసిందే. ఇక పురుషుల సింగిల్స్ విభాగంలో హెచ్.ఎస్ ప్రణయ్ సైతం పరాజయం పాలయ్యాడు. ఏడో సీడ్ ప్రణయ్ 18-21, 11-21తో అన్‌సీడెడ్ చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ యి చేతిలో కంగుతిన్నాడు.

ఐపీఎల్ 2024 పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	వి	ఓ	పా
1 రాజస్థాన్	05	04	01	08
2 కోల్‌కత	04	03	01	06
3 లక్నో	04	03	01	06
4 చెన్నై	05	03	02	06
5 హైదరాబాద్	05	03	02	06
6 గుజరాత్	06	03	03	06
7 ముంబయి	05	02	03	04
8 పంజాబ్	05	02	03	04
9 బెంగళూర్	06	01	05	02
10 ఢిల్లీ	05	01	04	02

మ్యా : మ్యాచులు, వి : విజయాలు, ఓ : ఓటములు, పా : పాయింట్లు

పోరాడి ఓడిన నాగల్

- రెండో రౌండ్లో సుమిత్ ఓటమి
- మోంటే కార్లో మాస్టర్స్ 20224

మోంటే కార్లో (మొనాకో) : భారత వర్థమాన టెన్నిస్ క్రీడాకారుడు సుమిత్ నాగల్ మోంటే కార్లో మాస్టర్స్ 2024 టోర్నమెంట్‌లో పోరాడి ఓడాడు. ఏటీపీ 1000 టోర్నీ ప్రధాన డ్రాకు చేరుకోవటంతోనే రికార్డులు పరంపర మొదలుపెట్టిన నాగల్ తొలి రౌండ్లో అసమాన విజయంతో అందరి దృష్టిని ఆకర్షించాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో సుమిత్ నాగల్ పోరాడి ఓడాడు. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో 3-6, 6-3, 2-6తో సుమిత్ నాగల్ పరాజయం పాలయ్యాడు. వరల్డ్ నం.7, డెన్మార్క్ ఆటగాడు హోల్గర్ రూనెపై నాగల్ ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. తొలి, చివరి సెట్‌లో వెనుకంజ వేసినా రెండో సెట్‌లో చెప్పుకోదగిన విజయం సాధించాడు. రెండు గంటల 11 నిమిషాల మ్యాచ్‌లో సుమిత్ నాగల్ మూడు బ్రేక్ పాయింట్లతో మెరువగా.. డెన్మార్ ఆటగాడు



రూనె ఐదు బ్రేక్ పాయింట్లతో పైచేయి సాధించాడు. పాయింట్ల పరంగా నాగల్ 70-88తో గట్టి పోటీ ఇచ్చాడు. రూనె 15 గేములు గెల్చుకోగా.. సుమిత్ నాగల్ 11 గేమ్‌లతో మెప్పించాడు. మోంటో కార్లో మాస్టర్స్ టోర్నమెంట్‌లో ఓ భారత ఆటగాడికి ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావటం గమనార్హం.


దిగొచ్చిన ఫ్రెంచ్ అథ్లెటిక్స్!

భారత అథ్లెట్ల పోటీకి అనుమతి

పారిస్ : ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య జోక్యంతో ఫ్రెంచ్ అథ్లెటిక్స్ నిర్వాహకులు దిగి వచ్చారు. ఇటీవల వాడా విడుదల చేసిన 2022 వార్షిక డోపింగ్ నివేదిక ప్రకారం భారత్‌లో అత్యధిక శాతం పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. డోపింగ్ అంశంలో ఎటువంటి రిస్క్ తీసుకునే ఆలోచనలో లేని ఫ్రెంచ్ అథ్లెటిక్స్.. అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్యాలెండర్‌లో భాగమైన ' ది మీటింగ్ డె లిమోగస్' టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్న ముగ్గురు భారత అథ్లెట్లను పోటీ నుంచి దూరం పెట్టింది. ఫ్రెంచ్ అథ్లెటిక్స్ నిర్వాహకుల నిర్ణయం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించింది. దీంతో టోర్నీ నిర్వాహకులు తప్పిదాన్ని సరిదిద్దుకున్నారు. ముగ్గురు భారత అథ్లెట్లు పోటీపడవచ్చని తాజాగా ఓ



ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా, వాడా నివేదిక ప్రకారం భారత్‌లో 3865 శాంపిల్స్ (బ్లడ్, యూరీన్)ను పరీక్ష చేశారు. ఇందులో 3.2 శాతం అనగా 125 శాంపిల్స్ పాజిటివ్‌గా తేలాయి. కనీసం 2000 శాంపిల్స్ పరీక్ష చేసిన దేశాల్లో భారత్‌లోనే అత్యధిక పాజిటివ్ రేటు నమోదైంది. ఫ్రెంచ్ అథ్లెటిక్స్ నిర్వాహకులు భారత అథ్లెట్లను పోటీకి నిరాకరించటం, మళ్లీ పోటీకి అనుమతించటం పట్ల భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధ్యక్షుడు అదిలె సుమారివాలా స్పందించలేదు.



డాక్టర్.. రామ్‌చరణ్

రామ్‌చరణ్

కథానాయకుడు రామ్ చరణ్‌కి మరో అరుదైన గౌరవం లభించింది. చెన్నైకు చెందిన ప్రముఖ వేల్స్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందిస్తోంది.
ఈ యూనివర్సిటీ అందిస్తున్న డాక్టరేట్‌తో ఆయన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డైరెక్టర్ శంకర్ వంటి వారి సరసన చేరటం విశేషం. సినిమా, దాన్ని మించిన ఆయన ప్రభావమే ఈ డాక్టరేట్ అందుకోవడానికి కారణమని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట వ్యక్తులను గుర్తించి వారికి గౌరవ డాక్టరేట్స్ ఇవ్వటంలో వేల్స్ యూనివర్సిటీ ప్రసిద్ధి చెందింది. ఈ ఏడాదికిగానూ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఎంటర్‌ప్రెన్యూరర్‌గా రామ్ చరణ్ చేసిన సేవలకు వేల్స్ యూనిర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందచేస్తోంది. ఈ వేడుక ఈనెల 13న గ్రాండ్‌గా జరగనుంది. తమ అభిమాన హీరోకు దక్కిన గౌరవానికి రామ్‌చరణ్ అభిమానులు ఎంతో సంతోషంగా ఉన్నారు.

ఓ సాధారణ వ్యక్తి భారీగా డబ్బు సంపాదిస్తే?



దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ తాజాగా 'లక్కీ భాస్కర్' అనే బహు భాషా చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు.
ఈ సినిమాలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్‌కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. రంజాన్‌ను పురస్కరించుకుని తాజాగా చిత్ర టీజర్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఒక సాధారణ వ్యక్తి, అసాధారణ స్థాయికి ఎలా చేరుకున్నాడు అనే ఆసక్తిని రేకెత్తిస్తూ రూపొందించిన టీజర్ ఆకట్టుకుంటోంది. ఒక మధ్యతరగతి వ్యక్తి, భారీ మొత్తంలో డబ్బు ఎలా సంపాదించాడు? అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనే ప్రశ్నలతో టీజర్‌ని మలిచిన తీరు మెప్పించింది. అలాగే టీజర్‌లో దుల్కర్ సల్మాన్ పలికిన సంభాషణలు, కెమెరా పనితనం, నేపథ్య సంగీతం కట్టిపడేశాయి.
సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందిన 'సార్/వాతి' వంటి ఘన విజయం తర్వాత దర్శకుడు వెంకీ అట్లూరితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ రూపొందిస్తున్న సినిమా కావడం విశేషం.
మీనాక్షి చౌదరి ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్‌కి జోడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

భక్తురాలిని కాపాడే అమ్మవారి కథ



మంచు లక్ష్మీ

"ఆదిపర్వం' అమ్మవారి కథ, అమ్మవారిని నమ్ముకున్న ఓ భక్తురాలి కథ, ఆ భక్తు రాలిని దుష్ట శక్తుల నుండి కాపాడే ఓ క్షేత్రపాలకుడి కథ. మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి సంజీవ్ కుమార్ మేగోటి దర్శకుడు. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక్సా ఆర్ట్స్ - ఎ.ఐ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో ఐదు భాషల్లో (తెలుగు - కన్నడ - హిందీ - తమిళ - మలయాళ) ఈ సినిమా రూపుదిద్దు కుంది. 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలోని పాటలు అన్విక ఆడియో ద్వారా విడుదల య్యాయి. సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్, ఎమ్.ఎమ్. శ్రీలేఖ, రఘు కుంచె, ఘంటాడి క్రిష్ణ ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన పాటలను ఆవిష్కరించారు. దర్శకుడు సంజీవ్ కుమార్ మేగోటి మాట్లాడుతూ, 'బహు భాషల్లో రూపొందిన ఈ చిత్రం ఇంత బాగా రావడానికి మాకు సహకరించిన మంచు లక్ష్మికి ఎప్పటికీ రుణపడి ఉంటాం' అని చెప్పారు.
ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, శివకంఠంనేని, సత్యప్రకాష్ ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

నవచిత్రం

విశ్వం విలనా..హీరోనా?



గోపీచంద్

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబో ఈద్ సందర్భంగా ఫస్ట్ స్ట్రైక్ వీడియోను విడుదల చేయడంతో మాస్ ఫీస్ట్‌ని అందించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై టిజి విశ్వ ప్రసాద్, చిత్రాలయం స్టూడియోస్ పై వేణు దోనేపూడి నిర్మిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రానికి 'విశ్వం' అనే పవర్‌ఫుల్ టైటిల్ పెట్టారు.
వధూవరులు పెళ్లి మండపంలోకి రావడం, సంగీత విద్వాంసుల బృందం వివిధ వాయిద్యాలను వాయిస్తూ, పూజారి మంత్రాలు పఠించడం, రుచికరమైన ఆహారాన్ని సిద్ధం చేస్తున్న చెఫ్‌లు.. ఇలా వివాహ వేడుకలతో ఫస్ట్ స్ట్రైక్ వీడియో ప్రారంభమవుతుంది. గోపీచంద్ పెద్ద గిటార్ కేస్‌ని భుజంపై వేసుకుని పెళ్లి వేదిక వైపు నడుస్తూ ఎంట్రీ ఇచ్చారు. అది గిటార్ కాదు, మెషిన్ గన్. ఆశ్చర్యకరంగా, అతను వధూవరులను, వివాహానికి వచ్చిన అతిథులందరినీ కాల్చడం ప్రారంభిస్తారు. చివరగా, అతను అక్కడ ఫుడ్‌ని ఆస్వాదిస్తూ, "దానే దానే పే లిఖా, ఖానే వాలే కా నామ్... ఇస్పే లిఖా మేరే నామ్..' అని చెప్పడం చాలా పవర్‌ఫుల్‌గా ఉంది.
ఇందులో గోపీచంద్‌ని నెగెటివ్ షేడ్‌లో చూడటం నిజంగా సర్ప్రైజింగ్‌గా ఉంది. ఆయన డైలాగ్ పలికిన విధానం క్యారెక్టర్ గ్రే షేడ్‌ని సూచిస్తుంది.
శ్రీను వైట్ల ఫస్ట్ స్ట్రైక్‌ని మాస్ ఫీస్ట్‌గా చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. గోపీచంద్‌ని ఒక విభిన్నమైన పాత్రలో చూపించారు. కేవీ గుహన్ నైపుణ్యం ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. చైతన్ భరద్వాజ్ స్కోర్ సినిమా సాంకేతికంగా ఎంత రిచ్‌గా ఉందో తెలియజేస్తుంది. అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్ కన్నుల విందును అందిస్తుంది. దీనికి గోపీ మోహన్ స్క్రీన్‌ప్లే రాశారు. అమర్‌రెడ్డి కుడుముల ఎడిటర్‌గా, కిరణ్ మన్నె ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే వెల్లడి చేస్తామని మేకర్స్ తెలిపారు.

సంక్షేమం.. జవాబుదారీతనం కోసం



ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక మార్పులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో పత్రికా రంగంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకొంటున్నాయి. ప్రధాన మీడియాతోపాటు డిజిటిల్ మీడియాలో వెబ్‌సైట్స్, సోషల్ మీడియా, ఇన్ఫ్లుయెన్సర్లు ప్రసార, సమాచారం రంగంలో కీలక పాత్రను పోషిస్తున్నారు. అయితే వేగంగా మార్పులు జరుగుతున్న కారణంగా జవాబుదారీతనం లోపిస్తున్నదనే విమర్శలు, వాదనలు వినిపిస్తున్నాయి.
ఈ క్రమంలో వార్తల ప్రసారం, ప్రచురణ విషయంలో జవాబుదారీతనం ఉండేలా.. కొన్ని ప్రతికూల అంశాలను కంట్రోల్ చేసేందుకు, టార్గెట్ ఆడియెన్స్‌కు వాస్తవాలను చేరవేసేందుకు తెలుగు సినీ, మీడియా రంగానికి సంధాన కర్తగా వ్యవహరించే విధంగా తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ ఆవిర్భవించింది. తెలుగు ఫిలిం జర్నలిస్టు అసోసియేషన్‌కు అనుబంధంగా సేవలు అందించేందుకు ఈ అసోసియేషన్ ఏర్పాటు జరిగింది. ఈ ఆవిర్భావ సమావేశంలో నిర్మాతలు దిల్ రాజు, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే టీఎఫ్‌జేఏ కార్య నిర్వాహక కమిటీ సభ్యులు కూడా హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలుగు ఫిలిం డిజిటల్ మీడియా అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రకటించారు.
ఈ అసోసియేషన్ కార్యవర్గంలో అధ్యక్షులుగా ప్రేమ మాలిని, ప్రధాన కార్యదర్శిగా వీఎస్ఎన్ మూర్తి, కోశాధికారిగా శివ మల్లాల, ఉపాధ్యక్షులుగా నిశాంత్ ఎన్, రాజబాబు అనుముల, సంయుక్త కార్యదర్శిగా బి.వేణుగోపాల్, ఎండీ అన్వర్‌తోపాటు 30 మంది కార్యవర్గ సభ్యులు ఉన్నారు.
ఈ సమావేశంలో దిల్ రాజు మాట్లాడుతూ,'సినీ జర్నలిస్టులు, సినిమా పరిశ్రమ ఓ కుటుంబంలా ఉంటుంది. ఎప్పటి మాదిరిగానే టీఎఫ్‌జేఏకు అందించిన సహకారం, ప్రోత్సాహాన్ని నూతనంగా ఎంపికైన అసోసియేషన్‌కు ఉంటుంది. జవాబుదారీతనం లక్ష్యంగా సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నా' అని అన్నారు.
'సమాజంలో జర్నలిజాన్ని ఫోర్త్ ఎస్టేట్ అంటారు. వాస్తవాలను నిష్పక్షపాతంగా అందించాలని కోరుకుంటున్నా. పోటీ ప్రపంచంలో వేగంగా వార్తలు అందించాలనే ప్రయత్నంలో కొన్ని అవాస్తవాలను ప్రజల్లోకి వెళ్లకుండా చూసుకోవాలని సూచిస్తున్నాను' అని మరో నిర్మాత దాము చెప్పారు.

ప్రతి ఏటా దర్శకరత్న డి.ఎన్.ఆర్.ఫిల్మ్ అవార్డ్స్



దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణ రావు 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆయన ప్రియ శిష్యులు సన్నాహాలు చేస్తున్నారు. దాసరి బహుముఖ ప్రతిభను నేటి తరానికి గుర్తు చేస్తూ... వారిలో స్ఫూర్తిని నింపేందుకు 'దర్శకరత్న డి.ఎన్.ఆర్.ఫిల్మ్ అవార్డ్స్' పేరిట తెలుగు సినిమా రంగానికి చెందిన వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పట్టం కట్టి, దాసరికి ఘన నివాళులు అర్పించనున్నారు.
దర్శకరత్నతో సుదీర్ఘమైన అనుబంధం కలిగిన దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకులు రేలంగి నరసింహారావు - నిర్మాత సి.కళ్యాణ్ అధ్యక్ష కార్యదర్శులుగా ఇందుకోసం ఏర్పాటైన కమిటీలో ఆడిటర్‌గా, ఆర్థిక సలహాదారుగా బి.ఎస్.ఎన్. సూర్యనారాయణ, ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు, ధీరజ అప్పాజీ సభ్యులుగా ఉన్నారు. హైదరాబాద్, శిల్పకళావేదికలో అత్యంత వైభవంగా మే 5న ఈ వేడుక నిర్వహించనున్నారు. తమ్మారెడ్డి మాట్లాడుతూ, 'దశాధిక రంగాల్లో రాణించిన దాసరికి నివాళులు అర్పిస్తూ అభినవ దర్శకరత్న, అభినయ రత్న, నిర్మాణరత్న, పంపిణీరత్న, ప్రదర్శనారత్న, కథారత్న, సంభాషణారత్న, గీతరత్న, పాత్రికేయరత్న, సేవారత్న పురస్కారాలు ప్రదానం చేయనున్నాం. ఇతర అవార్డులను స్మాల్ అండ్ మీడియం బడ్జెట్ సినిమాల నుంచి ఎంపిక చేయనున్నాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.